
'సంక్షేమ పథకాలతో ఎప్పటికీ ప్రజల మనస్సుల్లో ఉండిపోతాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 160

మంగళవారం 30-8-2022

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | DELHI | BANGALORE | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL




పండ్లు కోసే రోబోలు

గాల్లో ఎగురుతూ ఎత్తయిన చెట్ల నుంచి పండ్లు కోసే రోబోలపై కథనం - 11లో



భారీ పతనం

వడ్డీ రేట్ల పెంపు ప్రకటనతో సెన్సెక్స్ 861 పాయింట్లు క్రాష్ - 13లో



'రఫేల్'పై వ్యాజ్యం కొట్టివేత

రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలుపై దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించింది.

వివరాలు 6లో



ఒక్క ఆప్ ఎమ్మెల్యేనూ కొనలేరు

ఢిల్లీలోని ఆప్ సర్కార్‌ను పడగొట్టేందుకు బీజేపీ పన్నిన కుట్ర విఫలమైందని ఆ రాష్ట్ర సీఎం అరవింద్ కేజ్రీవాల్ చెప్పారు.

వివరాలు 6లో



నన్ను అరెస్ట్ చేయండి చూద్దాం

చేతనైతే తనను అరెస్ట్ చేయాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సవాల్ విసిరారు.

వివరాలు 6లో



'ఆర్టెమిస్-1' ప్రయోగం వాయిదా

చంద్రుడిపైకి 'నాసా' సోమవారం చేపట్టిన ఆర్టెమిస్-1 ప్రయోగం సాంకేతిక సమస్య వల్ల వాయిదా పడింది.

వివరాలు 6లో

ఏది నిజం?

రామోజీ.. నవయుగ.. ఓ పోలవరం!

- వియ్యంకుల కాంట్రాక్టు పోవటంతో రామోజీ కడుపు మంట
- ఏదో జరిగిపోతున్నట్లుగా ప్రతిరోజూ అసత్యాల వంట
- వరదలు ముందుగా రావటం వల్లే పనులు ఆగాయని తెలియదా?
- వరదలు తగ్గాక మళ్లీ పనులు మొదలవుతాయన్నదీ అంతే నిజం
- ఈ మధ్యలోనే రోజుకో అబద్ధంతో చెలరేగిపోతున్న 'ఈనాడు'
- పోలవరంలో 'ఏటీఎం'నే తప్ప ప్రాజెక్టును చూడని చంద్రబాబు
- కమీషన్లకు స్పిల్‌వే సగంలో వదిలి.. ఈసీఆర్‌ఎఫ్ పునాది పనులు
- ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను సైతం ఖాళీలతో వదిలేసిన తీరు
- స్పిల్‌వేకు గేట్ల బదులు రేకులు పెట్టిన 'జయము జయము చంద్రన్న'
- గడిచిన మూడేళ్లలో స్పిల్‌వే, స్పిల్ చానల్, అప్రోచ్ చానల్ పూర్తి
- ఎగువకాఫర్ డ్యామ్ పనులనూ పూర్తి చేయించిన సీఎం జగన్
- దిగువ కాఫర్ డ్యామ్ పూర్తి చేస్తుండగా అనూహ్యంగా వరద
- ఇవన్నీ విస్మరిస్తూ.. బాబుపై నింద పడకుండా రామోజీ తంటాలు

4లో

10 వేల మందికి పైగా

టీచర్లకు పదోన్నతి

డిప్యూటీ డీఈవో, ఎంఈవో, హెచ్‌ఎమ్‌లుగా ప్రమోషన్లు

- టీచర్ల పదోన్నతుల కోసం అదనంగా 666 ఎంఈవో, 36 డిప్యూటీ డీఈవో పోస్టులు
- 2,300 మంది టీచర్లకు సబ్జెక్టు మార్పు అవకాశం
- 22 ఏళ్ల సమస్యకు పరిష్కారం చూపిన సీఎం జగన్
- న్యాయ వివాదాలకు తావులేకుండా అందరికీ మేలు
- సెప్టెంబర్‌లో పదోన్నతులు.. తరువాత టీచర్ల బదిలీలు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పదివేల మందికిపైగా ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ శుభవార్త అందించనుంది. పదోన్నతులు, బదిలీలకు సంబంధించి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ అందడంతో టీచర్లకు మేలు చేసే ప్రక్రియకు త్వరలో శ్రీకారం చుట్టనుంది. 10 వేల మందికిపైగా టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా, ప్రధానోపాధ్యాయులుగా, మండల విద్యాశాఖాధికారులుగా, జిల్లా ఉప విద్యాశాఖాధికారులుగా పదోన్నతులు కల్పించనుంది. సెప్టెంబర్ నెల మొదటి వారంలోనే దీనికి సంబంధించిన ప్రక్రియ చేపట్టేలా షెడ్యూల్ సిద్ధం చేసింది.

7 వేల మంది ఎస్జీటీలకు ఎస్‌ఏలుగా పదోన్నతి

రాష్ట్రంలో విద్యావ్యవస్థను పునాది నుంచి బలోపేతం చేస్తూ ప్రభుత్వం ఫౌండేషనల్ విద్యా విధానాన్ని తెచ్చిన సంగతి తెలిసిందే. దేశంలోనే తొలిసారిగా ప్రభుత్వ స్కూళ్లలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టింది. 3 నుంచి 8 ఏళ్ల మధ్య పిల్లల్లో మేధోపరమైన వికాసం గరిష్టంగా ఉంటుందని పలు శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడించిన నేపథ్యంలో వారికి నాణ్యమైన బోధన అందేలా ఏర్పాట్లు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో

మిగతా 2వ పేజీలో ▶

22 ఏళ్ల కల సాకారం

వేల మంది స్కూల్ అసిస్టెంట్ టీచర్లు తమ సబ్జెక్టుల మార్పుకోసం దాదాపు 22 ఏళ్లుగా ప్రభుత్వానికి విన్నపాలు చేస్తూ వచ్చారు. వారి గోడును గతంలో ఏ ప్రభుత్వమూ పట్టించుకోలేదు. సీఎం వారి విన్నపాన్ని సానుకూలంగా పరిష్కరించేలా ఆదేశాలిచ్చారు. ఈమేరకు స్కూల్ అసిస్టెంట్లు తమ అర్హతలను అనుసరించి సబ్జెక్టుల మార్పునకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. దీనివల్ల 2,300 మంది టీచర్లకు లబ్ధి చేకూరనుంది.

సీపీఎస్ ఉద్యోగుల ఆందోళన వాయిదా

- ఒకటిన విజయవాడ రావద్దు
- స్థానిక కార్యాలయాల్లోనే నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలపండి
- సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వెల్లడి



సాక్షి, అమరావతి: సీపీఎస్ రద్దు కోరుతూ సీపీఎస్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన వాయిదా పడింది. సెప్టెంబర్ 1న తలపెట్టిన ఛలో విజయవాడ, మిలియన్ మార్చ్ సభ వాయిదా పడ్డాయి. పరిస్థితులు అనుకూలంగా లేని కారణంగా ఈ కార్యక్రమాలను వాయిదా వేస్తున్నట్లు ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) ప్రధాన కార్యదర్శి కె.పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ ఒకటిన సీపీఎస్ ఉద్యోగులు ఎవరూ విజయవాడ రావద్దని ఆయన కోరారు. ఆ రోజు స్థానిక కార్యాలయాల్లోనే నల్ల బ్యాడ్జీలతో శాంతియుతంగా నిరసన తెలపాలని సూచించారు. గత ఏడేళ్లుగా శాంతియుతంగానే సీపీఎస్ రద్దు కోసం ఆందోళనలు నిర్వహించామని తెలిపారు. పోలీసుల అనుమతితోనే ఇప్పటివరకు

మిగతా 2వ పేజీలో ▶

దీపావళికల్లా 5జీ సర్వీసులు

- రిలయన్స్ ఇండస్ట్రీస్ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింతగా దూకుడుగా విస్తరించనుంది. 5జీపై రూ.2 లక్షల కోట్లు, చమురు.. పెట్రోకెమికల్స్ వ్యాపారంపై వచ్చే 5 ఏళ్లలో రూ.75,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. 5జీ సేవలను అక్టోబర్‌లో(దీపావళి నాటికి) అందుబాటులోకి తేనుంది. 2023 చివరికల్లా దేశవ్యాప్తంగా ఈ సేవల్ని విస్తరించనుంది. అలాగే అదానీ గ్రూప్‌ను ఢీకొట్టేందుకు ఎఫ్‌ఎంసీజీ రంగంలోకి ఎంట్రీ ఇవ్వబోతోంది.



13లో వారసులొచ్చేశారు..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు మొక్క అందజేస్తున్న ఒబెరాయ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాజారామన్ శంకర్

త్వరగా తేల్చండి

రాష్ట్ర విభజన సమస్యలపై ఎనిమిదేళ్లుగా వీడని చిక్కుముడులు

- సమస్యల పరిష్కారంతో పాటు నిర్ణయాల అమలు వ్యవస్థ ఉండాలి
- 3న తిరువనంతపురంలో దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశం
- భేటీలో చర్చించాల్సిన అంశాలపై అధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం
- వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాల నేపథ్యంలో సీఎంకు బదులు భేటీకి హాజరు కానున్న మంత్రి బుగ్గన బృందం
- రాష్ట్రం తరఫున అజెండాలో 19 అంశాలకు చోటు

సాక్షి, అమరావతి: రాష్ట్ర విభజన జరిగి ఎనిమిదేళ్లయినా సమస్యలు కొలిక్కి రాలేదని, వాటిని తక్షణమే పరిష్కరించాల్సిందిగా దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో డిమాండ్ చేయాలని అధికారులకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. సమస్యలకు పరిష్కారాలను సూచించే వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరాలన్నారు. ఆ వ్యవస్థ కేవలం పరిష్కారాలను చూపడమే కాకుండా దక్షిణాది రాష్ట్రాల మండలి తీసుకున్న నిర్ణయాలను అమలు చేసేదిగా ఉండాలని గట్టిగా డిమాండ్ చేయాలని సూచించారు. కేరళలోని తిరువనంతపురంలో సెప్టెంబర్ 3న కేంద్ర హోంమంత్రి అమిత్ షా అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాల మండలి భేటీ జరగనున్న నేపథ్యంలో భేటీలో చర్చించాల్సిన అంశాలపై సీఎం జగన్ సోమవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

జాప్యంతో మరింత నష్టం

దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో రాష్ట్రం తరఫున 19 అంశాలను అజెండాలో పొందుపరచినట్లు

మిగతా 2వ పేజీలో ▶

అది 'ఈనాడు' ఆత్మఘోష

రైతు ఆత్మహత్యలపై అసత్య కథనం: వ్యవసాయ శాఖ

- అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండ
- విత్తు నుంచి విక్రయం వరకు రైతన్నకు బాసట
- ఆర్బీకేల ద్వారా సర్టిఫై చేసిన నాణ్యమైన ఇన్‌పుట్స్
- గ్రామ స్థాయిలోనే వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలు
- మూడేళ్లలో రైతులకు నేరుగా రూ.1.28 లక్షల కోట్ల లబ్ధి
- టీడీపీ హయాంలో 1,004 మంది చనిపోయినట్లు నిర్ధారిస్తే అరకొరగా పరిహారం ఇచ్చింది 531 మందికే
- నాడు బాబు ఎగ్గొట్టిన 473 మందికి నేడు రూ.5 లక్షల చొప్పున పరిహారం
- వివిధ కారణాలతో మూడేళ్లలో చనిపోయిన 900 మందికి రూ.7 లక్షల చొప్పున పరిహారం

3లో

సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వండి

- ఒబెరాయ్ గ్రూప్ ప్రాజెక్ట్‌పై అధికారులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆదేశం
- సీఎంతో ఒబెరాయ్ గ్రూప్ ప్రెసిడెంట్ రాజారామన్ శంకర్ భేటీ
- ఏజెన్సీ ప్రాంతంలోనూ టూరిజం అభివృద్ధికి ఒబెరాయ్ ఆసక్తి
- ఇప్పటికే రూ.1,500 కోట్లతో 5 చోట్ల లగ్జరీ రిసార్టుల నిర్మాణానికి సంసిద్ధత
- ప్రత్యక్షంగా 1,500, పరోక్షంగా 11 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధిలో భాగంగా ఒబెరాయ్ ప్రాజెక్టులకు అవసరమైన అనుమతులన్నీ సింగిల్ విండో విధానంలో ఇవ్వాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారులను ఆదేశించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో ద ఒబెరాయ్ గ్రూప్ ప్రెసిడెంట్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రాజారామన్ శంకర్

మిగతా 2వ పేజీలో ▶

ఇదండీ సంగతి




కుదరకుంటే 2023 అక్టోబర్‌లో చూద్దాం.. అదీ కాకుంటే 2024లో ప్రయత్నిద్దాం!

రూ.6,756.92 కోట్ల కరెంట్ బాకీలు కట్టండి

ఏపీకి నెలలోగా చెల్లించాలని తెలంగాణ సర్కారుకు కేంద్రం ఆదేశం

- తెలంగాణ డిస్కమ్‌లకు 8,890 మిలియన్ యూనిట్లు సరఫరా చేసిన ఏపీ జెన్‌కో
- బకాయిలపై ఏళ్ల తరబడి మొండి వైఖరి
- పలుదఫాలు కేంద్రం దృష్టికి తెచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ప్రధానిని కలిసిన వారం రోజుల్లోనే బకాయిలపై ఉత్తర్వులు జారీ



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు సంస్థలకు దీర్ఘకాలంగా బకాయిపడ్డ రూ.6,756.92 కోట్లను నెల రోజుల్లోగా చెల్లించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కేంద్రం ఆదేశించింది. రాష్ట్ర విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అనివార్య పరిస్థితుల్లో తెలంగాణ డిస్కమ్‌లకు ఏపీ జెన్‌కో 8,890 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేసింది. 2014 జూన్ 2 నుంచి 2017 జూన్ 10 వరకూ తెలంగాణకు అందచేసిన ఈ విద్యుత్తుకు సంబంధించిన బకాయిలు దీర్ఘకాలంగా పేరుకుపోయాయి. తెలంగాణ సర్కారు ఈ బకాయిలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఏపీ విద్యుత్తు సంస్థలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం పలు సందర్భాల్లో కేంద్రాన్ని కోరింది. సరిగ్గా వారం రోజుల క్రితం ఢిల్లీ పర్యటన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇదే అంశాన్ని ప్రధాని మోదీతో సమావేశం సందర్భంగా ప్రస్తావించారు. గతంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా దృష్టికి కూడా తెచ్చారు. ఈ నేపథ్యంలో రూ.6,756.92 కోట్ల

మిగతా 2వ పేజీలో ▶

పదేళ్ల తర్వాత కొలువుదీరిన

ధార్మిక పరిషత్

- ఆలయాలు, మఠాల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే ధార్మిక పరిషత్ పదేళ్ల తర్వాత రాష్ట్రంలో కొలువుదీరింది. మఠాధిపతులు, ఆగమ పండితులు, తదితరులు సోమవారం సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. తొలి ధార్మిక పరిషత్ 2009 నుంచి మూడేళ్ల పాటు బాధ్యతలు నిర్వర్తించింది. ఆ తర్వాతి ప్రభుత్వాలు పరిషత్ ఏర్పాటు చేయలేదు. మళ్లీ 21 మంది సభ్యులతో పరిషత్ ఏర్పాటు చేస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులిచ్చింది. హిందూ ధర్మంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని ఉప ముఖ్యమంత్రి, పరిషత్ చైర్మన్ కొట్టు సత్యనారాయణ తెలిపారు.



2లో

హేమంత్ అనర్హతపై త్వరగా నిర్ణయం తీసుకోండి

జార్ఖండ్ గవర్నర్‌కు అధికార ఎమ్మెల్యేల వినతి



6లో

క్లుప్తంగా

తెలుగు భాషా సంస్కర్తల్లో 'గిడుగు' అగ్రగణ్యులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్

సాక్షి, అమరావతి: వాడుకభాష ఉద్యమానికి ఆద్యులు, బహుముఖ ప్రజ్ఞాశాలి గిడుగు రామ్మూర్తి పంతులు అని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కొనియాడారు. గిడుగు రామ్మూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకోవడం ఎంతో గర్వకారణమని అన్నారు. తెలుగు సాహిత్యాన్ని సరళీకరించి, తెలుగు భాష తీయదనాన్ని సామాన్యుడికి చేరువ చేసిన రామ్మూర్తి పంతులు తెలుగుభాషా సంస్కర్తల్లో అగ్రగణ్యులుగా నిలిచారని సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

తెలుగు భాషాభివృద్ధికి 'గిడుగు' ఎనలేని సేవలు

సచివాలయంలో ఘనంగా గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి



గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకల్లో రజత్ భార్గవ, సాయిప్రసాద్

సాక్షి, అమరావతి: తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు భాషాభివృద్ధికి ఎనలేని సేవలందించారని పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ అన్నారు. సచివాలయంలో సోమవారం గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు భాషా సంఘం తరఫున గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాంథిక భాషగా ఉన్న తెలుగు వచనాన్ని వ్యావహారిక భాషలోకి తీసుకురావడంతో కొందరికే పరిమితమైన విద్య అందరికీ అందిందన్నారు. సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర తెలుగు భాషా సంఘం సంయుక్త కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత.. రెవెన్యూ, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రజత్ భార్గవ, జి.సాయిప్రసాద్ రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేబినెట్ భేటీ సెప్టెంబర్ 7కు వాయిదా

సాక్షి, అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం సెప్టెంబర్ 7వ తేదీకి వాయిదా పడింది. తొలుత సెప్టెంబర్ 1న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. అయితే ఈ భేటీని సెప్టెంబర్ 7కు వాయిదా వేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్‌శర్మ సోమవారం ఉత్తర్వులిచ్చారు. 7వ తేదీ ఉదయం 11 గంటలకు మంత్రివర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులకు సీఎస్ ఆదేశాలిచ్చారు.

అర్బన్ రీ సర్వే కోసం శిక్షణ ప్రారంభం

సాక్షి, అమరావతి: అర్బన్ ప్రాంతాల్లో భూముల రీ సర్వే కోసం ఉద్యోగులకు వారం రోజులు నిర్వహించనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కాకినాడ జిల్లా సామర్లకోటలోని సర్వే అకాడమీలో అర్బన్ రీ సర్వే ప్రత్యేక అధికారి బి.సుబ్బారావు ప్రారంభించారు. శిక్షణకు రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న 81 మంది అర్బన్ సర్వే సిబ్బందిని ఎంపిక చేశారు. వారికి వైఎస్సార్ జగనన్న భూహక్కు, భూరక్ష రీ సర్వే ప్రాజెక్టు గురించి వివరించడంతోపాటు ఆధునిక సర్వే టెక్నాలజీని రీ సర్వేలో ఉపయోగించడం, అర్బన్ ప్రాపర్టీ సర్వే, సీవోఆర్ఎస్ నెట్‌వర్క్, జీఎన్ఎస్ఎస్ రిసీవర్స్, డ్రోన్ టెక్నాలజీ, ఆర్థో రెక్టిఫైడ్ ఇమేజెస్(వోఆర్ఐ) వంటి వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. శిక్షణ అనంతరం వీరు మాస్టర్ ట్రైనర్లుగా తమ ప్రాంతాల్లోని అర్బన్ సర్వే బృందాలకు శిక్షణ ఇస్తారని సర్వే అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్ తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగుల ఆందోళన వాయిదా

▶ మొదటి పేజీ తరువాయి

వాటిని చేపట్టామన్నారు. అలాగే.. ఛలో విజయవాడ, మిలియన్ మార్చ్ పేరుతో నిర్వహించబోయే సభ, ర్యాలీకి కూడా పోలీసుల అనుమతి కోరామని తెలిపారు. కానీ, పోలీసులు ఏ నిర్ణయం చెప్పలేదన్నారు. మరోవైపు.. తమకు సంబంధంలేని 'సీఎం ఆఫీసు ముట్టడి' కార్యక్రమం పేరుతో ఏపీసీపీఎస్ఈఏ నాయకులు, కార్యకర్తలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులను అడ్డుకున్నారని, కేసులు పెట్టారని తెలిపారు. నోటీసులు, బైండోవర్లు, ముందస్తు అరెస్టులతో వేలాది మంది ఇబ్బంది పడుతున్నారని పార్థసారథి పేర్కొన్నారు. దీంతో.. ఉద్యోగుల శ్రేయస్సు దృష్ట్యా 'ఛలో విజయవాడ' కార్యక్రమాన్ని సెప్టెంబర్ 11కి వాయిదా వేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా, సీపీఎస్ రద్దు కోరుతూ సెప్టెంబర్ 1న తలపెట్టిన సీఎం ఇంటి ముట్టడి కార్యక్రమాన్ని నిలిపివేయాలని నిర్ణయం తీసుకున్నందున ఉద్యోగులెవరూ విజయవాడకు రావొద్దని ఏపీసీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ మరియదాసు, ఎం. రవికుమార్ సోమవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1న జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను చేపట్టాలని పేర్కొన్నారు.

పదేళ్ల తర్వాత కొలువుదీరిన ధార్మిక పరిషత్

- బాధ్యతలు చేపట్టిన మఠాధిపతులు, ఆగమ పండితులు, ఇతరులు
- హిందూ ధర్మంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఇదే నిదర్శనం
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ధార్మిక పరిషత్ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

సాక్షి, అమరావతి: ఆలయాలు, మఠాల నిర్వహణలో కీలకంగా వ్యవహరించే ధార్మిక పరిషత్ పదేళ్ల తర్వాత రాష్ట్రంలో మరోసారి కొలువుదీరింది. తొలి ధార్మిక పరిషత్ 2009 నుంచి మూడేళ్లపాటు బాధ్యతలు నిర్వర్తించింది. ఆ తర్వాతి ప్రభుత్వాలు పరిషత్ ఏర్పాటు చేయలేదు. మళ్లీ 21 మంది సభ్యులతో పరిషత్ ఏర్పాటు చేస్తూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిషత్ సభ్యులు సోమవారం రాష్ట్ర సచివాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. వీరిలో అధికారులతో కలిపి 14 మంది సభ్యులు సచివాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఇద్దరు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చైర్మన్‌గా, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ సభ్యులుగా, కమిషనర్ హరి జవహర్‌లాల్ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. సభ్యులుగా తిరుమల పెద జీయంగార్ మఠాధిపతి, రిటైర్డు ఐఏఎస్ అధికారి అజేయ కల్లాం, దేవదాయ శాఖ రిటైర్డు అడిషనల్ కమిషనర్ ఎ.బి.కృష్ణారెడ్డి, రిటైర్డు ప్రిన్సిపల్ స్పెషల్ జడ్జి కె.సూర్యారావు, దాతలు సంగా నరసింహారావు, యు.కె.విశ్వనాథరాజు, ఆగమ పండితులు పీవీఎస్ఎస్ఆర్ జగన్నాథాచార్యులు, సీహెచ్ శ్రీరామ శర్మ, భీమవరానికి చెందిన దంతులూరి జగన్నాథరాజు చౌల్ట్రీ ఫౌండర్ ట్రస్టీ ఎం.రామకుమార్ రాజు, కడపకు చెందిన యద్దల్ల పిచ్చియ్య చెట్టి చారిటీస్ అసోసియేషన్ ఫౌండర్ డా.జ్వాలా చైతన్య, పాలకొల్లుకు చెందిన చాకా వారి చౌల్ట్రీ ఫౌండర్ చాకా ప్రభాకరరావు ప్రమాణస్వీకారం చేశారు. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, వైఎస్సార్ జిల్లా పుష్పగిరి మఠాధిపతి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు. హైకోర్టు రిటైర్డు జడ్జి మఠం వెంకట రమణ, చార్టెడ్ అకౌంటెంట్ శ్రీరామమూర్తితో పాటు ఇనుగంటి వెంకట రోహిత్, మాకా బాలాజీ, రాజన్ సుభాషిణి ప్రమాణ స్వీకారానికి హాజరు కాలేదు.

మరింత విస్తృతంగా హిందూ ధార్మిక కార్యక్రమాలు

హిందూ ధార్మిక కార్యక్రమాలను మరింత విస్తృతంగా అమలు చేయాలనే అత్యున్నత లక్ష్యంతో రాష్ట్ర సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేసినట్లు ఉప ముఖ్యమంత్రి, పరిషత్ చైర్మన్ కొట్టు సత్యనారాయణ చెప్పారు. ఎంతో నిష్ణాతులైన వారితో ఏర్పాటు చేసిన ధార్మిక పరిషత్ సూచనలను, సలహాలను అన్నింటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తామని తెలిపారు. పరిషత్ సభ్యుల ప్రమాణస్వీకారం అనంతరం ఆయన సభ్యులనుద్దేశించి మాట్లాడారు. హిందూ మత ధర్మంపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి దీని ఏర్పాటే నిదర్శనమన్నారు. భగవంతుని సహకారంతోనే ఎన్నో పథకాలను, కార్యక్రమాలను అమలు చేయగలుగుతున్నామని సీఎం జగన్ ఎప్పుడూ చెపుతుంటారని, భగవంతునిపై ఆయనకు ఉన్న భక్తికి ఇది కూడా ఒక నిదర్శనమని అన్నారు. ధార్మిక పరిషత్ ద్వారా రాష్ట్రంలో ఉన్న ఆలయాలన్నీ అభివృద్ధి పథంలో నడవాలని ఆకాంక్షించారు. హిందూ మత ప్రచారానికి పనిచేస్తున్న పీఠాలన్నీ సక్రమంగా సేవలందించాలని, ఎక్కడైనా అవకతవకలు జరిగినా ధార్మిక పరిషత్ ద్వారా వాటిని సరి చేసి ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందని చెప్పారు.

1 నుంచి వైఎస్సార్ జిల్లాలో సీఎం పర్యటన

- 1న వేల్పుల గ్రామ సచివాలయం కాంప్లెక్స్ ప్రారంభం
- 2న వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం వైఎస్ జగన్
- 3న తిరిగి తాడేపల్లి నివాసానికి రాక

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ విడుదలైంది. తన పర్యటనలో భాగంగా సెప్టెంబర్ 1 మధ్యాహ్నం 2 గంటలకు సీఎం వైఎస్ జగన్ తాడేపల్లి నివాసం నుంచి బయలుదేరి 2.20 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి 2.30 గంటలకు కడపకు విమానంలో బయలుదేరి వెళ్తారు. కడప విమానాశ్రయం నుంచి 3.30 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 3.50 గంటలకు వేముల మండలం వేల్పులకు చేరుకుంటారు. అక్కడ 3.50 నుంచి 4.05 గంటల వరకు స్థానిక నాయకులతో మాట్లాడతారు. 4.10 గంటల నుంచి 5.10 గంటల మధ్య వేల్పుల గ్రామ సచివాలయం కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తారు. సాయంత్రం 5.15 గంటలకు వేల్పుల నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5.35 గంటలకు ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఎస్టేట్ గెస్ట్ హౌస్‌లో రాత్రి బస చేస్తారు.

2న సీఎం షెడ్యూల్..

సెప్టెంబర్ 2న ఉదయం 8.50 గంటలకు సీఎం వైఎస్ జగన్ ఇడుపులపాయ గెస్ట్‌హౌస్ నుంచి రోడ్డు మార్గాన బయలుదేరుతారు. 9 గంటల నుంచి 9.40 గంటల వరకు ఎస్టేట్‌లోని వైఎస్సార్ ఘాట్ వద్ద దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. 9.45 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి ఎస్టేట్‌లోని ప్రేయర్ హాల్లో పులివెందుల నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలపై సాయంత్రం 5 గంటల వరకు సమీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాత 5.10 గంటలకు వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌కు చేరుకుని రాత్రి బస చేస్తారు.

3న షెడ్యూల్ ఇదీ..

సెప్టెంబర్ 3న ఉదయం 8.50 గంటలకు సీఎం జగన్ ఇడుపులపాయ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి కడప చేరుకుంటారు. అక్కడ నుంచి 9.20 గంటలకు ప్రత్యేక విమానంలో బయలుదేరి 10.10 గంటలకు గన్నవరం విమానాశ్రయానికి వస్తారు. అక్కడ నుంచి ఉదయం 10.40 గంటలకు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

టీచర్లకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు

ఎమ్మెల్సీ కల్పలత

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని టీచర్లకు మేలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ టి.కల్పలత సోమవారం ఓ ప్రకటనలో చెప్పారు. 'సీఎం వైఎస్ జగన్ రూ.వేల కోట్లు వెచ్చించి నాడు–నేడు, గోరుముద్ద, విద్యా కానుక, విద్యా దీవెన తదితర పథకాల ద్వారా విద్యార్థులకు మంచి చేస్తున్నారు. అలాగే టీచర్ల సమస్యలను కూడా త్వరలోనే తీర్చనున్నారు. భారీ సంఖ్యలో ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు కల్పించబోతున్నారు. వీటి వల్ల టీచర్లకు మేలు జరుగుతుంది' అని ఆమె పేర్కొన్నారు.

పదోన్నతులపై హర్షం

20 ఏళ్లుగా ఉన్న సమస్యను పరిష్కరిస్తూ.. ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉపాధ్యాయుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. టీడీపీ ప్రభుత్వం విద్యా వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తే.. వైఎస్ జగన్ ప్రభుత్వం తమకు న్యాయం చేసిందని సంఘం గౌరవ అధ్యక్షుడు మద్దూరి సూర్యనారాయణమూర్తి కృతజ్ఞతలు తెలిపారు.

10 వేల మందికిపైగా టీచర్లకు పదోన్నతి

▶ మొదటి పేజీ తరువాయి

పూర్వప్రాథమిక విద్యను ప్రవేశపెట్టి ఫౌండేషనల్ స్కూళ్లుగా తీర్చిదిద్దింది. 3 నుంచి 5వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలల పిల్లలను హైస్కూళ్లకు అనుసంధానిస్తూ సబ్జెక్టుల వారీగా బోధనకు చర్యలు తీసుకుంది. అందుకు అనుగుణంగా స్కూళ్ల మ్యాపింగ్ చేపట్టింది. విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఇబ్బంది లేకుండా అన్ని సదుపాయాలు కల్పిస్తూ చర్యలు తీసుకుంటోంది. మ్యాపింగ్‌తో ఆయా హైస్కూళ్లు, ప్రీ హైస్కూళ్లలో అవసరమైన అదనపు తరగతి గదులు, ఇతర సదుపాయాలను కల్పిస్తోంది. ఈ స్కూళ్లలో సబ్జెక్టుల బోధనకు స్కూల్ అసిస్టెంట్ టీచర్లు అవసరం కావడంతో ఎస్జీటీలలో అర్హులైన వారికి ఎస్ఏలుగా పదోన్నతులు కల్పించాలని ఇప్పటికే సీఎం జగన్ ఆదేశించారు. ఈ మేరకు 7 వేల మందికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేలా పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలో 500 హైస్కూళ్లలో హెడ్మాస్టర్ల పోస్టులు ఖాళీగా ఉండడంతో వాటిలో కూడా సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించనున్నారు.

పదోన్నతుల కోసం అదనంగా 666 ఎంఈవో పోస్టులు

మండల విద్యాధికారుల పోస్టులు కొన్ని దశాబ్దాలుగా పూర్తిస్థాయిలో భర్తీకి నోచుకోలేదు. దీనివల్ల ప్రభుత్వం ఎన్ని రకాల విద్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నా పర్యవేక్షణ కొరవడింది. టీచర్లకు అందాల్సిన పదోన్నతులూ నిలిచిపోయాయి. రాష్ట్రంలో 666 మండల విద్యాధికారుల పోస్టులుండగా 421 మంది పనిచేస్తున్నారు. అయితే ఈ పోస్టులన్నీ తమకు సంబంధించినవని, స్థానిక సంస్థల స్కూళ్ల టీచర్లకు కేటాయించవద్దని ప్రభుత్వ స్కూళ్ల టీచర్లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న ఈ వివాదం పరిష్కారానికి సీఎం జగన్ చొరవ చూపారు. ప్రతి మండలానికి ఇద్దరు చొప్పున ఎంఈవోలు ఉండేలా నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఎంఈవో పోస్టులు రెట్టింపై 1,332కి చేరాయి. 666 పోస్టులు ప్రభుత్వ టీచర్లకు, మిగతా 666 పోస్టులు స్థానిక సంస్థల (జెడ్పీ) స్కూళ్ల టీచర్లకు కేటాయించారు. ఫలితంగా టీచర్లకు పదోన్నతులు రెట్టింపు అయ్యాయి. అర్హులైన హెడ్మాస్టర్లకు పదోన్నతుల ద్వారా ఈ పోస్టులలో అవకాశం కల్పించనున్నారు.

అదనంగా 36 డిప్యూటీ డీఈవో పోస్టులు

రాష్ట్రవ్యాప్తంగా 53 డిప్యూటీ డీఈవో పోస్టులుండగా వీటిపైనా ప్రభుత్వ, స్థానిక సంస్థల టీచర్లకు సంబంధించి వివాదం నెలకొంది. దీంతో ఈ సాకుతో గత ప్రభుత్వాలు పోస్టుల భర్తీ చేపట్టకుండా వదిలేశాయి. ముఖ్యమంత్రి జగన్ ఈ పోస్టులన్నీ భర్తీ కావాల్సిందేనని స్పష్టమైన ఆదేశాలు జారీచేయడంతో పాటు అదనంగా మరో 36 డిప్యూటీ డీఈవో పోస్టుల ఏర్పాటుకు అనుమతిచ్చారు. దీంతో ప్రభుత్వ టీచర్లు, స్థానిక సంస్థల టీచర్లకు న్యాయం చేసేందుకు మార్గం సుగమమైంది. ఈ 89 డిప్యూటీ డీఈవో పోస్టులలో నిబంధనలను అనుసరించి పదోన్నతులపై అర్హులైన వారిని నియమించనున్నారు. వీటితో పాటు మున్సిపల్ టీచర్లకు సంబంధించిన బాధ్యతలను కూడా ప్రభుత్వం విద్యాశాఖకు అప్పగించిన సంగతి తెలిసిందే. వీరికి సంబంధించిన సర్వీసు అంశాలు, పదోన్నతులు, వేతనాలు, బదిలీలను కూడా పాఠశాల విద్యాశాఖ చేపట్టనుంది. వీరికి కూడా ఎస్ఏలు, హెచ్ఎంలు, ఎంఈవోలు, డిప్యూటీ డీఈవోలుగా పదోన్నతులు లభించనున్నాయి. ఎలాంటి న్యాయపరమైన సమస్యలకు తావు లేకుండా పదోన్నతులను చేపట్టేలా పాఠశాల విద్యాశాఖ పలు జాగ్రత్తలు తీసుకుంటోంది. ఈ పదోన్నతుల ప్రక్రియను సెప్టెంబర్ మొదటి వారం నుంచి చేపట్టనుంది. వాటిని ముగించిన అనంతరం టీచర్ల సాధారణ బదిలీలను చేపడుతుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను కూడా పాఠశాల విద్యాశాఖ సిద్ధం చేసింది.

సింగిల్ విండో విధానంలో అనుమతులు ఇవ్వండి

▶ మొదటి పేజీ తరువాయి

భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్, రిసార్టుల ప్రణాళికల గురించి సీఎంకు వివరించారు.

7 స్టార్ సౌకర్యాలతో.. విల్లాల మోడల్‌లో..

ఇప్పటికే విశాఖపట్నం, తిరుపతి, గండికోట, పిచ్చుకల్లంక, హార్సిలీహిల్స్‌ల్లో అంతర్జాతీయ స్థాయి లగ్జరీ రిసార్ట్స్ ఏర్పాటుకు ఒబెరాయ్ గ్రూప్ ఆసక్తి చూపించింది. దాదాపు రూ.1,500 కోట్ల పెట్టుబడితో ప్రత్యక్షంగా 1,500 మందికి, పరోక్షంగా 11,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనుంది. అన్ని హోటల్స్‌ను '7 స్టార్' సౌకర్యాలతో విల్లాల మోడల్‌లో నిర్మించనుంది. వీటితోపాటు తాజాగా ఏజెన్సీ ప్రాంతమైన పాడేరు పరిసరాల్లో టూరిజం సెంటర్‌ను నిర్వహించేందుకు ఒబెరాయ్ సిద్ధంగా ఉంది. ఈ సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ, సీఎంవో అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఇక తెలుగులోనే..



పురస్కారాలు అందుకున్న 43 మంది తెలుగు కవులు, పండితులు

- తెలుగు భాషా దినోత్సవంలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్
- 43 మంది తెలుగు కవులు, భాషా పండితులకు పురస్కారాలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రస్థాయి నుంచి మండల స్థాయి వరకూ ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఇకపై తెలుగులో లేకపోతే నేటి నుంచి శిక్షలు అమలు చేస్తున్నట్లు అధికార భాషా సంఘం అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ వెల్లడించారు. గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ సృజనాత్మక–సంస్కృతి సమితి, భాషా సాంస్కృతిక శాఖ, అధికార భాషా సంఘం, తెలుగు ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ.. గతంలో అధికార భాషా సంఘానికి.. సలహాలు, సూచనలివ్వడం తప్ప శిక్షలు అమలుచేసే అధికారం లేదన్నారు. కానీ, సీఎం జగన్ మాత్రం తెలుగును పాలనా భాషగా అమలు చేయకపోతే శిక్షలు విధించే అధికారాలిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం చారిత్రక నిర్ణయమని తెలిపారు.

తెలుగు భాష ఎప్పటికీ మనతోనే..

రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి చైర్‌పర్సన్ వంగపండు ఉష మాట్లాడుతూ.. తెలుగు భాష ఎప్పటికీ మనతోనే ఉంటుందన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు ముని మనుమడు గిడుగు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాలున్నంత కాలం తెలుగు భాష ఉంటుందన్నారు. తెలుగుని మరుగున పడేస్తున్నారంటూ సీఎం జగన్‌పై విమర్శలు చేస్తున్నారని.. అవన్నీ తప్పుడు ఆరోపణలన్నారు. తెలుగు భాష అభివృద్ధికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారన్నారు. ఇక దేశంలో హిందీ తర్వాత చరిత్ర కలిగిన భాష తెలుగేనని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అనంతరం.. తెలుగు భాషాభివృద్ధికి కృషిచేసిన కవులు, భాషా పండితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆత్మీయ పురస్కారాలు ప్రదానంచేసి సత్కరించింది. ఈ వేడుకల్లో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, కలెక్టర్ మల్లికార్జునతో పాటు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌లో పీఎస్ఎల్‌వీ సీ54 ప్రయోగం

సూళ్లూరుపేట: తిరుపతి జిల్లా సూళ్లూరుపేట సమీపంలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి సెప్టెంబర్ నెలాఖరులోపు పీఎస్ఎల్‌వీ సీ54 ప్రయోగాన్ని చేపట్టేందుకు ఏర్పాట్లు సిద్ధమవుతున్నాయి. ఈ ప్రయోగంలో ఓషన్‌శాట్–3 (ఈఓఎస్–6) ఉపగ్రహంతో పాటు బూటాన్ శాట్ (అకా ఐఎన్ఎస్–2బీ), ఆనంద్ అనే మూడు స్వదేశీ ఉపగ్రహాలను రోదసిలోకి పంపనున్నారు. ఈ ఉపగ్రహాలతో పాటు వాణిజ్యపరంగా ఏ దేశమైనా ముందుకొస్తే మరో రెండు, మూడు ఉపగ్రహాలను కూడా పంపించే అవకాశం లేకపోలేదు.

త్వరగా తేల్చండి



దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై మంత్రులు, ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

▶ మొదటి పేజీ తరువాయి

అధికారులు వివరించారు. విభజన సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతున్నకొద్దీ రాష్ట్రానికి మరింత నష్టం జరుగుతోందనే అంశాన్ని సమావేశంలో ప్రధానంగా ప్రస్తావించాలని సీఎం జగన్ ఆదేశించారు. ఇప్పటికే విభజన వల్ల రాష్ట్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోయిందని, హైదరాబాద్ లాంటి నగరాన్ని కోల్పోయిందని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో సమస్యలను తక్షణమే పరిష్కరించడంపై దృష్టి సారించాల్సిందిగా సమావేశంలో కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేందుకు తగినన్ని నిధులు విడుదల చేసే అంశాన్ని కూడా అజెండాలో చేర్చాలని సీఎం ఆదేశించారు.

బుగ్గన నేతృత్వంలో అధికారుల బృందం

తన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాల నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశానికి తాను హాజరుకావడం లేదని సీఎం జగన్ తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర అధికారుల బృందం ఈ సమావేశానికి హాజరవుతుందని చెప్పారు. ఈ సమీక్షలో విద్యుత్, గనులు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్థిక, ప్రణాళిక, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్, సీఎస్ సమీర్ శర్మ, వ్యవసాయశాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై.శ్రీలక్ష్మి, విద్యుత్ శాఖ స్పెషల్ సీఎస్ కె.విజయానంద్, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ ఎస్.ఎస్.రావత్, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ కరికాల వలవెన్, రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, జల వనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, జీఏడీ ఎక్స్ అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ ఎల్.ప్రేమచంద్రారెడ్డి, ప్రణాళిక శాఖ కార్యదర్శి జి.విజయ్ కుమార్, న్యాయశాఖ కార్యదర్శి జి.సత్య ప్రభాకర్‌రావు, హోంశాఖ ముఖ్య కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

రూ.6,756.92 కోట్ల కరెంట్ బాకీలు కట్టండి

▶ మొదటి పేజీ తరువాయి

బకాయిలను 30 రోజుల్లోగా చెల్లించాలని తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలను ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వ ఉప కార్యదర్శి అనూప్ సింగ్ బిస్త్ సోమవారం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం.

సకాలంలో చెల్లించకపోవడంతో..

ఏపీ జెన్‌కో సరఫరా చేసిన 8,890 మిలియన్ యూనిట్ల విద్యుత్‌కు సంబంధించి తెలంగాణ డిస్కమ్‌లు రూ.3,441.78 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో ఈ ఏడాది జూలై 31 నాటికి మరో రూ.3,315.14 కోట్లు లేట్ పేమెంట్ సర్ చార్జీ పడింది. ఈ మొత్తం రూ.6,756.92 కోట్లను విభజన చట్టం ప్రకారం ఏపీకి చెల్లించాలని కేంద్రం తన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

ఇన్నాళ్లూ మొండి వైఖరి

2019 ఆగస్టు 19న జరిగిన ఇరు రాష్ట్రాల సంయుక్త సమావేశంతో పాటు పలు సందర్భాల్లో ఏపీకి బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలంగాణ డిస్కమ్‌లు ఒప్పుకున్నా డబ్బులు మాత్రం విడుదల కాలేదు. 2020 జనవరిలో జరిగిన ఇరు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల సమావేశంలోనూ బకాయిల అంశాన్ని చర్చించారు. ఏపీకి చెల్లించాల్సిన విద్యుత్ బకాయిలకు విభజన సమస్యలతో ముడిపెడుతూ తెలంగాణ ప్రభుత్వం చెల్లించడం లేదు. ఇరు రాష్ట్రాల మధ్య విద్యుత్ కంపెనీల లావాదేవీల ప్రక్రియ (ఎలక్ట్రిసిటీ యుటిలిటీస్ డీమెర్జర్ ప్లాన్) పూర్తైన తరువాత బకాయిల గురించి ఆలోచిస్తామంటూ కాలయాపన చేస్తూ వస్తోంది.



అప్పుచేసి మరీ కరెంట్ సరఫరా..

పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ల (ఆర్‌ఈసీ) నుంచి 2014 జూన్ 2 నుంచి 2017 మార్చి 31 మధ్య రూ.5,625 కోట్ల రుణాలను ఏపీ జెన్‌కో తీసుకుంది. అలా తీసుకున్న డబ్బులతోనే తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయగలిగింది. కానీ వాడుకున్న విద్యుత్‌కు తెలంగాణ డిస్కమ్‌లు డబ్బులివ్వకపోవడంతో పీఎఫ్‌సీ, ఆర్‌ఈసీలకు చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో చెల్లించలేని పరిస్థితి ఏపీజెన్‌కోకు ఏర్పడింది.

కేంద్రం జోక్యాన్ని కోరిన ఏపీ..

తెలంగాణ నుంచి రావాల్సిన విద్యుత్ బకాయిలపై జోక్యం చేసుకోవాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం అనేక సార్లు కోరింది. గతేడాది నవంబర్‌లో కేంద్ర విద్యుత్ శాఖ నిర్వహించిన ఇరు రాష్ట్రాల ఇంధన శాఖ కార్యదర్శుల సమావేశంలోనూ ఈ మేరకు ఏపీ అధికారులు అభ్యర్థించారు. తెలంగాణ డిస్కమ్‌లు కేంద్రం నుంచి ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ పథకం కింద పొందుతున్న రుణాన్ని ఏపీ జెన్‌కో బకాయిలకు జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ క్రమంలో ఇరు రాష్ట్రాలు చర్చించుకుని 15 రోజుల్లో ఓ నిర్ణయానికి రావాలని కేంద్ర విద్యుత్ శాఖ కార్యదర్శి అలోక్‌కుమార్ సూచించారు. గడువులోగా తేల్చుకోలేని పక్షంలో తమ దృష్టికి తెస్తే కేంద్ర హోంశాఖతో సంప్రదించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆ చర్చలు సఫలం కాకపోగా తమకే ఏపీ తిరిగి బకాయిలు చెల్లించాలంటూ తెలంగాణ కొత్త మెలిక పెట్టింది.

పట్టుబట్టి సాధించిన సీఎం జగన్..

తెలంగాణ సర్కారు మొండి వైఖరితో విసిగిపోయిన రాష్ట్ర ప్రభుత్వం ఈ సమస్యను కేంద్రమే పరిష్కరించాలని పట్టుబట్టింది. గతేడాది నవంబర్‌లో తిరుపతిలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ మండలి సమావేశంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టికి ఈ అంశాన్ని సీఎం జగన్ తెచ్చారు. బకాయిలు చెల్లించేలా తెలంగాణను ఆదేశించాలని కోరారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీతో జరిగిన భేటీలోనూ, తాజాగా ఈ నెల 22న మరోసారి ప్రధానిని కలిసినప్పుడు కూడా తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిల అంశాన్ని సీఎం జగన్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వారం రోజుల్లోనే కేంద్ర విద్యుత్‌శాఖ నుంచి ఆదేశాలు వెలువడ్డాయి.

క్లుప్తంగా

2019 తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాల ప్రకటన

12 మంది ప్రముఖులకు సెప్టెంబర్‌లో పురస్కారాల ప్రదానం

సాక్షి, హైదరాబాద్‌: ప్రతి ఏటా వివిధ రంగాల్లో సేవలందించిన 12 మంది ప్రముఖులకు ఇచ్చే ప్రతిభా పురస్కారాలను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2019 సంవత్సరానికి గాను సోమవారం ప్రకటించింది. వచ్చే సెప్టెంబర్‌లో హైదరాబాద్‌లోని యూనివర్సిటీలో జరిగే ప్రత్యేక ఉత్సవంలో ఈ పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు రిజిస్ట్రార్‌ ఆచార్య భట్టు రమేశ్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పురస్కారంగా ఒక్కొక్కరికి రూ.20,116/–నగదు అందజేసి సత్కరిస్తామని తెలియజేశారు. యూనివర్సిటీ ప్రకటించిన ప్రతిభా పురస్కారాల్లో 'సాక్షి'దినపత్రిక ఎడిటర్‌ వర్ధెల్లి మురళి పత్రికా రంగం కేటగిరీలో ఎంపికయ్యారు. మిగతా వారిలో...కవిత కేటగిరీలో వి.ఆర్‌.విద్యార్థి, ప్రొఫెసర్‌ పులికొండ సుబ్బాచారి (విమర్శ), యం.బాలరాజ్‌ (చిత్రలేఖనం), ఎస్‌.కాంతారెడ్డి (శిల్పం), ఎస్‌.సువర్ణలత (నృత్యం), డి.వి.మోహనకృష్ణ (సంగీతం), మల్లాది గోపాలకృష్ణ (నాటకం), మొలంగూరి భిక్షపతి (జానపద కళారంగం), ముత్యంపేట గౌరీశంకర శర్మ (అవధానం), పరిమళ సోమేశ్వర్‌ (ఉత్తమ రచయిత్రి), వల్లభనేని అశ్వనీ కుమార్‌ (నవల /కథ) పురస్కారాలకు ఎంపికయ్యారని రిజిస్ట్రార్‌ తెలిపారు.

కుప్పంలో అల్లర్లకు పాల్పడిన వారితో నేడు లోకేశ్‌ ములాఖత్‌

చిత్తూరు అర్బన్‌: ఇటీవల కుప్పంలో చంద్రబాబు పర్యటన సందర్భంగా నానా హంగామా సృష్టించి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడి జిల్లా జైల్లో ఉన్న రౌడీలతో నారా లోకేశ్‌ ములాఖత్‌ కానున్నారు. ఇందుకోసం మంగళవారం హైదరాబాద్‌ నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట చేరుకుని, అటు నుంచి చిత్తూరుకు వస్తున్నారు. చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో లోకేశ్‌ పర్యటిస్తారని టీడీపీ నేతలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జైల్లో ఉన్న టీడీపీ నేతలు, కార్యకర్తలను లోకేశ్‌ కలిసిన తర్వాత చంద్రగిరి పాతపేట, తిరుపతి రూరల్‌లోని పెరుమాళ్లపల్లిలో కార్యకర్తలను పరామర్శిస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు.

నకిలీ రైల్వే ఈ–టికెట్లతో ఇద్దరు యువకుల ప్రయాణం

సాక్షి, అమరావతి/ఒంగోలు: దివ్యాంగుల కోటాలో రాయితీపై నకిలీ టికెట్లతో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులను రైల్వే అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. షాలిమార్‌–చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో ఏసీ కోచ్‌ బీ–1లో ఇద్దరు యువకులను టీటీఈ ఫణీంద్రకుమార్‌ టికెట్లు చూపించమని కోరారు. తాము ఎస్‌–3 కోచ్‌ ప్రయాణికులమని చెప్పిన వారు సత్రగంజి నుంచి చెన్నైకి తమ వద్ద ఉన్న ఈ–టికెట్లను చూపించారు. అందులో వారు దివ్యాంగుల కోటాలో రాయితీ టికెట్లు తీసుకున్నట్లు ఉంది. వారు శారీరకంగా ఫిట్‌గా ఉండటం, ధ్రువీకరణపత్రాలు లేకపోవడంతో జరిమానా విధించారు.

అది 'ఈనాడు' ఆత్మఘోష

సాక్షి, అమరావతి: వ్యవసాయాన్ని పండుగలా మార్చాలన్న సంకల్పంతో పగ్గాలు చేపట్టింది మొదలు సీఎం వైఎస్‌ జగన్‌ ప్రతీ అడుగు రైతు సంక్షేమం దిశగానే వేస్తున్నారు. విత్తనం నుంచి విక్రయం వరకు అండగా నిలిచేందుకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా సీజన్‌కు ముందుగానే సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను పంపిణీ చేస్తున్నారు. ఇచ్చిన మాట కంటే మిన్నగా వైఎస్సార్‌ రైతు భరోసా కింద రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని అందించడమే కాకుండా సకాలంలో పంట రుణాలు అందిస్తున్నారు. వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న పంటలకు సీజన్‌ ముగియకుండానే పంట నష్టపరిహారం, పంటల బీమా పరిహారం చెల్లిస్తున్నారు. పగటి పూట 9 గంటల పాటు నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నారు. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం మూడేళ్లలో వివిధ పథకాల ద్వారా రైతులకు నేరుగా రూ.1.28 లక్షల కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. గత సర్కారు ఎగ్గొట్టిన రూ.19,709.20 కోట్లకు పైగా బకాయిలను చెల్లించింది. ఇంతలా అన్నదాతలకు అండగా నిలుస్తుంటే కడుపు మంట తట్టుకోలేక ఈనాడు నిత్యం రోత రాతలు రాస్తూ ప్రభుత్వంపై అదే పనిగా బురద చల్లుతోంది.

మూడేళ్లలో రూ.23,875.29 కోట్ల పెట్టుబడి సాయం

వైఎస్సార్‌ రైతు భరోసా కింద ఏటా మూడు విడతల్లో రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం అందచేస్తోంది. మూడేళ్లలో ఇప్పటి వరకు రూ.23,875.29 కోట్లు అందించారు. రైతులపై పైసా భారం పడకుండా వైఎస్సార్‌ ఉచిత పంటల బీమా పథకం కింద మూడేళ్లలో 44.28 లక్షల మందికి రూ.6,684.84 కోట్లు బీమా పరిహారం ఇచ్చారు. రూ.లక్ష లోపు పంట రుణాలు సకాలంలో చెల్లించిన రైతులకు సీజన్‌ ముగియకుండానే వడ్డీ రాయితీని అందిస్తున్నారు. ఇలా గత బకాయిలతో కలిపి మూడేళ్లలో 65.65 లక్షల మంది రైతులకు రూ.1,282.11కోట్లు చెల్లించారు. మూడేళ్లలో వివిధ వైపరీత్యాల వల్ల పంటలు దెబ్బతిన్న 19.94 లక్షల ఎకరాలకు సంబంధించి 17.61 లక్షల మందికి రూ.1,612.80 కోట్ల పంట నష్టపరిహారాన్ని సీజన్‌ ముగియకుండానే అందించారు.

ఆర్బీకేల ద్వారా 1.12 కోట్ల మందికి సేవలు

విత్తనం నుంచి పంట విక్రయం వరకు రైతన్నకు అండగా నిలిచేందుకు గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన 10,778 ఆర్బీకేల ద్వారా గత 27 నెలల్లో 1.12 కోట్ల మందికి సేవలందించారు. ఆర్బీకేల ద్వారా 34.65 లక్షల మంది రైతులకు రూ.564.50 కోట్ల విలువైన 19.22 లక్షల టన్నుల విత్తనాలు, 13.62 లక్షల మంది రైతులకు రూ.529.24 కోట్ల విలువైన 5.16 లక్షల టన్నుల ఎరువులు, 1.51 లక్షల మందికి రూ.14కోట్ల విలువైన 1.36 లక్షల లీటర్ల పురుగుల మందులను పంపిణీ చేశారు. ఆర్బీకేలకు అనుబంధంగా రూ.16 వేల కోట్లతో గోదాములతో పాటు పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. సర్టిఫై చేసిన ఇన్‌పుట్స్‌ సరఫరా కోసం జిల్లా, రాష్ట్ర, నియోజక వర్గ స్థాయిలో రూ.213 కోట్ల అంచనాతో వైఎస్సార్‌ ఇంటిగ్రేటెడ్‌ అగ్రి టెస్టింగ్‌ ల్యాబ్‌లు తీసుకొచ్చారు. ఆర్బీకే స్థాయిలో రూ.587.64 కోట్లతో 6781, రూ.161.50 కోట్లతో 391 క్లస్టర్‌స్థాయిలో వైఎస్సార్‌ యంత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌ జలకళ కింద రూ.5,715 కోట్లు వెచ్చిస్తూ రైతులపై పైసా భారం పడకుండా ఉచితంగా 2 లక్షల బోరు బావులు తవ్వుతున్నారు. ఉచిత విద్యుత్‌ కోసం మూడేళ్లలో రూ.25,561 కోట్లు ఖర్చు చేశారు. పంటవేసే సమయంలోనే కనీస మద్దతు ధర ప్రకటించడమే కాకుండా మూడేళ్లలో రూ.44,844.31 కోట్ల విలువైన ధాన్యంతో పాటు రూ.6,903 కోట్ల విలువైన ఇతర పంటలను కొనుగోలు చేశారు. ఇవేమీ ఈనాడుకు కనిపించలేదు. సింగిల్‌కాలం వార్త కూడా రాసిన పాపాన పోలేదు.

విత్తు నుంచి విక్రయం వరకు రైతన్నకు బాసటగా రాష్ట్ర ప్రభుత్వం



అందులో వాస్తవాలు లేవు..



అన్నదాతలు ఆత్మఘోష కథనం వాస్తవ విరుద్ధంగా ఉంది. 2020తో పోలిస్తే 2021లో 19.79 శాతం మేర రైతుల ఆత్మహత్యలు పెరిగినట్లు పేర్కొనటంలో వాస్తవం లేదు. 2020తో పోలిస్తే 2021లో రైతుల ఆత్మహత్యలు తగ్గాయి. 2022లో ఇప్పటి వరకు 74 మంది మాత్రమే ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయ కార్మికులు పలు కారణాలతో చనిపోతుంటారు. అది రైతుల ఆత్మహత్యల కిందకు రావు. ఏ కారణంతో చనిపోయినా వారికి వైఎస్సార్‌ బీమా కింద రూ.లక్ష పరిహారం అందచేస్తున్నాం. – చేవూరు హరికిరణ్‌, స్పెషల్‌ కమిషనర్‌, వ్యవసాయ శాఖ

తప్పుల తడకలే..

అడుగడుగునా రైతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుంటే జీర్ణించుకోలేని చంద్రబాబు భజన పత్రిక ఈనాడు 'అన్నదాతల ఆత్మఘోష' అంటూ సోమవారం వాస్తవ దూరమైన కథనాన్ని ప్రచురించింది. ఈ కథనంలో ఏపీలో 2020లో 889 మంది, 2021లో 1,065 మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని, 2020తో పోలిస్తే 2021లో 19.79 శాతం మేర ఆత్మహత్యలు పెరిగిపోయినట్లు అచ్చు వేసింది. వాస్తవానికి 2020లో 287 మంది, 2021లో 223 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నట్లు త్రిసభ్య కమిటీలు నిర్ధారించాయి. బాధిత కుటుంబాలకు రూ.7లక్షలు చొప్పున పరిహారం కూడా అందించారు. టీడీపీ హయాంలో అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడితే అసలు వారు రైతులే కాదని, అవి ఆత్మహత్యలే కాదన్నట్లుగా రికార్డుల్లో కూడా నమోదు చేసేవారు కాదు. ఈ కారణంగా టీడీపీ హయాంలో ఐదేళ్లలో 1,004 మంది రైతులు మాత్రమే ఆత్మహత్య చేసుకున్నట్టు నిర్ధారించగా, వారిలో పరిహారం ఇచ్చింది 531 మందికే. చంద్రబాబు ఎగ్గొట్టిన మిగతా 473 మంది బాధిత రైతు కుటుంబాలకు 2019లో వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున రూ.23.65కోట్ల పరిహారాన్ని అందించింది. రైతన్నలు ఏ కారణాలతో చనిపోయినా వారి కుటుంబాలను ఉదారంగా ఆదుకోవాలంటూ సీఎం వైఎస్‌ జగన్‌ ఆదేశించారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా త్రీమెన్‌ కమిటీ నిర్ధారణే కొలమానంగా ఆత్మహత్యకు పాల్పడే రైతు కుటుంబాలను ఆదుకుంటున్నారు. మూడేళ్లలో 900 మంది మృత్యువాతపడగా, రూ.7 లక్షలు చొప్పున రూ.63 కోట్ల పరిహారాన్ని అందించారు. వ్యవసాయ కార్మికుల ఆత్మహత్యలు సాగు సంబంధిత కారణాల వల్ల జరిగిన ఆత్మహత్యలు కావు కాబట్టి రైతుల ఆత్మహత్యల పరిధిలోకి రావన్న విషయాన్ని ఈనాడు విస్మరించడం విడ్డూరంగా ఉంది.

సీఎం వైఎస్‌ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

- టీడీపీ అధికార ప్రతినిధి గంజి చిరంజీవి
- సీఎం వైఎస్‌ జగన్‌ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక
- వచ్చే ఎన్నికల్లోనూ మంగళగిరిలో వైఎస్సార్‌సీపీదే విజయం
- లోకేశ్‌ పోటీ చేసినా టీడీపీకి మళ్లీ ఓటమి తప్పదు
- అణగారిన వర్గాల అభివృద్ధికి సీఎం జగన్‌ కృషి
- టీడీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రాధాన్యత లేదు
- ఆ పార్టీ తీరుతో విసుగు చెందా



సీఎం వైఎస్‌ జగన్‌ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత గంజి చిరంజీవి. పక్కన కర్నూలు ఎంపీ సంజీవ్‌ కుమార్‌, ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ హనుమంతరావు

సాక్షి, అమరావతి/తాడేపల్లి రూరల్‌: సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని మంగళగిరి మున్సిపల్‌ మాజీ చైర్మన్‌, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పదవికి ఇటీవల రాజీనామా చేసిన గంజి చిరంజీవి చెప్పారు. రాష్ట్రంలో అణగారిన వర్గాల అభివృద్ధికి సీఎం జగన్‌ అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌ పాలనలో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయన్నారు. టీడీపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదని, ఆ పార్టీ తీరుతో విసుగు చెందామని అన్నారు. 2024లో గత ఎన్నికలకు మించి భారీ మెజారిటీతో మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని చెప్పారు. గంజి చిరంజీవి, ఆయన కుటుంబ సభ్యులు సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్‌ వారికి కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు ఎంపీ డాక్టర్‌ సంజీవ్‌ కుమార్‌, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం చిరంజీవి విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌ మంగళగిరి నుంచి ఎమ్మెల్యేగా ఎవరిని పోటీ చేయించినా కలిసి పనిచేసి భారీ మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. నారా లోకేశ్‌ పోటీ చేసినా టీడీపీ ఓడిపోవడం తథ్యమని అన్నారు. పార్టీ తనను ఎలా వినియోగించుకున్నా అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. చేనేతలను సామాజికంగా, ఆర్థికంగా రాజకీయంగా ఆదుకున్న ఏకైక సీఎం జగన్‌ అని అన్నారు. చేనేత కార్మికులకు రూ.24 వేలు ఇస్తున్న ఆదర్శప్రాయుడని కొనియాడారు. చేనేత వర్గం ఎదగకుండా టీడీపీ అడ్డుపడుతోందని చెప్పారు. చేనేత వర్గాలు ఇప్పటికైనా నిజాలు తెలుసుకోవాలని అన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆళ్ల రామకృష్ణారెడ్డిపై తాను పోటీ చేసి 12 ఓట్లతో ఓడి పోయానని, 2019 ఎన్నికల్లో ఆళ్ల రామకృష్ణారెడ్డిపై నారా లోకేశ్‌ 5 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారన్నారు. మంగళగిరిలో ప్రజాబలం తనకున్నట్లా లేక లోకేశ్‌కు ఉన్నట్లా తేల్చుకోవాల్సిన అవసరం మంగళగిరి ప్రజలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో నేనే పోటీచేస్తా... నాకు ప్రిస్టేజీ అని లోకేశ్‌ అంటున్నారని, ప్రిస్టేజీలు పెద్ద కులాలకేనా, బీసీలకు ఉండవా... అని చిరంజీవి ప్రశ్నించారు. ఈ మూడేళ్లలో సీఎం జగన్‌ చేపట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితుడనై వైఎస్సార్‌సీపీలో చేరినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా చేనేత వర్గాలకు టీడీపీలో జరుగుతున్న అన్యాయం గురించి వివరిస్తానని అన్నారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) మాట్లాడుతూ గంజి చిరంజీవి, ఇతర టీడీపీ నేతల చేరికను ఆహ్వానిస్తున్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే తమ లక్ష్యం అని స్పష్టంచేశారు. వచ్చే ఎన్నికల్లోనూ తానే మంగళగిరిలో ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని అన్నారు. చిరంజీవికి వైఎస్సార్‌సీపీలో సముచిత స్థానం ఇచ్చి గౌరవిస్తామని ఎంపీ డాక్టర్‌ సంజీవ కుమార్‌ చెప్పారు. మంగళగిరి రూరల్‌ టీడీపీ మహిళా అధ్యక్షురాలు పి.కృష్ణవేణి కూడా చిరంజీవితో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆప్కో మాజీ డైరెక్టర్‌ మిద్దెల హరి, పద్మశాలీ కార్పొరేషన్‌ చైర్మన్‌ జింకా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతో పొత్తు లేకపోతే.. కొన్ని పార్టీలకు భవిష్యత్తే లేదు: జీవీఎల్‌

సాక్షి, అమరావతి: బీజేపీతో పొత్తు లేకుంటే తమకు భవిష్యత్తు లేదని రాష్ట్రంలో కొన్ని రాజకీయ పార్టీలు భావిస్తున్నాయని బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్‌ నరసింహారావు పేర్కొన్నారు. విజయవాడలో సోమవారం బీజేపీ పదాధికారుల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పొత్తుల విషయంలో మీడియాకు, కొన్ని పార్టీలకు గందరగోళం ఉందేమో గానీ తాము మాత్రం స్పష్టమైన విధానంతో సొంతంగా ఎదిగేలా ముందుకు వెళ్తామని చెప్పారు. ప్రధాని మోదీ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 మధ్య రాష్ట్ర వ్యాప్తంగా సభలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఫిబ్రవరిలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ పోటీ చేస్తుందని ప్రకటించారు. పోలవరం ప్రాజెక్టుపై మాట్లాడేవారు నిజాలు తెలుసుకోవాలని, నోటికి వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు.

'వారసత్వ' పార్టీలతో చేతులు కలపం

రాష్ట్రంలో కుటుంబ వారసత్వం ఉండే రాజకీయ పార్టీలతో బీజేపీ కలిసే ప్రసక్తే లేదని పరోక్షంగా తెలుగుదేశం పార్టీని ఉద్దేశించి ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, జాతీయ కార్యదర్శి సునీల్‌ దేవధర్‌ అన్నారు. సోమవారం ఆయన విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జనసేనతో మాత్రమే తమకు పొత్తు ఉందని చెప్పారు. టీడీపీ, వైఎస్సార్‌సీపీలకు సమానదూరం పాటిస్తున్నామన్నారు.

బయోమెట్రిక్‌ను పక్కాగా అమలు చేయండి

వైద్య శాఖ అధికారులకు మంత్రి రజని ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సెప్టెంబర్‌ ఒకటో తేదీ నుంచి బయోమెట్రిక్‌ హాజరు విధానాన్ని పక్కాగా అమలుచేయాలని వైద్య, ఆరోగ్య శాఖ అధికారులను మంత్రి విడదల రజని ఆదేశించారు. మంగళగిరిలోని వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులు, వివిధ విభాగాల అధిపతులతో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్సల సంఖ్యను ప్రభుత్వం గణనీయంగా పెంచిందని, అర్హులైన ప్రజలకు సరైన చికిత్స అందేలా చూడాలన్నారు. ఆయుష్‌ డిస్పెన్సరీలను పెంచేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అన్ని పరీక్షలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఏపీఎంఎస్‌ఐడీసీ చైర్మన్‌ చంద్రశేఖర్‌ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శులు ఎంటీ కృష్ణబాబు, ముద్దాడ రవిచంద్ర, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌ జె.నివాస్‌, ఏపీవీవీపీ కమిషనర్‌ వినోద్‌కుమార్‌, ఏపీఎంఎస్‌ఐడీసీ ఎండీ మురళీధర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో బోధనాస్పత్రుల పాత్ర కీలకం

పేద, మధ్య తరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించే విషయంలో ప్రభుత్వ బోధనాస్పత్రుల పాత్ర కీలకమని మంత్రి విడదల రజని చెప్పారు. డీఎంఈ పరిధిలోని వైద్య కళాశాలలు, బోధనాస్పత్రుల ప్రిన్సిపాళ్లు, సూపరింటెండెంట్‌లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆస్పత్రుల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్యులు విధుల్లో ఉండేలా చూడాల్సిన బాధ్యత సూపరింటెండెంట్లు, ప్రిన్సిపాళ్లదేనని స్పష్టంచేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో సెక్యూరిటీ, శానిటేషన్‌, పెస్ట్‌ కంట్రోల్‌ ఏజెన్సీల పనితీరును మెరుగుపరచాలని, ఈ మూడు ఏజెన్సీల సిబ్బందికి కూడా సెప్టెంబర్‌ ఒకటో తేదీ నుంచి బయోమెట్రిక్‌ను తప్పనిసరి చేయాలని చెప్పారు.

మైనారిటీ కమిషన్‌ సేవలు వినియోగించుకోండి

కమిషన్‌ చైర్మన్‌ ఇక్బాల్‌ అహ్మద్‌ఖాన్‌



సాక్షి, అమరావతి: రాష్ట్ర మైనారిటీల కమిషన్‌ సేవలను మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని ఏపీ మైనారిటీల కమిషన్‌ చైర్మన్‌ డాక్టర్‌ కె.ఇక్బాల్‌ అహ్మద్‌ఖాన్‌ కోరారు. సోమవారం మంగళగిరిలోని కమిషన్‌ ప్రధాన కార్యాలయంలో కమిషన్‌ కార్యదర్శి కొమ్మినేని అనురాధతో కలిసి ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి తనపై ఎంతో నమ్మకంతో చైర్మన్‌గా బాధ్యతలు అప్పగించారన్నారు. సెక్షన్‌ 12 ప్రకారం కమిషన్‌కు సివిల్‌ కోర్టు అధికారాలు ఉంటాయన్నారు. మైనారిటీల రక్షణ, హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కమిషన్‌ పని చేస్తోందన్నారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పారసీలు, జైనులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తక్షణం కమిషన్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు.

పేదల సంక్షేమం కోసం సీఎం యుద్ధం చేస్తున్నారు

ఆస్ట్రేలియాలో ప్రవాసాంధ్రుల సమావేశంలో మంత్రి రోజా



మాట్లాడుతున్న మంత్రి రోజా


సాక్షి, అమరావతి: పేదల సంక్షేమానికి, సమ సమాజాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి యుద్ధం చేస్తున్నారని పర్యాటక, సాంస్కృతిక, యువజన సంక్షేమ శాఖ మంత్రి ఆర్కే రోజా అన్నారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం ఆస్ట్రేలియాలో రోజా విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా మెల్‌బోర్న్‌లో సోమవారం వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్‌ చింతలచెరువు సూర్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య అతిథి మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డితో కలిసి ప్రవాసాంధ్రుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ కుట్రలు, దుష్ట చతుష్టయం కుతంత్రాలను సీఎం జగన్‌ ఎదిరిస్తూ దేశం మెచ్చే పాలన అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడికి విస్తృత అవకాశాలు ఉన్నాయని, ప్రవాసాంధ్రులు ముందుకు రావాలని కోరారు. సెప్టెంబర్‌ ఒకటో తేదీన బ్రిస్‌బేన్‌లో జరిగే వైఎస్‌ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో మంత్రి రోజా పాల్గొంటారు. అనంతరం 3న ఆసిస్‌ తెలుగు అసోసియేషన్‌ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలకు ఆమె హాజరవుతారు. తర్వాత ప్రవాస భారతీయులు, ఆస్ట్రేలియా పెట్టుబడిదారులతో ఏపీ టూరిజంలో పెట్టుబడులను ఆహ్వానిస్తూ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు.

ప్రతి ఇంటా ఆనందం

సాక్షి, నెట్‌వర్క్‌: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా సాగుతోంది. గ్రామాల్లో పర్యటిస్తున్న ప్రజాప్రతినిధులకు ప్రతి ఇంటి వద్ద ప్రజల నుంచి అపూర్వ ఆదరణ లభిస్తోంది. అన్ని జిల్లాల్లో సోమవారం ఈ కార్యక్రమం వేడుకగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఏమైనా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్‌ జగన్‌కి తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజలు దీవిస్తున్నారు.




ఎన్టీఆర్‌ జిల్లా కొణిజెర్లలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కె.రక్షణనిధి



విజయనగరం జిల్లా కొవ్వాడ అగ్రహారంలో ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు



అన్నమయ్య జిల్లా మదనపల్లి రెడ్డెప్పనాయుడు కాలనీలో మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా



తపస్సు, ధ్యానం- అంటే ప్రపంచాన్ని వొదిలి మూల వొదగడం కాదు. సర్వాన్నీ ప్రేమతో కావలించుకోగల శక్తి కోసం వెతుక్కోవడం.
– చలం

సాక్షి
మంగళవారం, ఆగస్టు, 30

కుప్పకూలిన అక్రమం

సుదీర్ఘ న్యాయపోరాటం ఫలించింది. భవనాల ఎత్తులోనే కాదు.. భయం, బాధ్యత లేని అవి నీతిలోనూ దేశంలోకెల్లా అతి ఎత్తైన జంట ఆకాశ హర్మ్యాలు ఎట్టకేలకు కూల్చివేతకు గురయ్యాయి. ఢిల్లీ శివారులో యూపీ పరిధిలోకి వచ్చే నోయిడాలో 100 అడుగుల ఎత్తు వివాదాస్పద జంట భవంతులను సుప్రీమ్ కోర్ట్ ఆదేశాల మేరకు అధికారులు ఆదివారం కూల్చివేసిన ఘటన అనేక విధాల చరిత్రాత్మకం. ఇంతటి భారీ స్థాయి కూల్చివేత జరగడం దేశంలో ఇదే తొలిసారి. 'వాటర్ ఇంప్లోజన్' పద్ధతిలో 12 సెకన్లలో చాకచక్యంగా ఆకాశహర్మ్యాల కూల్చివేత పూర్తి చేయడం, చుట్టు పక్కలి ఆవాసాలకు నష్టం వాటిల్లకుండా అతి పెద్ద ప్రక్రియను విజయవంతం చేయడం విశేషం. వివిధ రాష్ట్రాల్లో విచ్చలవిడిగా సాగుతున్న నిర్మాణ నిబంధనల అతిక్రమణ నుంచి ఇప్పటికైనా పాల కులు నిద్ర నటించడం మానాల్సిన అవసరం దాకా అనేక అంశాల్ని ఈ కూల్చివేత తెరపైకి తెచ్చింది.

ప్రభుత్వ నిబంధనల యథేచ్ఛ ఉల్లంఘనకు నోయిడా సూపర్‌టెక్ ట్విన్ టవర్స్ అతి పెద్ద ఉదాహరణ. భవన నిర్మాణ సంస్థ సూపర్‌టెక్ డెవలపర్స్‌తో చేతులు కలిపి నోయిడా అధికార యంత్రాంగం సాగించిన అవినీతికి కళ్ళెదుటి సాక్ష్యం. ఈ జంట ఆకాశహర్మ్యాలలో అనుమతించిన వాటికి మించి కట్టిన అంతస్థులు ఎక్కువ. ఒక్కముక్కలో వీటి ఎత్తు ఢిల్లీలోని చరిత్రాత్మక కుతుబ్ మినార్‌ను మించిపోయింది. పైపెచ్చు ఈ బహుళ అంతస్థుల భవంతులు రెంటికీ మధ్య అంతరం కేవలం 9 మీటర్లే. ఫలితంగా, అనేక నివాసాలకు తగినంత గాలి, వెలుతురు రాని పరిస్థితి. భవన నిర్మాతలపై ఆ ప్రాంగణంలోని నివాసుల సంక్షేమ సంఘం 2012లోనే అలహాబాద్ హైకోర్టుకు వెళ్ళింది. అవినీతి, అక్రమాలను గుర్తించిన కోర్ట్ 2014లోనే టవర్స్‌ను కూల్చివేయాల్సిందిగా ఆదేశించింది. సుప్రీమ్ కోర్ట్ సైతం దాన్ని సమర్థిస్తూ, బయ్యర్ల సొమ్మును వడ్డీతో సహా వెనక్కి ఇచ్చేయమంటూ గత ఏడాదే ఆదేశించింది. ఆ కూల్చివేత భారీ పరిమాణం రీత్యా ఇప్పటికి జరిగింది.

భవన నిర్మాణ నిబంధనల్ని ఉల్లంఘించడం ఇప్పుడు దేశవ్యాప్తంగా అన్నిచోట్లా విచ్చలవిడిగా సాగుతున్న ఆందోళనకర పరిణామం. నోయిడా ట్విన్ టవర్స్ అందుకు చిరు ఉదాహరణ మాత్రమే. ప్రభుత్వ నిబంధనలు ఏవైనప్పటికీ వాటిని బేఖాతరు చేస్తూ, ఇష్టారాజ్యంగా బహుళ అంతస్థుల భవనాలు, బడాబాబుల విల్లాలు, భారీ అపార్ట్‌మెంట్లు కట్టడం ఇప్పుడు రివాజైంది. స్థానిక అధికార యంత్రాంగం చేతులు తడిపి, నోరు విప్పకుండా సాగుతున్న ఈ ధందా ఆ పైన ప్రభుత్వాలు తరచూ ప్రకటించే భవనాల క్రమబద్ధీకరణ ప్రక్రియలో రాజముద్ర వేయించేసుకుంటోంది. తప్పులు చేయడమే కాక, వేలెత్తి చూపినవారిని నిందిస్తూ, రకరకాలుగా సమర్థించుకొనే ప్రయత్నాలకూ మన దగ్గర కొదవ లేదు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని, నిబంధనలకు విరుద్ధంగా కృష్ణానదీ గర్భంలో కట్టిన ఇంట్లో మాజీ సీఎం చంద్రబాబు కథ ఆంధ్రప్రదేశ్‌లో కొన్నాళ్ళ క్రితం చూశాం. అక్రమ కట్టడాల్ని కూల్చివేయడానికి సమకట్టిన ప్రభుత్వంపై అన్యాయం, అధర్మం, దుర్మార్గం అంటూ దుమ్మెత్తిపోయడం గమనించాం. చేసిన తప్పును కప్పిపుచ్చుకొంటూ, కక్షసాధింపు ముద్ర వేయాలనుకోవడం అవివేకం. అలాంటి వారందరికీ తాజా నోయిడా ఉదంతం ఒక చెంపపెట్టు.

దిగ్భ్రాంతికరమైన విషయం ఏమిటంటే – ఈ ట్విన్ టవర్స్ వ్యవహారంలో ఇప్పటి దాకా ప్రభుత్వ అధికారులు, అగ్నిప్రమాద నివారక విభాగం వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం! మన దేశంలోని రాజకీయ, పాలనా యంత్రాంగాల్లోని అవినీతిని ఇది బట్టబయలు చేస్తోంది. ఇప్పటికీ అనేక నగరాల్లో సరైన అనుమతులు లేకుండా సాగుతున్న నిర్మాణాలు సగానికి పైనే ఉంటాయని ఓ అంచనా. నిర్మాణాలపై సరైన నిఘా కానీ, నియంత్రణ కానీ, నిర్ణయాత్మకమైన చర్యలు కానీ లేకపోవడం ఇలాంటి అక్రమార్కులు బరి తెగించడానికి కారణమవుతోంది. ఈ ఉల్లంఘనల్లో భవన నిర్మాతలతో పాటు పాలకుల తప్పు కూడా కొంత లేకపోలేదు. కారణాలు ఏమైనా, స్థానిక ప్రభుత్వాలు తరచూ భవనాల క్రమబద్ధీకరణ పథకాన్ని (బీఆర్‌ఎస్) ప్రకటిస్తూ, జరిమానా విధింపుతో నిర్మాణాల్లోని తప్పుల్ని ఒప్పుల్ని చేస్తున్నాయి. బీఆర్‌ఎస్‌ను సర్కారీ ఆదాయ అవసరాలను తీర్చే కల్పవృక్షం, కామధేనువుగా చూస్తున్నాయి. భవన నిర్మాతలు సైతం తర్వాత డబ్బు కట్టి, రాజముద్ర వేయించుకోవచ్చనే ధీమాతో ఆది నుంచే అన్ని రూల్సునూ అడ్డంగా అతిక్రమిస్తూ, నిర్మాణాలు సాగిస్తున్నారు. ఆ పద్ధతి మార్చుకొని, తాజా ఘటనతో భవన నిర్మాణ రంగంలో కొరవడ్డ నమ్మకాన్ని పునరుద్ధరించాలి. పారదర్శకంగా, నియమాలు పాటించాలి.

పాలకులు సైతం బీఆర్‌ఎస్ మంత్రజపం మానుకోవాలి. దోషులని తేలిన అధికారులు, భవన నిర్మాతలపై కఠిన చర్యలు చేపట్టాలి. ట్విన్ టవర్స్ నిర్మించిన సంస్థ మిగిలిన వారికి డబ్బులు వెనక్కి ఇవ్వడమో, ప్రత్యామ్నాయ ఫ్లాట్లు అందించడమో చేసినా, ఇప్పటికీ మరో 59 మంది బయ్యర్లకు న్యాయం జరగలేదు. ఈ అవినీతి హర్మ్యాలపై పరస్పర నిందారోపణలు చేసుకుంటున్న బీజేపీ, ఎస్పీలు ఆ పని మాని, బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి. అన్నిచోట్లా బయ్యర్లు ట్విన్ టవర్స్ ప్రాంగణవాసుల లాగా సుదీర్ఘ పోరాటం చేయలేరు గనక నిర్మాణం కన్నా ముందే ప్రభుత్వాలే కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి. ఉల్లంఘనల్ని ససేమిరా అనుమతించబోమనే సంకేతాలివ్వాలి. అందుకు తాజా కూల్చివేత తొలి అడుగు కావాలి. అవసరమైతే ఇలాంటి కూల్చివేతలు మరిన్ని జరగాలి. అప్పుడే అందరిలో చైతన్యం పెరుగుతుంది. అవకతవకలకు అడ్డుకట్ట పడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** శు.తదియ ప.2.28 వరకు తదుపరి చవితి, **నక్షత్రం:** హస్త రా.11.47 వరకు, తదుపరి చిత్ర **వర్జ్యం:** ఉ.7.55 నుండి 9.32 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.52 నుండి 11.36 వరకు **అమృతఘడియలు:** సా.5.38 నుండి 7.16 వరకు.

సూర్యోదయం: 5.48 **రాహుకాలం:** ప. 3.00 నుంచి 4.30 వరకు
సూర్యాస్తమయం: 6.14 **యమగండం:** ఉ.9.00 నుంచి 10.30 వరకు

ఇన్‌బాక్స్ గణపతికి జీఎస్టీ దెబ్బ

విఘ్నాలు వస్తే గణపతిని పూజించి విఘ్నాలు బాపుకొంటాం. మరి అలాంటి గణపతికే విఘ్నాలు వస్తే ఎవరితో చెప్పుకోవాలి? కరోనా మహమ్మారి మూలంగా 2020లో గణేశ్ చతుర్థి ఉత్సవాలు నిషేధించారు. గత ఏడాది ప్రభుత్వం అనుమతించినా ప్రజలు భయపడి వెనకడుగు వేశారు. గతంలో రూ. 500 ఉన్న విగ్రహం ప్రస్తుతం రూ. 1,000 దాకా పలుకుతోంది. పెద్ద విగ్రహాలు గతంలో రూ. 10 వేలకు దొరకగా ఇప్పుడు రూ. 15-18 వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇంట్లో పూజించే చిన్న విగ్రహాల ధరలు సైతం విపరీతంగా పెంచేశారు.

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, పీచు, రంగులు, వైట్ సిమెంట్ వంటి ముడిసరుకుల ధరలు జీఎస్టీ మూలంగా విపరీతంగా పెరిగిపోయాయనీ, తామేమీ చెయ్యలేని పరిస్థితి అని విగ్రహ తయారీదార్లు అంటున్నారు. మండపాల అలంకరణ సామగ్రి, రంగు కాగితాల ధరలు గతంలో కంటే రెట్టింపయ్యాయని చెబుతున్నారు. వైట్ సిమెంటు మీద 28 శాతం జీఎస్టీ ఉండగా, మిగతా వస్తువులపై 12 నుండి 18 శాతం వరకూ ఉంది. దీంతో విగ్రహాల ధరలు అనివార్యంగా పెరిగాయి. ఫలితంగా ఈనెల 31 నుండి ప్రారంభం కావాల్సిన గణపతి నవరాత్రుల సందడి ఎక్కువగా కనపడ్డం లేదు.

– డా॥ టేకుమళ్ళ వెంకటప్పయ్య, విజయవాడ

రామోజీ.. నవయుగ... ఓ పోలవరం!



పోలవరంపై రామోజీరావుకున్నంత ఆందోళన బహుశా..
అక్కడి నిర్వాసితులకు కూడా లేదేమో!!.
ప్రతిరోజూ పనిగట్టుకుని ఏదో ఒక వ్యతిరేక కథనం!.
ముఖ్యమంత్రి జగన్‌పై బురద చల్లటం.
ఏదో జరిగిపోయినట్లుగా... ప్రభుత్వం ఏకంగా ఈ ప్రాజెక్టునే
గాలికి వదిలేసినట్లుగా మతిలేని దుర్మార్గపు కథనాలు.
ఏం! వరదలు తగ్గేవరకూ పనులు ఆరంభించటం కుదరదని
రామోజీకి తెలియదా? అసలు వరదల ప్రభావం
నిర్మాణాలపై పడకుండా చేయాల్సిన చంద్రబాబు...
కమిషన్ల కోసం గడ్డితిన్న విషయం 'ఈనాడు'కు గుర్తుండదా?
ప్రవాహాన్ని మళ్లించకుండానే కమీషన్ల కోసం ఈసీఆర్ఎఫ్
'పునాది' పనులు ఆరంభించేసి... చివరికి అవన్నీ
కొట్టుకుపోవటానికి కారణమైన చంద్రబాబును మీ అక్షరం
ఒక్కటి కూడా తప్పుపట్టలేదెందుకు రామోజీరావు గారూ?
బాబుకు వ్యతిరేకంగా ఒక్క అక్షరం కూడా ఖర్చు
చేయలేదెందుకు? మీ వియ్యంకుల వారికి జస్ట్ నామినేషన్
పద్ధతిమీద ఏకంగా రూ.3,302 కోట్ల విలువైన పోలవరం
పనుల్ని కట్టబెట్టేసినందుకా? ప్రపంచంలో ఎక్కడా లేని
విధంగా... ఆఖరికి రక్షణ రంగంలో కూడా లేని విధంగా
అంత భారీ కాంట్రాక్టును నామినేషన్‌పై ఇచ్చేస్తే మీ దృష్టిలో
అదో అత్యద్భుతమైన నిర్ణయం. బాబు దార్శనికతకు
ఓ మచ్చుతునక. ఈ ఘోరాన్ని సరిదిద్దటానికి వై.ఎస్.జగన్
ఆ కాంట్రాక్టును రద్దుచేశారు కాబట్టి ఇక మీరు రోజూ
పెన్నెత్తుతూనే ఉంటారు. రివర్స్ టెండర్ ద్వారా
రూ.830 కోట్లు మిగల్చటం మీ దృష్టిలో మహాపరాధం!
అంతేనా రామోజీ?

పోలవరం ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి. అందులో ఎవ్వరికీ ఎలాంటి సందేహాలూ లేవు. కాకపోతే ఈ ప్రాజెక్టు నిర్మాణం అనుకున్నట్లుగా ముందుకెళ్లటం లేదు. దీనికి కారణాలేంటి? అసలు తప్పు జరిగిందెక్కడ? చేసిందెవరు? దాన్నిపుడు ఎలా సరిదిద్దాలి? సరిదిద్దే ప్రయత్నాలు చేస్తున్నారా? ఇవికదా ఇప్పుడు ఆలోచించాల్సినవి!!. వీటి గురించి కదా చర్చించాల్సింది!!. మరి 'ఈనాడు' నిత్యం రాస్తున్న అబద్ధాల్లో వీటి గురించి ఏ కొంచమైనా ఉందా? ప్రాజెక్టుకు ఈ దుస్థితి కల్పించిన చంద్రబాబు నిర్ణయాల ప్రస్తావనైనా ఉందా? వాటన్నిటినీ సరిదిద్దుకుంటూ ముందుకెళుతున్న వైఎస్ జగన్ ప్రభుత్వ చర్యల్ని రోజూ తప్పుబట్టడమేనా? అసలిందులో ఏది నిజం? సజీవ సాక్ష్యాలైన చిత్రాలు చెబుతున్న వాస్తవాలేంటో ఒకసారి చూద్దాం...

పశ్చిమగోదావరి జిల్లా పోలవరం మండలం రామన్నగూడెం వద్ద గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు మిగతా సాగునీటి ప్రాజెక్టుల్లాంటిది కాదు. వైవిధ్యమైనది. ఆ ప్రాంతంలోని భూభౌతిక పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)... గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా నదికి ఆవల కుడి వైపున రాతినేలపై స్పిల్ వేను.. నదికి అడ్డంగా ఇసుక తిన్నెలపై 2454 మీటర్ల పొడవున ఈసీఆర్ఎఫ్‌ను(ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్) నిర్మించేలా డిజైన్ ఖరారు చేసింది. దాని ప్రకారమే పోలవరం ప్రాజెక్టును నిర్మించాలి.

వియ్యంకుల కాంట్రాక్టు పోవటంతో రామోజీ కడుపు మంట

ఏదో జరిగిపోతున్నట్లుగా ప్రతిరోజూ అసత్యాల వంట

వాస్తవాలను విస్మరిస్తూ... బాబుపై నింద పడకుండా తంటాలు



నిర్మించాల్సిన విధానం ఇదీ..

1 ఎగువన నదీ ప్రవాహాన్ని మళ్లిస్తూ... ఆ ప్రవాహాన్ని దిగువకు పంపడానికి 48 గేట్లతో కూడిన స్పిల్ వే, 6.1 కిలోమీటర్ల పొడవున అప్రోచ్ చానల్, స్పిల్ చానల్, పైలట్ చానల్‌ను మొదట పూర్తి చేయాలి. ఇలా చేస్తే... దిగువకొచ్చే ప్రవాహం తగ్గిపోతుంది.

2 ఆ తర్వాత 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 115 గ్రామాలకు చెందిన 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పిస్తూ... ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతానికి ఎగువన 2,480 మీటర్ల పొడవు, 42.5 మీటర్ల ఎత్తుతో ఒకటి.. దిగువన 1630 మీటర్ల పొడవు, 30.5 మీటర్ల ఎత్తుతో మరొక కాఫర్ డ్యామ్‌లను నిర్మించాలి.

3 గోదావరి ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లిస్తారు కనక... ప్రధాన నదీ ప్రవాహ ఉధృతి తగ్గుతుంది. అలా ఉధృతి లేకుండా వచ్చే నీటిని ఎగువ కాఫర్ డ్యామ్ ఆపుతుంది. దిగువన మరో కాఫర్ డ్యామ్ ఉంటుంది కనక... ఈ రెండింటి మధ్యా నీరుండదు కనక... అక్కడ ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో.. పునాదిని (డయా ఫ్రమ్ వాల్) నిర్మించాల్సి ఉంటుంది. అనంతరం దానిపై 53 మీటర్ల ఎత్తుతో ఈసీఆర్ఎఫ్ డ్యామ్‌ను పూర్తి చేయాలి.

కానీ చంద్రబాబు ఏం చేశారో తెలుసా?

- ఇలా పద్ధతి ప్రకారం పనులు చేసి ఉంటే పోలవరం ప్రాజెక్టు ఇప్పటికే పూర్తయిపోయి ఉండేది. పునరావాస పనులు కాకున్నా... ప్రాజెక్టు పనులైతే పూర్తయిపోయేవి. కానీ చంద్రబాబు ఈ ప్రాజెక్టును ఏపీ జీవనాడిగా కాకుండా... ఏటీఎంగా చూశారు. ఆ విషయాన్ని సాక్షాత్తూ దేశ ప్రధాని నరేంద్రమోదీయే బహిరంగంగా చెప్పారు కూడా.
- అయితే... పోలవరంలో ఓ ఏటీఎంను కనుగొన్న చంద్రబాబు... రూ.3,302 కోట్ల విలువైన పనులను ఏకంగా నామినేషన్ పద్ధతిలో రామోజీరావు వియ్యంకులకు నవయుగ సంస్థకు కట్టబెట్టారు. అదికూడా ఈపీసీ(ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్) విధానంలో చేసుకున్న కాంట్రాక్టు ఒప్పందంలో 60సీ నిబంధన రద్దు చేసి.. ఎల్ఎస్(లంప్సమ్)-ఓపెన్ విధానంలో నవయుగకు కట్టబెట్టారు.
- దేశ చరిత్రలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన పనుల్లో ఇదే అతి పెద్ద స్కామ్.
- ఇంత భారీ మొత్తాన్ని నామినేషన్ ప్రాజెక్టుగా ఇవ్వటం చరిత్రలోనే లేదు. కానీ బాబు అక్కడితో ఆగలేదు.. రామోజీ మెప్పు కోసం రూ.3,220 కోట్ల విలువైన పోలవరం జలవిద్యుత్కేంద్రం నిర్మాణ పనులనూ నవయుగకే కట్టబెట్టేశారు.



అంతేకాదు!!.

1. స్పిల్ వే పునాది స్థాయిలో ఉన్నప్పుడే... ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు కట్టకుండానే ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పునాది డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేశారు.
2. స్పిల్ వే 22 మీటర్ల స్థాయిని కూడా దాటక ముందే.. నిర్వాసితులకు పునరావాసం కల్పించకుండా ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. తమకు పునరావాసం కల్పించకుండా కాఫర్ డ్యామ్‌లు నిర్మిస్తే.. అవి నదీ ప్రవాహానికి అడ్డంకిగా మారి.. తమ గ్రామాల్లోకి గోదావరి వరదను ముంచెత్తేలా చేస్తాయని పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ), కేంద్ర జల్ శక్తి శాఖలకు నిర్వాసితులు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన పీపీఏ.. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తూ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయాలని 2018, డిసెంబర్‌లో సూచించింది.
3. నిర్వాసితులకు పునరావాసం కల్పిస్తే కమీషన్లు ఎక్కడొస్తాయి? దీంతో చంద్రబాబు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండా.. ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఇరువైపులా 750 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్‌లో 400 మీటర్ల వెడల్పుతో ఖాళీలను వదిలేశారు. అంటే నీరు నిండకుండా కిందికి వదిలేశారన్న మాట.
4. స్పిల్ వే పూర్తయి ప్రవాహాన్ని మళ్లించి ఉంటే ప్రవాహం మొత్తం అటు వెళ్లి ఈసీఆర్ఎఫ్ పునాది సురక్షితంగా ఉండేది. కాఫర్‌డ్యామ్‌లు పూర్తయినా అది కోతకు గురయ్యేది కాదు. కానీ బాబు నిర్వాకంతో 2019, ఆగస్టులో వచ్చిన వరదకు 2400 మీటర్ల వెడల్పున ప్రవహించాల్సిన గోదావరి నది.. ఎగువ కాఫర్ డ్యామ్‌లో ఖాళీగా ఉన్న 750 మీటర్ల గుండా కుంచించుకుపోయి ప్రవహించింది. దాంతో వరద ఉధృతి పెరిగి.. ఈసీఆర్ఎఫ్ డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో ఇసుక తిన్నెలు కోతకు గురయ్యాయి. -12 నుంచి -22 మీటర్ల లోతుకు రెండు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 680 మీటర్లలో కోతకు గురై... భారీ అగాధం ఏర్పడింది. వరద ఉధృతికి డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ఇదే పోలవరం పనుల్లో ఆలస్యానికి కారణమైంది.

స్పిల్ వే మీదుగా గోదావరి వరద నీరు



దెబ్బతిన్న పునాదులు (డయాఫ్రమ్ వాల్)



సీఎం జగన్ సరిదిద్దుతున్నది ఇలా...

1. అధికారంలోకి వచ్చిన ఈ మూడేళ్లలో... సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్ ప్రకారం 48 గేట్లతో సహా స్పిల్ వే... 6.1 కి.మీ.ల పొడవున అప్రోచ్ చానల్, స్పిల్ చానల్‌లను రికార్డు సమయంలో పూర్తి చేశారు.
2. ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేసి.. గతేడాది జూన్ 11న గోదావరి వరద ప్రవాహాన్ని స్పిల్ వే మీదుగా మళ్లించారు.
3. 41.15 మీటర్ల పరిధిలోని 20,946 కుటుంబాలకుగానూ.. దివంగత నేత వైఎస్ నిర్మించిన కాలనీల్లో 3,922 కుటుంబాలకు గత సర్కార్ పునరావాసం కల్పించింది. జగన్ ఇప్పుడు 7,634 కుటుంబాలకు పునరావాసం కల్పించారు. మిగతా 9,390 కుటుంబాలకు వేగంగా పునరావాసం కల్పిస్తున్నారు.
4. దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 680 మీటర్ల వరకూ కోతకు గురైన ప్రదేశాన్ని జెట్ గ్రౌటింగ్ చేస్తూ.. జియో మెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి.. వాటిని అగాధం ఏర్పడిన ప్రాంతంలో వేసి.. వైబ్రో కాంపాక్షన్ చేస్తూ పూడ్చి.. 30.5 మీటర్ల ఎత్తుతో జూలై 31 నాటికి పూర్తి చేయాలని ఏప్రిల్ ఆఖరులో పీపీఏ, డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ సూచించాయి. జియో మెంబ్రేన్ బ్యాగ్స్ వినియోగం చాలా తక్కువ. దాంతో లభ్యత అంతంత మాత్రమే. గుజరాత్, అస్సాంలలోని ఉత్పత్తి సంస్థలకు ఆర్డర్ ఇచ్చి.. 2.50 లక్షల జియో మెంబ్రేన్ బ్యాగ్స్‌ను సేకరించారు. జెట్ గ్రౌటింగ్ విఫలమవుతుండటంతో సమయం ఎక్కువ తీసుకోవడంతో పాటు కష్టమైన పాలీయురిథేన్ (పీయూ) గ్రౌటింగ్ చేస్తూ.. జూలై 9 నాటికే 20 మీటర్ల ఎత్తు వరకు దిగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు. అనుకున్నట్టుగా జూలై 31లోగా మిగతా దిగువ కాఫర్ డ్యామ్ పనులు పూర్తయ్యేవే. కానీ అనూహ్యంగా జూలై 10నే వరదలొచ్చాయి. దీంతో స్పిల్ వే నుంచి దిగువకు విడుదలైన వరద దిగువ కాఫర్ డ్యామ్ మీదుగా ఈసీఆర్ఎఫ్ నిర్మాణ ప్రాంతంలోకి చేరి నిర్మాణ పనులను ముందుకెళ్లకుండా చేసింది. అదీ జరిగింది.


తదుపరి చేయాల్సిందేంటి?

రామోజీ ఎన్ని అబద్ధాలు రాసినా... 'ఈనాడు' ఎంతలా గొంతు చించుకున్నా... వరదలు తగ్గే వరకూ ఎవ్వరూ పనులు చేపట్టే పరిస్థితి ఉండదు. అక్టోబరుకు వరదలు తగ్గుతాయనే అంచనా ఉంటుంది కనక... మూడు నెలలు ఆలస్యంగానైన అక్టోబర్లో పనులు ఆరంభమవుతాయి. కానీ ఇక్కడ మరో చిక్కుంది. ఇప్పటిదాకా వచ్చిన వరదల ఉధృతికి మరికొంత కోత జరుగుతుంది. దాన్ని కూడా పూడ్చాలి. అందుకు ఇంకొంత ఆలస్యం కాకమానదు. ఒకవేళ చంద్రబాబు కనక కమీషన్ల కోసమో... రామోజీ మెప్పుకోసమో కాకుండా పనులన్నీ పద్ధతి ప్రకారం చేసి ఉంటే.. ఈ సమస్యే వచ్చేది కాదు. ఈసీఆర్ఎఫ్ కోతకు గురయ్యేదే కాదు.

కాకపోతే అదసలు సమస్యే కాదన్నట్లు... చంద్రబాబుది తప్పే కాదన్నట్లు ప్రతిరోజూ 'ఈనాడు' రాసే రాతలు... వరదలా వస్తూనే ఉంటాయి. వరద ఆగినా ఈ రాతలు ఆగవేమో!!.

గోదావరి నది మళ్లింపు







ఇటీవల వరదల సమయంలో పోలవరం వద్ద పరిస్థితి..

• తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ కొనసాగింది. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ అన్ని క్యూలు, కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 74,297 మంది దర్శించుకోగా.. 27,317 మంది తలనీలాలు సమర్పించారు. శ్రీవారి దర్శనానికి 6 గంటల సమయం పడుతోంది.

కృష్ణమ్మ మళ్లీ ఉగ్రరూపం

- నారాయణపూర్‌కు దిగువన విస్తారంగా వర్షాలు
- శ్రీశైలం ప్రాజెక్టులోకి 3.88 లక్షల క్యూసెక్కులు.. పది గేట్లు ఎత్తివేత
- నాగార్జునసాగర్‌లోకి 4.02 లక్షల క్యూసెక్కులు
- 4.63 లక్షల క్యూసెక్కులు దిగువకు
- సాగర్ దిగువన లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు
- ప్రకాశం బ్యారేజ్ వద్ద పెరుగుతున్న వరద


నాగార్జునసాగర్ నుంచి క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సాక్షి, అమరావతి/శ్రీశైలంప్రాజెక్ట్/విజయపురిసౌత్/సత్రశాల(రెంటచింతల): నారాయణపూర్ డ్యామ్ దిగువన కృష్ణా ప్రధాన పాయ, తుంగభద్ర పరీవాహక ప్రాంతాల్లో, కర్నూలు, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఆదివారం విస్తారంగా వర్షాలు కురవడంతో కృష్ణా, తుంగభద్ర, ఉప నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. దాంతో కృష్ణమ్మ మళ్లీ ఉగ్రరూపం దాల్చింది. సోమవారం సాయంత్రం 6 గంటలకు శ్రీశైలం ప్రాజెక్టులోకి 3,88,090 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా 15,833, హంద్రీ-నీవా ద్వారా 914, కల్వకుర్తి ద్వారా 1,167 క్యూసెక్కులు తరలిస్తున్నారు. పది గేట్లను 15 అడుగుల మేర ఎత్తి 3,75,680 క్యూసెక్కులను, కుడి, ఎడమ గట్టు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 62,112 క్యూసెక్కులు.. వెరసి 4,37,792 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలంలో 884.2 అడుగుల్లో 210.99 టీఎంసీలు నిల్వ చేస్తున్నారు. నాగార్జునసాగర్‌లోకి 4,02,366 క్యూసెక్కులు ప్రవాహం వస్తోంది. కుడి, ఎడమ కాలువలు, ఏఎమ్మార్పీ, వరద కాలువలకు 20,589 క్యూసెక్కులు వదులుతున్నారు. సాగర్ స్పిల్ వే 26 గేట్లు, ప్రధాన విద్యుత్కేంద్రం ద్వారా 4,63,888 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం సాగర్‌లో 588.6 అడుగుల్లో 307.87 టీఎంసీల నీరు నిల్వ చేస్తున్నారు. సాగర్ నుంచి భారీగా నీరు విడుదల చేయడంతో దిగువన లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సాగర్ నుంచి వస్తున్న ప్రవాహంతో పులిచింతల ప్రాజెక్టులోకి చేరుతున్న వరద గంట గంటకూ పెరుగుతోంది. పులిచింతల ప్రాజెక్టులోకి 3,87,289 క్యూసెక్కులు చేరుతుండగా స్పిల్ వే గేట్లు, విద్యుత్ కేంద్రం ద్వారా 3,99,834 క్యూసెక్కులను దిగువకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం పులిచింతలలో 169.19 అడుగుల్లో 37.23 టీఎంసీలను నిల్వ చేస్తున్నారు. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద వరద ఉద్ధృతి పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్‌లోకి 2,10,692 క్యూసెక్కులు చేరుతుండగా.. కృష్ణా డెల్టాకు 14,962 క్యూసెక్కులను విడుదల చేస్తూ.. మిగులుగా ఉన్న 1,95,090 క్యూసెక్కులను సముద్రంలోకి వదిలేస్తున్నారు. మంగళవారం ఉదయానికి ప్రకాశం బ్యారేజ్‌లోకి వచ్చే వరద 4.50 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉందని అధికవర్గాలు తెలిపాయి. కృష్ణా బేసిన్‌లో మంగళవారమూ విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనాల నేపథ్యంలో మరో మూడు రోజులపాటు కృష్ణాలో వరద ఉద్ధృతి కొనసాగే అవకాశం ఉంది.

విజయవాడలో ఎల్‌ఐసీ మ్యూచువల్ ఫండ్ శాఖ

రాష్ట్రంలోనే మొదటి బ్రాంచ్‌ను ప్రారంభించిన మేనేజింగ్ డైరెక్టర్

లబ్బీపేట(విజయవాడతూర్పు): దేశంలో ప్రముఖ మ్యూచువల్ ఫండ్ కంపెనీల్లో ఒకటైన ఎల్‌ఐసీ మ్యూచువల్ ఫండ్ శాఖ మొదటి బ్రాంచ్‌ని రాష్ట్రంలోనే తొలిసారిగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఏర్పాటు చేశారు. బెంజిసర్కిల్ సమీపంలోని పటమట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ రోడ్డులో ఏర్పాటు చేసిన నూతన శాఖను సోమవారం ఎల్‌ఐసీ మ్యూచువల్ ఫండ్ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టీఎస్ రామకృష్ణన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడలో ఏర్పాటు చేసిన మొదటి కార్యాలయం ఏపీలో తమ ఉనికిని మరింత బలోపేతం చేసేందుకు దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించేందుకు కృషిచేస్తామన్నారు. విజయవాడలో కొత్త కస్టమర్లను ఆకర్షించేందుకు నూతన బ్రాంచి దోహదపడుతుందని చెప్పారు.

నకిలీ బంగారంతో రూ.60 లక్షలు స్వాహా

- అన్నమయ్య జిల్లాలో ఎస్‌బీఐ క్యాషియర్ నిర్వాకం

రామాపురం: ఎస్‌బీఐ క్యాషియర్ ఒకరు కుటుంబ సభ్యుల పేర్లతో నకిలీ బంగారం కుదువ పెట్టి రూ.60 లక్షలు స్వాహా చేశాడు. అన్నమయ్య జిల్లా రామాపురంలో సోమవారం ఈ ఘటన వెలుగు చూసింది. ఎస్‌బీఐ రామాపురం బ్రాంచ్‌లో క్యాషియర్ రవికుమార్ మరికొంతమంది సిబ్బందితో ఈ కథ నడిపించినట్లు సమాచారం. మరికొందరు ఖాతాదారుల పేర్లతోనూ ఇదే రీతిలో డబ్బు స్వాహా చేసినట్లు తెలిసింది. మొత్తంగా రూ.కోటి కిపైగా డ్రా చేసినట్టు తెలిసింది. 15 రోజుల క్రితం ఉన్నతాధికారులు ఈ విషయాన్ని గుర్తించి రవికుమార్‌ను సస్పెండ్ చేశారు. దీనిపై అధికారులను వివరణ కోరగా.. నకిలీ బంగారంతో క్యాషియర్ రవికుమార్ నగదును డ్రా చేసిన విషయం వాస్తవమేనని, అతడిని సస్పెండ్ చేసి విచారణ జరుపుతున్నామని చెప్పారు.

కాషన్ డిపాజిట్‌పై దుష్ప్రచారం

- భక్తుల ఖాతాల్లోకే కాషన్ డిపాజిట్ సొమ్ము
- అవాస్తవాలను నమ్మొద్దన్న టీటీడీ
- ఎమ్మెల్సీ బీటెక్ రవిపై పోలీసులకు ఫిర్యాదు

తిరుమల : కాషన్ డిపాజిట్ సొమ్మును రాష్ట్ర ప్రభుత్వం వినియోగించుకుంటోందని, ఈ కారణంగానే ఆలస్యంగా భక్తుల ఖాతాల్లోకి చేరుతోందని కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని, ఇలాంటి అవాస్తవాలను భక్తులు నమ్మొద్దని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కాషన్ డిపాజిట్ సొమ్ము భక్తుల ఖాతాలకే చేరుతోందని పేర్కొంది. ఈ విషయంలో అవాస్తవాలను ప్రచారం చేసిన ఎమ్మెల్సీ బీటెక్ రవిపై టీటీడీ అధికారులు సోమవారం తిరుమల టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు కరెంట్ బుకింగ్, ఆన్‌లైన్ బుకింగ్ విధానంలో గదులు బుక్ చేసుకుంటున్నారు. భక్తులు గదులు ఖాళీ చేసిన తర్వాతి రోజు మధ్యాహ్నం మూడు గంటల్లోపు కాషన్ డిపాజిట్ రీఫండ్ ఎలిజిబిలిటి స్టేట్‌మెంట్ అధీకృత బ్యాంకులైన ఫెడరల్ బ్యాంకు లేదా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులకు చేరుతుంది. ఈ బ్యాంకుల అధికారులు అదే రోజు అర్ధరాత్రి 12 గంటల్లోపు(బ్యాంకు పనిదినాల్లో) సంబంధిత మర్చంట్ సర్వీసెస్‌కు పంపుతారు. మర్చంట్ సర్వీసెస్ వారు మరుసటి రోజు కస్టమర్ బ్యాంకు అకౌంట్‌కు పంపుతున్నారు. కస్టమర్ బ్యాంకు వారు సంబంధిత అమౌంట్ కన్ఫర్మేషన్ మెసేజ్(ఏఆర్ నంబర్)ను, సొమ్మును సంబంధిత భక్తుల అకౌంట్‌కు పంపుతారు. కస్టమర్ బ్యాంకు వారు భక్తుల అకౌంట్‌కు సొమ్ము చెల్లించడంలో జాప్యం జరుగుతోందని టీటీడీ గుర్తించింది. ఒకవేళ భక్తులు సమస్యను.. యాత్రికుల సమాచార కేంద్రాలు, కాల్ సెంటర్, ఈ-మెయిల్ ద్వారా టీటీడీ దృష్టికి తెచ్చిన పక్షంలో పైవివరాలతో సంబంధిత బ్యాంకుల్లో విచారణ చేయాలని భక్తులకు సూచిస్తున్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం 7 బ్యాంకు పనిదినాల్లో కాషన్ డిపాజిట్ రీఫండ్ చేయాల్సి ఉంటుంది. ఈ ఏడాది జూలై 11 నుంచి 4, 5 రోజుల్లో రీఫండ్ చేరేలా టీటీడీ యూపీఐ విధానాన్ని అనుసరిస్తోంది. దీనివల్ల నేరుగా భక్తుల అకౌంట్‌కే రీఫండ్ సొమ్ము జమవుతోంది. వాస్తవాలను నిర్ధారించుకోకుండా అవాస్తవాలను ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని టీటీడీ అధికారులు హెచ్చరిస్తున్నారు.

• తెలంగాణ

బీజేపీ ముక్త భారత్ కోసం కృషి చేద్దాం

పెద్దపల్లి సభలో బీజేపీపై నిప్పులు చెరిగిన కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ''మోసపోతే.. గోసపడతాం. మనం బాగుపడే సమయంలో గుజరాత్ గజదొంగలు వచ్చి మతం పేరు మీద కొట్లాడాలని రెచ్చగొడుతున్నారు. శ్రీరాంసాగర్ కాలువల్లో స్వచ్ఛమైన నీరు పారాలా? మతకలహాల మంటలు చెలరేగి నెత్తురు పారాలా? ఆత్మగౌరవంతో ఉందాం. ఢిల్లీ ఏజెంట్లకు గులాములం కావొద్దు..'' అని తెలంగాణ సీఎం చంద్రశేఖర్‌రావు అన్నారు. సోమవారం పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేసీఆర్ ప్రసంగిస్తూ.. బీజేపీ, కేంద్రం తీరుపై నిప్పులు చెరిగారు. ''గుజరాత్ మోడల్ అని చెప్పి దేశప్రజలను దగా చేసి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం ఈరోజు ఏం చేస్తోంది? అడ్డగోలుగా ధరలు పెంచి పేద ప్రజల ఉసురు పోసుకుంటోంది. అందరం కలిసి 2024లో బీజేపీ ముక్త భారత్ కోసం సన్నద్ధం కావాలి'' అని పిలుపునిచ్చారు.

త్వరలో 'జగనన్న సంక్షేమ యాత్ర'

నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ యానాదయ్య వెల్లడి


మాట్లాడుతున్న యానాదయ్య తదితరులు

కుప్పం: నాయీబ్రాహ్మణ సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లేందుకు త్వరలో 'జగనన్న సంక్షేమ యాత్ర'ను చేపట్టనున్నట్లు రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య తెలిపారు. కుప్పంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. సీఎం జగన్ పాలనలో నాయీబ్రాహ్మణులకు మంచి గుర్తింపు లభించిందన్నారు. ప్రతి నాయీబ్రాహ్మణుడికి దుకాణ నిర్వహణ కోసం ఏటా రూ.10 వేలు సాయంఅందిస్తున్నారని, 150 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తున్నారని చెప్పారు. ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో శాశ్వత ఉద్యోగాలు, చిన్న దేవాలయాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు కల్పించారని చెప్పారు. టీటీడీలో 240 మంది నాయీబ్రాహ్మణులకు శాశ్వత ఉద్యోగులుగా అవకాశం కల్పించారని తెలిపారు. తమ ఆత్మగౌరవానికి భంగం కలిగే పదాలను వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకునేలా జీవో నంబరు 50 జారీ చేశారని వివరించారు. కార్యక్రమంలో సంఘం నేతలు పాల్గొన్నారు.

వంగవీటి రంగాది టీడీపీ ప్రభుత్వ హత్యే

కాపు నేత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట నగేష్ వ్యాఖ్యలు


వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న నగేష్

నక్కపల్లి: దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహన్ రంగాను నాటి టీడీపీ ప్రభుత్వమే హత్య చేయించిందని కాపు నేత, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట నగేష్ ఆరోపించారు. ఆదివారం రాత్రి అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలో వంగవీటి రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా కాపు నాయకులు.. వంగవీటి నరేంద్ర, గెడ్డం బుజ్జి, వీసం రామకృష్ణ తదితరులు హాజరయ్యారు. అనంతరం తోట నగేష్ మాట్లాడుతూ తనకు ప్రాణహాని ఉందని.. భద్రత కల్పించాలని రంగా కోరితే నాటి టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రంగా హత్యకు అప్పటి టీడీపీ ప్రభుత్వమే కారణమన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసని చెప్పారు. వంగవీటి రంగా ఒక్క కాపులకే కాకుండా బడుగు, బలహీన వర్గాల వారందరికీ నాయకుడని తెలిపారు. విజయవాడలో ఈ వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై నిరాహార దీక్ష చేపట్టడం వల్లే అప్పటి టీడీపీ ప్రభుత్వం రంగాను హత్య చేయించిందన్నారు. అత్యధిక ఓటు బ్యాంకు కలిగిన కాపులు ఏదో ఒక పార్టీకి భజనపరులుగా, మద్దతు ఇచ్చే వారుగా మిగిలిపోకూడదన్నారు. రాజకీయాలను శాసించే స్థాయికి రావాలని ఆకాంక్షించారు.

క్లుప్తంగా...

అసెంబ్లీ ముందుకు జస్టిస్ ఆర్ముగ స్వామి నివేదిక

చెన్నై: దివంగత సీఎం జయలలిత మృతికి దారితీసిన పరిస్థితులపై జస్టిస్ ఆర్ముగ స్వామి కమిషన్ అందజేసిన నివేదికను అసెంబ్లీ ముందుంచాలని తమిళనాడు కేబినెట్ నిర్ణయించింది. సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన సోమవారం కేబినెట్ సమావేశమైంది. 2016 సెప్టెంబర్ 22వ తేదీన జయలలిత ఆస్పత్రిలో చేరడం, ఆమెకు అందిన వైద్యం, చికిత్సలపై నివేదికలో పేర్కొన్న విషయాలపై కేబినెట్ చర్చించింది. అదేవిధంగా, నివేదికలో పేర్కొన్న విధంగా జయలలిత సన్నిహితురాలైన వీకే శశికళ, శివకుమార్, అప్పటి ఆరోగ్య మంత్రి విజయభాస్కర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామ మోహనరావులపై తీసుకోవాల్సిన చర్యలపై న్యాయనిపుణులతో చర్చించాలని నిర్ణయానికి వచ్చినట్లు తమిళనాడు ప్రభుత్వం తెలిపింది.

గణపతి మండపానికి రూ. 316 కోట్ల బీమా

ముంబై: దేశ ఆర్థిక రాజధాని ముంబైలోని జీఎస్‌బీ సేవా మండల్ అత్యంత సంపన్న గణేశ్ మండల్‌గా పేరుగాంచింది. నగరంలో గత 68 ఏళ్లుగా మండపాన్ని ఏర్పాటు చేస్తోంది. ఈసారి తమ మండపానికి రూ.316.4 కోట్ల బీమా చేయించినట్లు జీఎస్‌బీ సేవా మండల్ చైర్మన్ విజయ్ కామత్ చెప్పారు. బుధవారం నుంచి ప్రారంభమయ్యే వినాయక నవరాత్రి వేడుకల్లో మండపాన్ని దర్శించే ప్రతి భక్తుడూ బీమా పరిధిలోకి వస్తాడని తెలిపారు. మొత్తం బీమాలో రూ.31.97 కోట్లు బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు, సామగ్రికి వర్తిస్తుందన్నారు. రూ.263 కోట్ల బీమా మండపానికి, వాలంటీర్లకు, పూజారులకు, వంటవాళ్లకు, పాదరక్షల స్టాల్ కార్మికులకు, పార్కింగ్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డులకు వర్తిస్తుందని వివరించారు. అగ్నిప్రమాదం, భూకంపం సంభవిస్తే పరిహారం పొందడానికి గాను ఫర్నిచర్, కంప్యూటర్లు, సీసీటీవీ కెమెరాలు, స్కానర్లకు రూ.కోటితో ఇన్సూరెన్స్ చేయించామన్నారు. విఘ్న వినాయకుడి ఆశీస్సులు పొందడానికి వచ్చే ప్రతి భక్తుడికి భద్రత కల్పించాలన్నదే తమ ఉద్దేశమని విజయ్ కామత్ వివరించారు.

యూపీలో పరువు హత్య

బస్తీ(ఉత్తరప్రదేశ్): పరువు హత్యకు మరో ప్రేమ జంట బలైంది. ఉత్తరప్రదేశ్‌లోని బస్తీ జిల్లాలోని పదారియా చేట్‌సింగ్ గ్రామంలో ఈ దారుణం జరిగింది. వేరే మతం వ్యక్తిని ఇష్టపడిందని అమ్మాయి కుటుంబ సభ్యులే ఈ జంటను హతమార్చారని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ముగ్గురిని పోలీసులు అరెస్ట్‌చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముజిబుల్లా వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసే 18 ఏళ్ల దళిత టీనేజర్ అంకిత్.. ముజిబుల్లా కూతురు అమీనాను ప్రేమించాడు. ప్రేమ వ్యవహారం ఇష్టంలేని అమీనా తండ్రి ముజిబుల్లా కూతురిని వారించాడు. ఎంతకీ వినకపోవడంతో అంకిత్‌ను, అమీనాను హతమార్చారు. రుధౌలీ ప్రాంతంలోని చెరకు తోటలో అమీనాను పాతిపెట్టారు. అంకిత్ మృతదేహాన్ని గుర్తించిన పరాస్‌నాథ్ చౌదరి పోలీసులకు సమాచారమిచ్చారు.

కేసుల లిస్టింగ్ కోసం కొత్త యంత్రాంగం

సాక్షి, న్యూఢిల్లీ: సుప్రీంకోర్టులో విచారించాల్సిన కేసుల జాబితాను ఎప్పటికప్పుడు తయారు చేయడానికి(లిస్టింగ్) సెప్టెంబర్ 1వ తేదీ నాటికి కొత్త యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తామని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్ తెలిపారు. సోమవారం సుప్రీంకోర్టులో ఒక పిటిషన్‌పై విచారణ జరుగుతున్న సందర్భంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. కేసుల జాబితా కోసం గురువారం నాటికి కొత్త యంత్రాంగాన్ని సిద్ధం చేస్తామరు. ఇప్పటికైతే ప్రస్తుతం విచారణలో ఉన్న అంశాలపై విచారణ కొనసాగిస్తామని, అత్యవసరమైతే లిస్టింగ్ చేస్తామని వివరించారు. కేసుల జాబితా అంశాన్ని గతంలో సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ ముందు లేవనెత్తారు. కేసుల జాబితాకు సంబంధించిన అంశాలపై అవసరమైన శ్రద్ధ చూపనందుకు జస్టిస్ ఎన్‌వీ రమణ తన వీడ్కోలు ప్రసంగంలో క్షమాపణ చెప్పిన సంగతి తెలిసిందే.

'భారత్ జోడో యాత్ర'లో ఆద్యంతం రాహుల్

న్యూఢిల్లీ: సెప్టెంబర్ 7వ తేదీ నుంచి కాంగ్రెస్ చేపట్టే సుదీర్ఘ భారత్ జోడో యాత్రలో అగ్రనేత రాహుల్ గాంధీ మొత్తం 150 రోజులూ పాల్గొంటారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కన్యాకుమారి మొదలుకొని కశ్మీర్ దాకా 3,500 కిలోమీటర్ల మేర సాగే యాత్రలో రాహుల్ ప్రజలతో మమేకమవుతూ కాలినడకన ముందుకు సాగుతారని ఆ పార్టీ నేతలు జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్, దిగ్విజయ్ సింగ్ వెల్లడించారు. రోజుకు 6 నుంచి 7 గంటలపాటు పాదయాత్ర సాగుతుందన్నారు. అదే సమయంలో దేశవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ శ్రేణులు ఉదయం 7 నుంచి 10 గంటల వరకు పాదయాత్రలు చేపడతాయని తెలిపారు.

నీట్-పీజీ కౌన్సిలింగ్ వాయిదా

న్యూఢిల్లీ: పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన నీట్-పీజీ కౌన్సిలింగ్‌ను కేంద్ర ఆరోగ్య శాఖ సోమవారం వాయిదా వేసింది. వాస్తవానికి సెప్టెంబర్ 1 నుంచి ఈ కౌన్సిలింగ్ ప్రారంభం కావాల్సి ఉంది. పీజీలో కొత్త సీట్లను చేర్చే ప్రక్రియను పూర్తి చేసేందుకు నేషనల్ మెడికల్ కమిషన్‌కు కేంద్ర ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. ఈ ప్రక్రియ సెప్టెంబర్ 15 నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. మళ్లీ కౌన్సిలింగ్ ఎప్పటి నుంచి ప్రారంభిస్తారన్న దానిపై ఆరోగ్య శాఖ ఎలాంటి ప్రకటన చేయలేదు. రివైజ్డ్ షెడ్యూల్ వెల్లడించలేదు. అయితే, సెప్టెంబర్ మూడో వారం నుంచి కౌన్సిలింగ్ మొదలవుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

వంచితుల వ్యథ తీరేదెప్పుడు!

ఎస్.రాజమహేంద్రారెడ్డి

రెండు ఆకాశ హర్మ్యాలు.. ఒకటి 32 అంతస్తులు, మరొకటి 29 అంతస్తులు. 12 సెకండ్లలో నేలమట్టమయ్యాయి.

నోయిడా జంట టవర్ల నిర్మాణానికి అయిన ఖర్చు రూ.70 కోట్లు. కూల్చడానికి అయిన ఖర్చు రూ.20 కోట్లు. వెరసి అక్షరాలా మొత్తం రూ.90 కోట్లు 12 సెకండ్లలో మట్టిలో కలిసిపోయాయి.



నోయిడా జంట టవర్ల బాధితుల వెతలు

అక్రమ కట్టడం కుప్పకూలింది. అక్రమార్కులకు ఇదో పెద్ద హెచ్చరిక అని అనుకోవడం వరకు బాగానే ఉంది కానీ, ఈ అక్రమ కట్టడం ఆకాశం ఎత్తు లేచే వరకు సాయం చేసిన అధికారులను ఏం చేశారు? వాళ్లనెలాగూ కూల్చలేం. కనీసం వాళ్ల ఉద్యోగాలనైనా కూల్చారా? కోర్టులు ఈ విషయంలో చొరవ తీసుకున్నట్టు లేదు. ప్రభుత్వాలు నోరు మెదపకుండా చోద్యం చూస్తున్నాయి. టవర్లు కోర్టు ఆదేశానుసారం కూలిపోయాయి. శిథిలాలు పోగయ్యాయి. ఎంత ఇంకో మూడు నెలల్లో శిథిలాలను తొలగిస్తాం అని నోయిడా మున్సిపల్ అధికారులు మాటిచ్చేశారు. తాము ఖర్చు పెట్టిన రూ.20 కోట్లలో(కూల్చడానికి) టవర్ల నిర్మాణానికి వాడిన స్టీల్‌ను అమ్ముకుంటే రూ.15 కోట్లయినా వస్తాయని వారి అంచనా. మరి ఈ జంట టవర్లలో ఫ్లాట్లు కొన్నవారు ఎటుపోవాలి? వారు అప్పోసప్పో చేసి ఫ్లాట్లు కొనుక్కొని ఉంటారు. ఇంకా నెలసరి వాయిదాలు(ఈఎంఐలు) చెల్లిస్తూనే ఉంటారు. వీరి గోస ఎప్పుడు తీరేనూ? ఢిల్లీలో సొంతింటి కల నెరవేర్చుకోలేక శివార్లలో ఉన్న నోయిడాలో కాస్త తక్కువ ధరకు ఈ కోరిక తీర్చుకొని ఉంటారు. ఈ రెండు టవర్లను(అపెక్స్, సెయాన్) నిర్మించిన సూపర్‌టెక్ కంపెనీ ఫ్లాట్ల కొనుగోలుదారుల నుంచి దాదాపు రూ.180 కోట్లు వసూలు చేసింది. ఇప్పుడీ డబ్బంతా నిరాశ్రయులైన ఫ్లాట్ యజమానులకు తిరిగి చెల్లించాలి. సుప్రీంకోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ బోపన్న, జస్టిస్ పార్దీవాలాల ధర్మాసనం ఈ నెల 26న ఈ విషయంలో ఆదేశాలు జారీ చేస్తూ 'కొనుగోలుదారులందరికీ వారు చెల్లించిన డబ్బు మొత్తం 12% వడ్డీతో సహా తిరిగి చెల్లించాలి'' అని సూపర్‌టెక్ సంస్థకు స్పష్టం చేసింది. ముందస్తు చర్యగా సూపర్‌టెక్ రూ.1 కోటి మొత్తాన్ని కోర్టు రిజిస్ట్రీలో సెప్టెంబర్ 30లోగా జమ చేయాల్సి ఉంటుంది.

మొత్తం బకాయిలు అందేది ఎప్పుడో?

కోర్టు నియమించిన అమికస్ క్యూరీ గౌరవ్ అగర్వాల్ అక్టోబర్ మొదటివారంలో సూపర్‌టెక్ సంస్థ ప్రతినిధులతో సమావేశమై కొనుగోలుదారులకు రావాల్సిన బకాయిలను లెక్కతేల్చి సమర్పిస్తారని సుప్రీంకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. సూపర్‌టెక్ కంపెనీ నెలవారీ ఆదాయం రూ.20 కోట్లని, అందులో రూ.15 కోట్లను ఇతర ప్రాజెక్టుల నిర్మాణానికి కేటాయించాల్సి ఉంటుందని అమికస్ క్యూరీ వివరించారు. మిగతా రూ.5 కోట్ల సొమ్మును ఫ్లాట్ల కొనుగోలుదారులకు బకాయిలు చెల్లించేందుకు వినియోగిస్తామన్నారు. 59 మంది కొనుగోలుదారులకు చెల్లించాల్సి ఉందని మిగతా వాళ్లలో చాలామందికి డబ్బు తిరిగి చెల్లించడం గానీ, వేరే టవర్లలో ఫ్లాట్ కేటాయించడం గానీ జరిగిందని సూపర్‌టెక్ యజమాన్యం వెల్లడించింది. కొనుగోలుదార్లలో చాలామందికి ఎంతోకొంత ఇంకా రావాల్సి ఉందని తెలిసింది. టవర్లయితే 12 సెకండ్లలో నేలమట్టమయ్యాయి. కానీ, చివరి కొనుగోలుదారుడికి బకాయిలు అందేసరికి ఎన్ని రోజులు పడుతుందో వేచి చూడాల్సిందే! సుప్రీంకోర్టు ఆదేశం కాబట్టి కొనుగోలుదారులందరికీ వారి కష్టార్జితం వడ్డీతో సహా అందుతుందనే ఆశిద్దాం.

వడ్డీ కడుతూనే ఉన్నాం..

సెయాన్‌లో ఫ్లాట్ కొనేందుకు 2011లో రూ.26 లక్షలు అప్పు తీసుకున్నాం. అన్ని అనుమతులు వచ్చాక నిర్మాణం చేపట్టారని నమ్మాం. అందుకే అప్పు తెచ్చి మరీ కొన్నాం. అక్రమ నిర్మాణమని కోర్టులు తేల్చడంతో గుండెలో రాయి పడ్డట్టు అయ్యింది. ఈ ఒత్తిడి తట్టుకోలేక మా నాన్నగారు అనారోగ్యం పాలయ్యారు. తెచ్చిన అప్పునకు ఇప్పటికీ వడ్డీ కడుతూనే ఉన్నాం. పెట్టిన డబ్బంతా మా చేతికి వస్తేగానీ కుటుంబం కుదుటపడదు. **- కె.వర్మ (ఉద్యోగి)**

కనువిప్పు కావాలి

2009లో రూ.50 లక్షలు అప్పు తెచ్చి అపెక్స్ టవర్‌లో ఫ్లాట్ బుక్ చేశా. కోరుకున్న చోట ఇల్లు కొంటున్నామన్న సంతోషం కోర్టు ఆదేశంతో నీరుగారిపోయింది. అక్రమ కట్టడమని తేల్చడానికి అన్ని రోజులు ఎందుకు పట్టిందో అర్థం కాలేదు. అనుమతులన్నీ ఉన్నాయని నిర్మాణ సంస్థ బుకాయించడం కూడా జీర్ణం కాలేదు. విధిలేక ఈ ఫ్లాట్‌కు బదులుగా సూపర్‌టెక్ సంస్థ ఇవ్వజూపిన వేరే ఫ్లాట్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కూల్చివేతతో వివాదం ముగిసినప్పటికీ డబ్బు చెల్లించాక మాకు ఇష్టమైన ఫ్లాట్‌ను పొందలేకపోయామన్న బాధ మిగిలే ఉంది. అక్రమ నిర్మాణాలకు తెగబడే బిల్డర్లకు, వారితో లాలూచీ పడి కళ్లు మూసుకొని అన్ని అనుమతులు మంజూరు చేసే అధికారులకు ఈ సంఘటన కనువిప్పు కావాలి. **- గుప్తా (వ్యాపారి)**

రూ. 31.5 లక్షలు రావాలి

''నేను 2010లో సెయాన్‌లో రూ.42 లక్షలు పెట్టుబడి పెట్టాను. ఈ కట్టడం అక్రమమని కోర్టు తీర్పు ఇచ్చినప్పుడే మా కుటుంబం యావత్తూ కుంగిపోయాం. బిల్డర్స్‌తోపాటు నోయిడా అథారిటీ కూడా దీనికి బాధ్యత వహించాలి. అక్రమమని తెలిసి కూడా అనుమతులు ఎలా మంజూరు చేశారో ఇప్పటికీ అర్థం కావడం లేదు. ఇదో పెద్ద అవినీతి సౌధం. 12 శాతం వడ్డీతో కలిపి నాకు రూ.80 లక్షలు బకాయిపడ్డారు. ఇందులో భాగంగా వేరేచోట ఇంకో ఫ్లాట్ ఇచ్చారు. అదిపోనూ ఇంకా రూ.31.5 లక్షలు రావాల్సి ఉంది'' **- పునీత్ (వ్యాపారి)**

ఆరంభం నుంచి నేలమట్టం దాకా..

- **2004:** నోయిడా 'సెక్టార్ 93ఎ'లో గృహ సముదాయం కోసం సూపర్‌టెక్ సంస్థకు స్థలం కేటాయింపు (ఎమెరాల్డ్ కోర్టు హౌజింగ్ సొసైటీలో)
- **2005:** ఎమెరాల్డ్ కోర్టు హౌజింగ్ సొసైటీ భవన నిర్మాణ ప్లాన్‌కు నోయిడా అథారిటీ అనుమతి మంజూరు. 10 అంతస్తుల చొప్పున 14 రెసిడెన్షియల్ టవర్ల నిర్మాణానికి అనుమతి
- **2006:** మరింత స్థలం కావాలన్న సూపర్‌టెక్ సంస్థ వినతికి నోయిడా అథారిటీ అంగీకారం. తొలుత అనుమతి ఇచ్చిన భవన నిర్మాణ ప్లాన్‌కు సవరణలు. 14 టవర్లకు బదులుగా మరో టవర్ నిర్మాణానికి ఓకే. దీంతో మొత్తం 15 టవర్లకు అనుమతి ఇచ్చింది.
- **2009:** నిర్మాణ సంస్థ మరోసారి ప్లాన్‌ను మార్చి మరో రెండు టవర్ల(అపెక్స్, సెయాన్)ను అదనంగా చేర్చింది. అయితే, ఈ రెండు టవర్లలో 24 అంతస్తులు ఉండేటట్టుగా ప్లాన్ మార్చడంతోపాటు వెంటనే నిర్మాణం కూడా చేపట్టింది. దీనికి స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేశారు.
- **2012:** నిర్మాణ సంస్థ మరోసారి తన ప్లాన్‌ను సవరించి అపెక్స్, సెయాన్ టవర్లను 40 అంతస్తులకు పెంచింది. నిర్మాణ పనులను వేగవంతం చేసింది.
- **2012 డిసెంబర్:** ఎమెరాల్డ్ కోర్టు సొసైటీలోని కొందరు ఈ విషయాన్ని అలహాబాద్ హైకోర్టుకు విన్నవిస్తూ పిటిషన్ దాఖలు చేశారు.
- **2014:** జంట టవర్లను కూల్చివేయాల్సిందిగా అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. నిర్మాణ సంస్థతో కుమ్మక్కయ్యారని నోయిడా అథారిటీని తప్పుపట్టింది. దాంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి.
- **2014 మే:** అనుమతులన్నీ ఉన్నాయంటూ సూపర్‌టెక్ సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
- **2021 ఆగస్టు 31:** దాదాపు ఏడేళ్ల వాదోపవాదాల తర్వాత జంట టవర్లను కూల్చివేయాల్సిందేనని సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. మూడు నెలల్లోగా పని పూర్తికావాలని ఆదేశించింది.
- **2022 ఫిబ్రవరి:** మే 22న కూల్చివేస్తామని నోయిడా అథారిటీ సుప్రీంకోర్టుకు తెలియజేసింది.
- **2022 మే 17:** కూల్చివేత కాల పరిమితిని సుప్రీంకోర్టు ఆగస్టు 28కి పొడిగించింది.
- **2022 ఆగస్టు 28:** జంట టవర్లు నేలమట్టం. సూపర్‌టెక్ సంస్థ నిర్మించిన 15 టవర్ల ఎమెరాల్డ్ కోర్టు హౌజింగ్ కాంప్లెక్స్‌లో మొత్తం 650 ఫ్లాట్లు ఉన్నాయి. నేలమట్టమైన అపెక్స్, సెయాన్ టవర్లు ఇప్పటికీ నిలిచి ఉంటే మరో 915 ఫ్లాట్లు, 21 దుకాణాలు అదనంగా ఉండేవి.

ఆర్టెమిస్ ప్రయోగం వాయిదా

కేప్ కెనావెరాల్: చంద్రుడిపైకి అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ 'నాసా' చేపట్టిన ఆర్టెమిస్-1 ప్రయోగం సోమవారం వాయిదా పడింది. ఇంజిన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో మూన్ మిషన్‌ను నిలిపివేస్తున్నట్లు నాసా ప్రకటించింది. ఇంజిన్ నుంచి ఇంధనం లీక్ అయినట్లు తెలుస్తోంది. షెడ్యూల్ ప్రకారం కౌంట్‌డౌన్ ప్రారంభమైనప్పటికీ చివరి గంటలో నాసా శాస్త్రవేత్తలు ప్రయోగాన్ని నిలిపివేశారు. మళ్లీ ఎప్పుడు ప్రారంభిస్తారన్న విషయాన్ని వెల్లడించలేదు. సెప్టెంబర్ మొదటి వారంలో ఉండవచ్చని సమాచారం. ఆర్టెమిస్-1 ప్రయోగంలో భాగంగా రాకెట్‌లో 10 లక్షల గ్యాలన్ల అతిశీతల హైడ్రోజన్, ఆక్సిజన్ నింపాల్సి ఉంది. 4 ఇంజిన్లు ఉన్న ఈ రాకెట్‌లో ఒకదాంట్లో ఇంధనం లీక్ అవుతున్నట్లు గుర్తించారు. లాంచ్‌ప్యాడ్‌పై రాకెట్ ఉన్నచోట పిడుగు పడడంతో ఈ పరిస్థితి ఉత్పన్నమైనట్లు భావిస్తున్నారు. సమస్యను సరిదిద్దడానికి కొంత సమయం పట్టొచ్చు. 2024లో



ఆర్టెమిస్-2, 2025లో ఆర్టెమిస్-3 ప్రయోగాలు చేపట్టేందుకు నాసా సన్నద్ధమవుతోంది. చందమామపైకి వ్యోమగాములను పంపించడమే కాదు, అక్కడ మానవుల శాశ్వత నివాసానికి పునాదులు వేయడమే ఈ ప్రయోగాల లక్ష్యం.

తిరిగి వస్తున్న జనం

- ఎమెరాల్డ్ కోర్ట్, ఏటీఎస్ విలేజ్ సొసైటీల నివాసితుల రాక
- విద్యుత్, నీరు, గ్యాస్ సరఫరాల పునరుద్ధరణ

నోయిడా: ఉత్కంఠ రేపిన సూపర్‌టెక్ జంట టవర్ల కూల్చివేత ఆదివారం మధ్యాహ్నం విజయవంతంగా ముగిసిన విషయం తెలిసిందే. పేలుళ్ల కారణంగా టవర్ల పరిసరాల్లోని రహదారులు, భవనాలు, చెట్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి తొలగింపు సాయంత్రం నుంచే మొదలైంది. అక్కడికి అత్యంత సమీపంలో ఉన్న ఎమెరాల్డ్ కోర్ట్, ఏటీఎస్ విలేజ్ సొసైటీల నుంచి ఖాళీ చేయించిన కుటుంబాల్లో సగానికి పైగా తిరిగి తమ నివాసాలకు చేరుకున్నాయి. అధికారులు వారికి విద్యుత్, నీరు, వంట గ్యాస్ సరఫరాలను పునరుద్ధరించారు. తమ నివాసాలు సురక్షితంగా ఉన్నందుకు వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అయితే, భారీ పేలుళ్లతో ఎమెరాల్డ్ కోర్ట్, ఏటీఎస్ విలేజ్ లోపల వెలుపల, ఇతర నివాస ప్రాంతాలు, రహదారులు, పరిసరాల్లోని చెట్లపై దుమ్ముధూళి దట్టంగా పేరుకుపోయింది. దీనిని తొలగించేందుకు ఆదివారం సాయంత్రం నుంచే పెద్ద సంఖ్యలో పనివారిని రంగంలోకి దించారు. 500 మంది సిబ్బందితోపాటు, 100 నీటి ట్యాంకర్లు, 22 యాంటీ స్మోగ్ గన్స్‌లో ఊడ్చటం, తుడవటం వంటి పనులను చేపట్టినట్లు నోయిడా అథారిటీ సీఈఓ రీతూ మహేశ్వరి తెలిపారు. టవర్ల కూల్చివేతతో ఏర్పడిన 80 వేల టన్నుల శిథిలాలను తొలగించేందుకు 3 నెలలు పడుతుందని ఎడిఫైస్ ఇంజినీరింగ్ సంస్థ తెలిపింది. దీనిని వృథాగా పడేయకుండా రీసైకిల్ చేసి, తిరిగి వినియోగిస్తామని పేర్కొంది.



జంట టవర్లకు సమీపంలోని భవనంలో బాల్కనీని శుభ్రం చేస్తున్న మహిళ

సెల్ఫీలతో జనం సందడి

టవర్లు కూలిన తర్వాత సోమవారం కూడా జనం అక్కడికి వచ్చి ఆసక్తిగా తిలకిస్తున్నారు. పెద్ద ఎత్తున గుట్టలుగా పేరుకుపోయిన శిథిలాలకు సమీపంలో సెల్ఫీలు, వీడియోలు తీసుకుంటున్నారు. కాగా, నిబంధనలకు విరుద్ధంగా నివాస సముదాయాలను నిర్మించిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోలేదని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ అధికార బీజేపీని ప్రశ్నించారు. బీజేపీ పెద్ద అబద్ధాల కోరు అంటూ ఆయన వ్యాఖ్యానించారు.

నన్ను అరెస్ట్ చేయండి చూద్దాం

- బీజేపీకి పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ సవాల్
- అక్రమార్జన ఆరోపణలన్నీ నిరాధారాలన్న టీఎంసీ చీఫ్

కోల్‌కతా: చేతనైతే తనను అరెస్ట్ చేయాలని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. తన కుటుంబసభ్యులు ఆస్తులు కూడబెట్టుకున్నారంటూ వస్తున్న ఆరోపణలు నిరాధారాలన్నారు. రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న బీజేపీని వ్యతిరేకించే పార్టీలను గద్దె దించేందుకు అక్రమంగా అందిన డబ్బును, కేంద్ర నిఘా సంస్థలను మోదీ ప్రభుత్వం ఉపయోగించుకుంటోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించి తీరుతామని ప్రతిజ్ఞ చేశారు. సోమవారం మమత ఒక ర్యాలీని ఉద్దేశించి మాట్లాడుతూ 'టీఎంసీ సీనియర్ నేతలు పార్థా చటర్జీ, అనుబ్రత మండల్‌లను వేర్వేరు కేసుల్లో ఈడీ, సీబీఐలు అరెస్ట్ చేసిన తర్వాత నాతోపాటు, సీనియర్ నేతలపై దుష్ప్రచారం మొదలైంది. అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నామంటూ బీజేపీ ఆరోపణలు చేస్తోంది. సీఎంగా ఉండి ఉండకపోతే అటువంటి అబద్ధాలు చెప్పేవారి నాలుకలు చీల్చేయాలని ప్రజలకు పిలుపు ఇచ్చేదాన్ని' అని అన్నారు. 'నా బంధువులంతా చిన్న కుటుంబాల వారే. మేమంతా కలిసే పండగలు చేసుకుంటాం. 12 ఏళ్లుగా మాజీ పార్లమెంట్ సభ్యురాలిగా నెలకు రూ.లక్ష పింఛను తీసుకుంటున్నా. ముఖ్యమంత్రి గౌరవ వేతనాన్ని కూడా అందుకోవడం లేదు. ప్రభుత్వ వాహనాన్ని అరుదుగా వాడుకుంటున్నా. మా నాన్న ఇచ్చిన ఇంట్లోనే ఉంటున్నా. నా ఖర్చులు నేనే చూసుకుంటున్నా. పుస్తకాలు రాసి సంపాదించుకుంటున్నా' అని ఆమె వివరించారు. తాము అక్రమంగా కూడబెట్టిన ఆస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థతో విచారణ చేయించాలంటూ కలకత్తా హైకోర్టులో సోమవారం దాఖలైన పిల్‌పై స్పందిస్తూ.. 'ఇక్కడెందుకు కేసు వేశారు? అంతర్జాతీయ న్యాయస్థానంలో వేయాలని మిమ్మల్ని కోరుతున్నా. ఎందుకంటే ఈ కేసులో బీజేపీ జోక్యం చేసుకోవచ్చు' అని మమత అన్నారు.



అమెరికాలోని న్యూజెర్సీ నగరంలోని లిటిల్ ఇండియాగా పేరు గాంచిన ఎడిసిన్ సిటీలో రింకు, గోపీ సేథ్ అనే భారతీయ అమెరికన్లు తమ ఇంటి ఎదుట ఓ గ్లాస్ బాక్స్‌లో ప్రముఖ బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఇందుకు రూ.60 లక్షలు వెచ్చించారు.

బీజేపీయేతర పార్టీలను ఏకం చేసే యత్నం

ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ వెల్లడి

థానే/ముంబై: బీజేపీయేతర రాజకీయ పార్టీలను జాతీయ స్థాయిలో ఏకం చేసి, ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్(81) చెప్పారు. అయితే, వయోభారం దృష్ట్యా ఈ విషయంలో ఎలాంటి బాధ్యతను తీసుకునే ఉద్దేశం తనకు లేదని స్పష్టం చేశారు. థానేలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీకి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టేందుకు బీజేపీయేతర పార్టీలను ఏకం చేసే విషయంలో తన సహకారం మాత్రం ఉంటుందన్నారు. 2014 సాధారణ ఎన్నికలు మొదలుకొని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేకపోయిందన్నారు. 'ప్రతి గృహానికి కరెంటు, నీరు, మరుగుదొడ్లు వంటివి కల్పించడం, గ్రామాలను ఇంటర్నెట్‌తో అనుసంధానించడం వంటి ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో మోదీ ప్రభుత్వం విఫలమైంది. ఇప్పుడు మాత్రం, 2024 నాటికి దేశ ఆర్థిక వ్యవస్థను 5 ట్రిలియన్ స్థాయికి తీసుకెళ్తానంటూ కొత్తగా వాగ్దానం చేస్తోంది'అంటూ విమర్శించారు. చిన్న పార్టీలకు అధికారం దక్కకుండా చేయడమే బీజేపీ ఎజెండాగా మారిందన్నారు. ప్రతిపక్ష పార్టీలను భయపెట్టేందుకు సీబీఐ, ఈడీ, ఆదాయపన్ను శాఖ వంటి వాటిని వాడుకుంటోందని చెప్పారు. 'మహారాష్ట్ర ఎన్సీపీ నేత అనిల్ దేశ్‌ముఖ్‌పై సీబీఐ, ఈడీ, ఐటీ విభాగాలు 110 దాడులు చేశాయంటే మీరు నమ్మగలరా? ఈ కేసులో రూ.100 కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరిగిందని చెప్పారు. ఆ తర్వాత రూ.4.07 కోట్లు, ఇప్పుడు రూ.1.71 కోట్లు మాత్రమేనని అంటున్నారు. నిజాలన్నీ కోర్టులోనే తేలుతాయి'అని పవార్ అన్నారు. 'రాజకీయ ప్రత్యర్థులపై బీజేపీ చేస్తున్న దాడి పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపైనే తప్ప మరొకటి కాదు. ఇది ఆందోళన కలిగించే అంశం. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలను చీల్చి అధికారం చేజిక్కించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఇందుకు మహారాష్ట్ర తాజా ఉదాహరణ'అని అన్నారు. తమతమ పార్టీల తరఫున గట్టిగా మాట్లాడినందుకే ఎన్సీపీ నేత నవాబ్ మాలిక్, శివసేన నేత సంజయ్ రౌత్‌లను మోదీ ప్రభుత్వం జైలుపాలు చేసిందన్నారు. బిల్కిస్‌బానో కేసులో జీవిత ఖైదు పడిన 11 మందిని గుజరాత్ ప్రభుత్వం విడుదల చేయడాన్ని సిగ్గుచేటుగా ఆయన అభివర్ణించారు.

'రఫేల్'పై వ్యాజ్యాన్ని తిరస్కరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: రఫేల్ యుద్ధ విమానాల కొనుగోలు వ్యవహారంపై తాజాగా దర్యాప్తు జరిపించాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని(పిల్) సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఫ్రాన్స్ నుంచి 36 రఫేల్ ఫైటర్ జెట్ల కొనుగోలుకు భారత ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని, ఇందులో భారీగా అవినీతి జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని న్యాయవాది ఎం.ఎల్.శర్మ పేర్కొన్నారు. అందుకే దీనిపై తాజాగా దర్యాప్తు జరిపేలా ఆదేశాలివ్వాలని కోరుతూ వ్యాజ్యం దాఖలు చేశారు. సాక్ష్యాధారాలు సేకరించడానికి వీలుగా లెటర్స్ రొగేటరీ జారీ చేసేలా ఆదేశాలు జారీ చేయాలన్నారు. ఒప్పందానికి సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలను కూడా ఆయన ప్రస్తావించారు. ఎం.ఎల్.శర్మ పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ యు.యు.లలిత్, జస్టిస్ ఎస్.రవీంద్ర భట్‌తో కూడిన ధర్మాసనం సోమవారం తేల్చిచెప్పింది. రఫేల్‌పై కేంద్ర మాజీ మంత్రులు యశ్వంత్ సిన్హా, అరుణ్ శౌరీ, సామాజిక ఉద్యమకారుడు ప్రశాంత్ భూషణ్ గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఆత్మహత్యల్లో మహారాష్ట్ర టాప్

న్యూఢిల్లీ: బలవన్మరణాల సంఖ్యాపరంగా దేశవ్యాప్తంగా చూస్తే మహారాష్ట్రలో వీటి సంఖ్య చాలా ఎక్కువగా ఉంది. జాతీయ నేర గణాంకాల బ్యూరో తాజా నివేదికలో పలు విషయాలను ప్రస్తావించింది. 2021 ఏడాదిలో దేశవ్యాప్తంగా 1,64,033 మంది బలవన్మరణాలకు పాల్పడ్డారు. వృత్తి సమస్యలు, ఒంటరితనం, హింస, కుటుంబ, మానసిక సమస్యలు, మద్యానికి బానిసకావడం, ఆర్థికంగా కుంగుబాటు, అనారోగ్యం ఈ ఆత్మహత్యలకు ప్రధాన కారణాలని నేర గణాంకాల బ్యూరో తెలిపింది. మహారాష్ట్రలో అత్యధికంగా 22,207 మంది, కర్ణాటకలో 13,056 మంది సూసైడ్ చేసుకున్నారు. దేశంలోని మొత్తం ఆత్మహత్యల్లో సగానికిపైగా సూసైడ్‌లు మహారాష్ట్ర తమిళనాడు, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, కర్ణాటకలోనే జరిగాయి. 53 నగరాల్లో మొత్తంగా 25వేలకుపైగా సూసైడ్ చేసుకున్నారు.

1.73 లక్షల యాక్సిడెంట్ మరణాలు

గత ఏడాది దేశవ్యాప్తంగా జరిగిన 4.22 లక్షల ట్రాఫిక్ ప్రమాదాల్లో 1.73 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని జాతీయ నేర గణాంకాల బ్యూరో తెలిపింది. యూపీలో ఎక్కువ మరణాలు సంభవించాయి. 2020తో పోలిస్తే 2021లో మరణాలు 18.8 శాతం పెరగడం ఆందోళనకరం.

హేమంత్ అనర్హతపై నిర్ణయం తీసుకోండి

జార్ఖండ్ గవర్నర్‌కు యూపీఏ ఎమ్మెల్యేల వినతి

రాంచీ: జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఎమ్మెల్యేగా అనర్హత వేటు విషయంలో నిర్ణయం తీసుకోకుండా గవర్నర్ రమేశ్ బాయిస్ ఉద్దేశపూర్వకంగానే జాప్యం చేస్తున్నారని అధికార యూపీఏ విమర్శించింది. తద్వారా ఎమ్మెల్యేల కొనుగోళ్లకు ఆస్కారం కల్పిస్తున్నారని ఆక్షేపించింది. ఈ మేరకు యూపీఏలోని జార్ఖండ్ ముక్తి మోర్చా(జేఎంఎం), కాంగ్రెస్ ఆర్జేడీ నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. అంతకుముందు పలుమార్లు భేటీ అయ్యారు. తాజా పరిణామాలపై చర్చించారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న అయోమయానికి తెరదించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. హేమంత్ సోరెన్‌పై అనర్హత వేటు విషయంలో త్వరగా ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని కోరారు. గవర్నర్ వైఖరి కారణంగా రాష్ట్రంలో అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని జేఎంఎం ఎమ్మెల్యే చాంపై సోరెన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సంఘం నుంచి ఏదైనా రిపోర్టు వస్తే ప్రజల ముందు పెట్టాలని, హేమంత్ విషయంలో అనర్హత వేటుపై నిర్ణయాన్ని ప్రకటించాలని గవర్నర్‌ను కోరారు. ఎలాంటి పరిణామాలకైనా తాము సిద్ధంగా ఉన్నామని జార్ఖండ్ మంత్రి, కాంగ్రెస్ నేత బన్నా గుప్తా వెల్లడించారు.

ఒక్క ఆప్ ఎమ్మెల్యేనూ కొనలేరు

- ఆపరేషన్ కమలం విఫలమే.. ఆప్ ఎమ్మెల్యేల విధేయతకు నిదర్శనం
- ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వ్యాఖ్య
- నిరసనల నడుమ మార్షల్స్ సాయంతో బీజేపీ ఎమ్మెల్యేలు బయటకు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆప్ సర్కార్‌ను కూలదోసేందుకు బీజేపీ చేసిన ఆపరేషన్ కమలం కుట్ర విఫలమైందని, అందుకు సూచికగానే విశ్వాస తీర్మానం ప్రవేశపెడుతున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్పష్టంచేశారు. సోమవారం ఢిల్లీ అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన బీజేపీపై విమర్శలు గుప్పించారు. 'ఒక్క ఆప్ ఎమ్మెల్యేను కూడా బీజేపీ కొనడం అసాధ్యం. మధ్యప్రదేశ్, మహారాష్ట్రసహా పలు రాష్ట్రాల్లో బీజేపీ అధికారాన్ని అక్రమంగా చేజిక్కించుకుంది. కొన్నిచోట్ల ఒక్కో ఎమ్మెల్యేకు రూ.50 కోట్లు ముట్టజెప్పారు. అందుకుభిన్నంగా ఢిల్లీలో ఆపరేషన్ కమలం విఫలమైంది. ఆప్ ఎమ్మెల్యేల నిజాయితీ వల్లే ఇది సాధ్యమైంది. అందుకు సూచికగానే విశ్వాస తీర్మానం తెచ్చాం. పక్షం రోజుల్లో జార్ఖండ్‌లో ప్రభుత్వాన్ని బీజేపీ పడగొట్టబోతోంది. ఆ తర్వాత మళ్లీ పెట్రోల్, డీజిల్ ధరలు పైకి ఎగసిపడతాయి. మోదీ సర్కార్ కేంద్ర పన్నులు పెంచేసి వాటితో ఎమ్మెల్యేలను కొనే పని పెట్టుకుంది' అని అన్నారు. 'పెరుగు, లస్సీ, గోధుమలు, తేనె మీద కూడా మోదీ సర్కార్ పన్ను భారం మోపుతోంది. 75 ఏళ్ల స్వతంత్రభారతంలో వీటిపైనా ట్యాక్స్‌లు వేయడం ఇదే తొలిసారి. బ్రిటిషపాలనలోనూ ఇలా జరగలేదు' అని అన్నారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా.. గతంలో ఖాదీ, విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ చైర్మన్‌గా ఉన్నపుడు నోట్ల రద్దు వేళ రూ.1,400 కోట్ల నోట్లను మార్చాలంటూ ఉద్యోగులపై ఒత్తిడిచేశాడని అసెంబ్లీలో ఆరోపణలు వెల్లువెత్తడం, బీజేపీ సభ్యుల నిరసనల మధ్య సభ వాయిదాపడింది. అంతకుముందు ప్రాజెక్టులపై నిర్లక్ష్యం తదితర అంశాలపై చర్చ చేపట్టాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు డిమాండ్‌చేస్తూ వెల్‌లోకి దూసుకొచ్చారు. డెప్యూటీ స్పీకర్ ఆదేశాలతో మార్షల్స్ వారిని బయటకు పంపారు. లెఫ్టినెంట్ గవర్నర్ అవినీతిపై దర్యాప్తు జరపాలంటూ ఆప్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ ఆవరణలో రాత్రంగా నిరసన తెలపనున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌పై ఆప్ కక్ష సాధింపునకు నిరసనగా అక్కడే బీజేపీ ఎమ్మెల్యేలు ధర్నా చేయనున్నారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం। 30। ఆగస్టు। 2022



ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

అవనిగడ్డ: స్థానిక హైస్కూల్లో సోమవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, డీఈఓ తెహరా సుల్తానా పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అండర్-14 ఖో-ఖో జట్ల ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే అండర్-14 బాల బాలికల కృష్ణాజిల్లా ఖో-ఖో జట్లను ఎంపిక చేశారు. బాలుర జట్టుకు 16 మంది, బాలికల జట్టుకు 12 మందిని ఎంపిక చేశారు. -8లో



కార్పొరేట్ పాపం.. జీజీహెచ్‌కు శాపం

పలు కార్పొరేట్ ఆస్పత్రుల పాపాలు జీజీహెచ్‌కు శాపంగా మారాయి. కార్పొరేట్ ఆస్పత్రులు రోగుల నుంచి రూ.లక్షల్లో దండుకుని, పరిస్థితి విషమించాక ప్రభుత్వాస్పత్రికి పంపిస్తున్నాయి. -8లో

కృష్ణమ్మకు కట్టడి

- 12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా తట్టుకునేలా రక్షణ గోడ నిర్మాణం
- ఇప్పటికే తుది దశకు చేరిన రెండో దశ నిర్మాణ పనులు
- మూడో దశలో పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గ వారధి వరకు..
- రూ.137.85 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు
- త్వరలో టెండర్లు పిలిచేందుకు అధికారుల సన్నాహాలు
- విజయవాడలో 30 వేల మంది ప్రజలకు ముంపు నుంచి ఊరట



రెండో విడత నిర్మించిన రిటైనింగ్ వాల్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: కృష్ణానదికి వరద అంటే విజయవాడ నగర ప్రజలు ఉలిక్కిపడేవారు. నదిని ఆనుకుని నివసిస్తున్న వారు ఇల్లూవాకిలి వదిలి పునరావాస కేంద్రాల్లో తలదాచుకోవాల్సి వచ్చేది. ఈ సమస్య పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రక్షణ గోడ నిర్మాణం చేపట్టింది. ఇప్పటికే తొలిదశ పనులు పూర్తవగా, రెండో దశ తుది దశకు చేరింది. తాజాగా రూ.137.85 కోట్లతో మూడో దశ నిర్మాణ పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.

వరద కష్టాలకు స్వస్తి

కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో వరద కష్టాలకు రాష్ట్ర ప్రభుత్వం చెక్ పెడుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 12 లక్షల క్యూసెక్కులు విడుదలైనా చుక్క నీరు విజయవాడలోకి రాకుండా రక్షణ గోడ నిర్మిస్తోంది. ఫలితంగా నగరంలో వేల మంది ప్రజలకు వరద ముంపు నుంచి ఉపశమనం కలగనుంది. ఇప్పటికే తొలి దశ రక్షణగోడ నిర్మాణం పూర్తయింది. రెండో దశ పనులు తుది దశకు చేరాయి. తాజాగా పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గ వారధి వరకు మూడో దశలో రక్షణ గోడ నిర్మాణానికి రూ.137.85 కోట్లతో పరిపాలనా అనుమతులను ప్రభుత్వం మంజూరు చేసింది. త్వరలో టెండర్లు పిలిచి పనులు పూర్తి చేసేలా నీటిపారుదల శాఖ అధికారులు కసరత్తు చేపట్టారు. గతంలో నాలుగైదు లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తే కృష్ణా నది పరీవాహక ప్రాంతాలు నీటమునిగి ప్రజలు అష్టకష్టాలు పడేవారు. వారిని పునరావస కేంద్రాలకు తరలించాల్సి వచ్చేది. తన పాదయాత్రలో ఇచ్చిన హామీకి అనుగుణంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. దీంతో విజయవాడ ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. రక్షణ గోడ నిర్మాణంతో కృష్ణా బ్యారేజీ నుంచి పులిగడ్డ వారధి వరకు 68 కిలో మీటర్ల మేర కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో వరద ముంపునకు చెక్ పడుతుంది.

రక్షణ గోడ నిర్మాణాలు ఇలా...

2019లో కృష్ణానదికి వరద వచ్చిన సమయంలో విజయవాడలో ముంపు బారినపడిన ప్రాంతాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిశీలించారు. ముంపు సమస్య శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రిటైనింగ్ వాల్ (రక్షణ గోడ) నిర్మించడమే ఈ సమస్యకు పరిష్కారమని అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ స్పందించి రెండో దశలో 1.5 కిలో మీటర్ల పొడవున, 8.9 మీటర్ల ఎత్తులో కాంక్రీట్ గోడ నిర్మాణానికి రూ.123 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు తుది దశకు చేరాయి. పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గ వారధి వరకు 1.05 కిలో మీటర్ల పొడవు, 8.9 మీటర్ల ఎత్తుతో మూడో దశ కింద రక్షణ గోడ నిర్మాణానికి ఈ నెల 24వ తేదీన ప్రభుత్వం రూ.137.85 కోట్లతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.

ఐదేళ్లలో ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు విడుదలైన నీరు

సంవత్సరం	విడుదల చేసిన నీరు (క్యూసెక్కుల్లో)
2018-19	1,62,150
2019-20	8,05,364
2020-21	7,64,253
2021-22	4,44,640
2022-23 (ఆగస్టు 30 వరకు)	4,10,000



వరదనీటిలో మునిగిన కృష్ణలంక ప్రాంతం

చిరకాల స్వప్నం సాకారం



వరద ముంపు బాధితుల కష్టాలను స్వయంగా చూసిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రెండో విడత రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.123 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులు తుది దశకు చేరాయి. మూడో విడతలో పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గ వారధి వరకు రక్షణ గోడ నిర్మాణానికి రూ.137.85 కోట్లు మంజూరు చేశారు. సీఎం జగన్‌కు నగర ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు.

– దేవినేని అవినాష్, వైఎస్సార్ సీపీ, తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి

త్వరలో టెండర్లు పిలుస్తాం



విజయవాడలో కృష్ణా నది వరద ముంపునకు సంబంధించి రక్షణ గోడ మూడో విడత నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలనా అనుమతులను మంజూరు చేసింది. పద్మావతి ఘాట్ నుంచి కనకదుర్గా వారధి వరకు 1.2 కిలోమీటర్ల మేర గోడ నిర్మాణానికి రూ.137 కోట్లను కేటాయించింది. ఈ పనులకు త్వరలో టెండర్లు పిలుస్తాం. రక్షణ గోడ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

– తిరుమలరావు, ఎస్ఈ, నీటిపారుదల శాఖ, విజయవాడ

30వేల మందికి ఉపశమనం

విజయవాడ కృష్ణలంక ప్రాంతంలోని ఆర్టీసీ బస్టాండు నుంచి వారధి ప్రాంతంలోని రణదివెనగర్, గౌతమీనగర్, నెహ్రూనగర్, ద్వారకా నగర్, భూపేష్ గుప్తానగర్, తారకరామ నగర్ ప్రాంతాల పరిధిలో 30 వేల మంది నివసిస్తున్నారు. మూడో దశ రక్షణ గోడ నిర్మాణంతో ఈ ప్రాంత ప్రజలకు ఉపశమనం కలుగుతుంది

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో దేవదాయ శాఖ మంత్రి



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ధార్మిక పరిషత్ సభ్యులు సోమవారం దర్శించుకున్నారు. మంత్రి, ధార్మిక పరిషత్ సభ్యులకు ఆలయ ఈఓ భ్రమరాంబ సాదరంగా, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ధార్మిక పరిషత్ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. 2009 తర్వాత ధార్మిక పరిషత్ కమిటీ ఏర్పాటు చేయలేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచనతో ధార్మిక పరిషత్ ఏర్పడిందని మంత్రి కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. దేవాలయాల పునర్నిర్మాణం, అభివృద్ధికి సీజీఎఫ్ కమిటీకి సంబంధించి ముగ్గురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని ఆలయాల అభివృద్ధికి, భగవంతుడికి ధూపదీప నైవేద్యం సక్రమంగా నిర్వహించేలా సీఎం ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్‌లను మంత్రి పరిశీలించారు. దసరా ఉత్సవాలపై ఈఓ భ్రమరాంబకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక సమయంలోనే వీఐపీలకు అమ్మవారి దర్శనం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

385 మంది సర్టిఫికెట్ల పరిశీలన



మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): ఏపీ ఈఏపీ సెట్-2022లో ర్యాంకులు పొందిన స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో కొనసాగుతోంది. ఎన్‌సీసీ అభ్యర్థులు 159 మంది, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ 68, సీఏపీ అభ్యర్థులు 158 మంది చొప్పున 385 మంది ర్యాంకర్లు సోమవారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. 140001 నుంచి చివరి ర్యాంకు వరకు పొంది న ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అభ్యర్థులు, 90,001 నుంచి చివరి ర్యాంకు పొందిన సీఏపీ అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం పరిశీలిస్తామని హెల్ప్ లైన్ సెంటర్ ఇన్‌చార్జి వరప్రసాద్ తెలిపారు.

నేడు కృష్ణా మిల్క్ యూనియన్ ఎన్నికలు

చిట్టినగర్ (విజయవాడ పశ్చిమ): శ్రీ కృష్ణా మిల్క్ యూనియన్ (విజయ డెయిరీ) బోర్డు డైరెక్టర్ల పదవులకు మంగళవారం ఎన్నికలు జరగనున్నాయి. మూడు డైరెక్టర్ పదవులకు జరుగుతున్న ఈ ఎన్నికల్లో నలుగురు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎన్నికల అధికారి ఎల్.గురునాథం పర్యవేక్షణలో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగుతుంది. నందిగామకు చెందిన నెలకుదిటి నాగేశ్వరరావు, ఏలూరు జిల్లా ఆగిరిపల్లికి చెందిన పల్లగాని కొండలరావు, కృష్ణాజిల్లా గన్నవరానికి చెందిన పాలడుగు వెంకట రామవరప్రసాద్, తోట్లవల్లూరుకు చెందిన మర్రెడ్డి బసివిరెడ్డి ఎన్నిక బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో 395 మంది పాల సొసైటీ అధ్యక్షులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత ఓట్లు లెక్కించి, ఫలితాలను వెల్లడిస్తారు.



క్రీడాకారులను సత్కరించి జ్ఞాపికలు అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ప్రభాకరరెడ్డి

స్ఫూర్తిప్రదాత ధ్యాన్‌చంద్

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): క్రీడా రంగానికి ధ్యాన్‌చంద్ చేసిన సేవలను క్రీడాకారులు స్ఫూర్తిగా తీసుకుని జిల్లాకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు కోరారు. జాతీయ క్రీడా దినోత్సవ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశం మందిరంలో ఆయన చిత్రపటానికి రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ధ్యాన్‌చంద్ ప్రపంచంలోనే అత్యంత నైపుణ్యం కలిగిన హాకీ క్రీడాకారుడని కొనియాడారు. చంద్రకాంతిలో సాధన చేసేవాడని అందుకే ఆయన పేరు చివర చంద్ అని వచ్చిందన్నారు. 1960 సంవత్సరం వరకు భారత హాకీ ధ్యాన్‌చంద్ నాయకత్వంలో తిరుగులేని ఆధిపత్యం ప్రదర్శించిందని గుర్తుచేశారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. క్రీడలు మన జీవితంలో భాగం కావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించి ప్రత్యేక నిధులను కేటాయిస్తోందన్నారు. వివిధ క్రీడల్లో పాఠశాల, కళాశాల స్థాయిలో ప్రతిభ చాటుతున్న 15 మంది క్రీడాకారులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ఔన్నత్యాన్ని చాటిన గిడుగు

కలెక్టర్ ఢిల్లీరావు



పురస్కార గ్రహీతలను సత్కరించిన కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తెలుగు భాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన తెలుగు భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు అని, ఆయన్ను స్మరించుకోవడం ప్రతి తెలుగువారి కర్తవ్యమని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్‌నుపూర్ అజయ్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకొచ్చిన సంస్కర్తల్లో అగ్రగణ్యుడు రామ్మూర్తి అని కొనియాడారు. వాడుకభాష ఉద్యమానికి ఆద్యుడైన రామ్మూర్తి పంతులు జయంతి జరుపుకొని, ఆయన సేవలను స్మరించుకోవడం మన కర్తవ్యమని అన్నారు. తెలుగు భాషను వాడుక భాషలో అందరికీ అర్థమయ్యే రీతిలో ఆయన చేసిన సంస్కరణలు బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు తెచ్చాయన్నారు. ఆ మహనీయుని జయంతి కార్యక్రమాన్ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం తెలుగు వారికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. తెలుగు భాషకు ఉన్న గొప్పదనం ఇతర ఏ భాషకూ లేదని, అందుకే తెలుగును ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పేర్కొంటారని కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. సవర భాష కోసం శ్రీకాకుళం వెళ్లి ఆ భాషకు లిపిని తీసుకొచ్చి వాడుక భాష ఔన్నత్యాన్ని చాటిన గొప్ప వ్యక్తి రామ్మూర్తి అని వివరించారు. ఆయన రచనల్లో బాలకవి శరణ్యం, ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము, గద్య చింతామణి వంటివి ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ఆయన వాడుక భాష గురించి చేసిన ఉద్యమ ఫలితంగా నేడు పాఠశాలల్లో సమాచార ప్రసారసాధనాల్లో సాహిత్యంలో వాడుక భాషను వాడుతున్నారని కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు. అనంతరం తెలుగులో విశేష సేవలందిస్తున్న తెలుగు భాషా పురస్కార గ్రహీతలు నలుగురిని సత్కరించారు. డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీఈఓ సి.వి. రేణుక, డెప్యూటీ డీఈఓ రవికుమార్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలను పరిష్కరించాలి

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



స్పందనలో అర్జీల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ శ్రీవాస్‌నుపూర్ తదితరులు

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ప్రజా సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి స్పందన కార్యక్రమంపై ప్రజల్లో విశ్వాసం పెంచేలా అన్ని శాఖల అధికారులు పనిచేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో ఉన్న పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు ప్రజల నుంచి స్వయంగా అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను ఆలకించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి 102 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారానికి స్పందన వేదిక ఒక చక్కని మార్గమని అర్జీదారులకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని స్పష్టంచేశారు. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, సాధ్యమైన త్వరగా సంబంధిత సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, డీపీఓ జె.సునీత, ట్రైనీ డెప్యూటీ కలెక్టర్లు రామలక్ష్మి, భాను, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమైన అర్జీలు ఇవీ..

- తనకు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామ పంచాయతీ పరిధిలో 1.51 ఎకరాల భూమి ఉందని, దానికి సరిహద్దులు నిర్ణయించి పట్టాదారు పాస్ పుస్తకం ఇప్పించాలని గ్రామానికి చెందిన డి.ప్రసాద్ అర్జీ సమర్పించారు.
- తన సొంత రిజిస్టర్డ్ భూమిని కబ్జా చేయడానికి కొంత మంది వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని, తగు చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని తిరువూరుకు చెందిన సీహెచ్.హేమలత కోరారు.

ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): కృష్ణానదికి వరద పోటెత్తింది. నాగార్జున సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తివేయడంతో దిగువన ఉన్న పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి భారీగా వరద వచ్చి చేరుతోంది. పులిచింతల డ్యామ్ నుంచి నాలుగు లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. ఇది ఐదు లక్షల క్యూసెక్కుల వరకు పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్ట్ డ్యామ్ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో ఆధారంగా మంగళవారం నాటికి ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి 4.50 లక్షల క్యూసెక్కుల వరకు వదిలే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ, దిగువన కృష్ణానది తీరంలో అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు సంబంధిత అధికారులు అందరినీ అప్రమత్తం చేశారు. వరద పరిస్థితిని రిజర్వ్ కన్జర్వేటర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

జిల్లాలో 15.91 మి.మీ. వర్ష పాతం

ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం 15.91 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. విజయవాడ రూరల్ మండలంలో 44.8 మిల్లీమీటర్లు, విజయవాడ నగరంలోని నాలుగు మండలాల పరిధిలో 43.2 మిల్లీ మీటర్ల చొప్పున వర్షం కురిసింది. జగ్గయ్యపేట మండలంలో 28.2 మిల్లీమీటర్లు, ఇబ్రహీంపట్నంలో 23.6, చందర్లపాడులో 23.4, జి.కొండూరు మండలంలో 14.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కల్లుగీత కార్మికులకు నూతన పాలసీ రూపొందించాలి

కృష్ణలంక (విజయవాడ తూర్పు): రాష్ట్రంలోని కల్లుగీత కార్మికులకు ఉపాధి కల్పించేలా నూతన పాలసీ రూపొందించాలని పలువురు కోరారు. గవర్నర్‌పేట మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం కల్లుగీత కార్మికుల రాష్ట్ర సదస్సు జరిగింది. ముఖ్య అతిథి, ఎమ్మెల్సీ ఇల్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బహుళజాతి లిక్కర్ కంపెనీల ధాటికి కల్లు అమ్మకాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. కల్లు గీత వృత్తిలో ఆధునిక పద్ధతులను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జుత్తిగ నరసింహామూర్తి, ఎం.భాస్కరరావు ప్రసంగించారు.

'సాక్షి' మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో...

నేడే చిన్నారుల చేతుల్లో మట్టి గణపతి

వినాయకుని పండుగ వస్తోంది! వినాయక చవితి రోజు మీరు పుస్తకాలు, పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన మధురమైన పిండి వంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరే సమయం ఆసన్నమైంది. అయితే మీరు పూజించాల్సిన వినాయకుణ్ని మీరే మీ చిట్టి చేతులతో తయారు చేస్తే 'గణాధిపతి'

ఎంతో సంతోషించి వరాలనిస్తాడు. మాకు విగ్రహం చేయడం రాదని చింతించకండి. విగ్రహం తయారు చేసే విధానం గురించి 'సాక్షి' మీడియా గ్రూప్,

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 30వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు ఉన్న బాలలందరూ పాల్గొనవచ్చు. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని సైతం నిర్వాహకులే ఉచితంగా ఇస్తారు. మీరు దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్ చేసి పేర్లను నమోదు చేసుకుంటే చాలు. పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని ప్రతిమలుగా మలిచి, రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. ఇంకెందుకు ఆలస్యం మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్ బాటిల్, పాత వస్త్రం వెంట తీసుకురండి.

అవిఘ్నమస్తు.. అభీష్ట సిద్ధిరస్తు..

శిబిరం చిరునామా : నలంద విద్యా నికేతన్ ప్రైమరీ స్కూల్ బ్లాక్, డోర్ నం.40-9-44, ఆచార్య రంగా నగర్, బెంజ్‌సర్కిల్ దగ్గర విజయవాడ - 520010

తేదీ: 30-08-2022 (మంగళవారం)

సమయం: ఉదయం 9.30 నుంచి 12.30 వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 99126 71555

మనోహరం విష్ణుచిత్తీయం



విష్ణుచిత్తీయం నృత్యరూపకంలో ఓ సన్నివేశం

విజయవాడ కల్చరల్: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సోమవారం ప్రదర్శించిన నృత్య రూపకం మనోహరంగా సాగింది. జేఎంఎస్ నాట్యవేద, సిద్ధార్థ కళాపీఠం ఆధ్వర్యంలో మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాపీఠం వేదికపై ఈ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. శ్రీకృష్ణదేవరాయలు రచించిన ఆముక్తమాల్యాద (విష్ణు చిత్తీయం) కావ్యం ఆధారంగా జంగం చక్రవర్తి, విజయకుమార్ కథ అందించగా యువ నృత్యకళాకారులు జంగం శిరీషాచక్రవర్తి, మనీషాచక్రవర్తి ప్రధాన పాత్రలు పోషిస్తూ నృత్య దర్శకత్వం వహించారు. తెలుగు వల్లభుడు శ్రీకృష్ణదేవరాయలను కీర్తిస్తూ 'తెలుగు తల్లికి వందనం.. తెలుగు భాష రాజసం' కీర్తనతో నృత్యరూపకం ప్రారంభమైంది. విష్ణుచిత్తుడి పెంపుడు కుమార్తె గోదాదేవి. ఆమె చిన్నతనం నుంచే తండ్రి శిక్షణలో విష్ణు భక్తి కలిగివుంటుంది. విష్ణుమూర్తి కోసం తయారు చేసిన పూల దండలను తొలుత గోదాదేవి ధరించేది. కుమార్తె చేసే ఈ పని తెలియక విష్ణుచిత్తుడు ఆ మాలలను దేవుడికి అలంకరించేవాడు. కుమార్తె కోరిక మేరకు గోదాదేవికి విష్ణుమూర్తితో విష్ణుచిత్తుడు వివాహం జరిపిస్తాడు. ప్రధాన కథకు అనుబంధంగా ఆముక్తమాల్యదలోని అనేక సన్నివేశాలకు నృత్యరూపంలో చోటు కల్పించి ప్రదర్శించారు. విష్ణుచిత్తుడిగా మనీషా చక్రవర్తి, రంగనాథుడిగా అఖిల, పాండ్యరాజు, గోదాదేవిగా శిరీషా చక్రవర్తి, ఇతర పాత్రల్లో కీర్తి తదితరులు నృత్యాలను అభినయించారు. ఈ సందర్భంగా నాట్యవేద నిర్వాహకుడు జంగం చక్రవర్తి మాట్లాడుతూ.. పంచకావ్యాలకు నృత్యరూపం కల్పిస్తునట్లు తెలిపారు. న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా, సిద్ధార్థ కళాపీఠం బాధ్యులు నల్లూరి వెంకటేశ్వర్లు, జంగం విజయకుమార్ పాల్గొన్నారు. అనంతరం నృత్య ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.

టిప్పర్ ఢీకొని యువకుడి దుర్మరణం

మరో యువకుడికి తీవ్ర గాయాలు


మృతి చెందిన ఏసురాజు

గుడివాడరూరల్: వేగంగా వెళ్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందిన విషాద సంఘటన పట్టణంలోని బైపాస్‌రోడ్‌లో సోమవారం జరిగింది. పట్టణంలోని ద్రోణాదుల వీధికి చెందిన స్నేహితులు సంపంగి ఏసురాజు(17), నల్లపు సాయిసుభాష్(17) బైక్‌పై బంటుమిల్లి రోడ్డు నుంచి బైపాస్ రోడ్ మీదుగా నాగవరప్పాడు వైపు వెళ్తుండగా వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలైన సంపంగి ఏసురాజు అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న సాయిసుభాష్‌కు స్వల్ప గాయాలు కాగా అతడిని చికిత్స నిమిత్తం గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ పరారయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వన్‌టౌన్ ఎస్‌ఐ పి.గౌతమ్‌కుమార్ సిబ్బందితో కలసి సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. సమాచారం అందుకున్న ఏసురాజు తల్లిదండ్రులు ఘటనా స్థలానికి వచ్చి కుమారుడి మృతదేహాన్ని చూసి భోరున విలపించారు. ఇద్దరు ఆడపిల్లల తర్వాత జన్మించిన మగ బిడ్డ ప్రమాదానికి గురై మరణించడాన్ని జీర్ణించుకోలేని తల్లిదండ్రుల రోదనలతో ఆ ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ గౌతమ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్రోణాదుల వీధిలో విషాదఛాయలు...

స్నేహితులతో అప్పటివరకు కలసి ఉత్సాహంగా గడిపిన ఏసురాజు రోడ్డు ప్రమాద సంఘటనలో మృతి చెందాడన్న విషయాన్ని తెలుసుకున్న కుటుంబ సభ్యులు, స్నేహితులు, చుట్టుపక్కల వారు సంఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. ఏసురాజు మరణం ద్రోణాదుల వీధిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

కార్పొరేట్ పాపం.. జీజీహెచ్‌కు శాపం



మరణం అంచుల్లోకి వెళ్లిన వ్యక్తిని కూడా బతికించేస్తామంటూ ప్రకటనలు గుప్పించి రోగులను ఆకర్షిస్తారు. రోగి వద్ద లక్షలకు లక్షలు గుంజేసి, పీల్చి పిప్పి చేస్తారు. చివరకు మా వల్ల కాదంటూ చేతులెత్తేస్తారు. ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లండంటూ ఉచిత సలహా ఒకటి పారేసి చేతులు దులుపుకొంటారు... ఇదీ కార్పొరేట్ ఆస్పత్రుల పనితీరు...ఇలా కొన ఊపిరితో వచ్చిన రోగుల మరణాలన్నీ ప్రభుత్వాసుపత్రుల ఖాతాల్లో పడుతున్నాయి. ప్రభుత్వాసుపత్రులు పాపాల భైరవుల్లా అవుతున్నాయి. అయితే ఇలా వచ్చిన వారిలో కూడా కొందరిని బతికించి పునర్జన్మ ఇచ్చిన ఘనత మాత్రం ప్రభుత్వ వైద్యులకే చెందుతుంది.

– లబ్బీపేట(విజయవాడతూర్పు)

- కార్పొరేట్ పాపాలు జీజీహెచ్ లెక్కల్లోకి...
- చివరి దశలో ప్రభుత్వాస్పత్రికి పంపేస్తున్న వైనం
- ఆ మరణాలన్నీ జీజీహెచ్ ఖాతాలోకి
- నిత్యం ఒకరిద్దరు అలాంటి వారు వస్తున్నట్లు వైద్యుల వెల్లడి

■ వెటర్నరీ కాలనీకి చెందిన ఇబ్రహీం(60) పదిహేను రోజుల కిందట రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా ఓ స్కూల్ బస్సు ఢీకొంది. తలకు బలమైన గాయం అవడంతో సమీపంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ రెండు రోజుల్లో రూ.1.50 లక్షలు ఖర్చు చేసిన తర్వాత బయటకు పంపించేశారు. అనంతరం ఎనికేపాడులోని మరో ఆస్పత్రికి వెళ్లగా అక్కడ మరో రెండు రోజులు వెంటిలేటర్‌పై ఉంచి దాదాపు రూ.2 లక్షల వరకూ బిల్లు చేసి, చివరి దశలో ప్రభుత్వాస్పత్రికి తోసేశారు. ఇక్కడికి వచ్చిన కొద్దిసేపటికే ఇబ్రహీం మృతి చెందారు.

■ పామర్రుకు చెందిన వెంకటేశ్వరరావు బ్రెయిన్‌లో ట్యూమర్ ఉండటంతో నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో ఆపరేషన్ చేయించుకున్నారు. అనంతరం వెంటిలేటర్‌పై ఉన్నారు. పది రోజుల పాటు అక్కడే చికిత్స చేసి రూ.3 లక్షల వరకూ గుంజేశారు. తర్వాత ఇక లాభం లేదనుకుని ప్రభుత్వాస్పత్రికి పంపించేశారు.

ఇలా వీరిద్దరే కాదు నవజాత శిశువులు, బాలింతలు, పక్షవాతం, గుండెనొప్పి, ఇతర ఇన్‌ఫెక్షన్స్ సోకిన వారు కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొంది చివరి దశలో ప్రభుత్వాస్పత్రికి వచ్చి మరణించడంతో ఆ లెక్కలు ఇక్కడి ఖాతాల్లో చేరిపోతున్నారు.

రోజుకు ఒకరిద్దరు...

రోజులో ఒకరిద్దరు ఇలాంటి వారు ప్రభుత్వాస్పత్రి క్యాజువాలిటీకి వస్తుంటారు. అలాంటి వారందరినీ ఇక్కడి వైద్యులు చేర్చుకుని శాయశక్తులా తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు. అప్పటికీ పరిస్థితి విషమించడంతో మరణాలు సంభవిస్తున్నాయి. కొందరు క్యాజువాలిటీలో వచ్చిన అర్ధగంట, గంటకే మరణిస్తుండగా, మరికొందరు వార్డుల్లో అడ్మిట్ చేసిన తర్వాత ఒకటీ, రెండు రోజులకు మరణిస్తున్నారు. క్యాజువాలిటీ మరణాలు ఆస్పత్రి లెక్కల్లో చేరకున్నా, అడ్మిట్ చేసినవి మాత్రం జీజీహెచ్ ఖాతాలోకి వస్తున్నాయి.

జీజీహెచ్‌లో మరణాలు ఇలా

నెల	ఇన్‌పేషెంట్స్	వచ్చే సరికే మరణించినవారు
జనవరి	329	34
ఫిబ్రవరి	292	62
మార్చి	333	53
ఏప్రిల్	371	86
మే	404	71
జూన్	474	62
జూలై	362	49

చివరి దశలో పంపుతున్నారు



ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వెంటిలేటర్‌పై ఉన్న వారిని పంపించేస్తున్నారు. కొందరు డబ్బులు అయిపోయి ఇక కట్టలేని వారిని సైతం ప్రభుత్వాస్పత్రికి వెళ్లండి అని చెప్పి పంపుతున్నారు. ఇక్కడికి వచ్చే ప్రతి ఒక్కరికీ వైద్యం చేయడమే మా విధి. అలా వచ్చిన వారిలో ఎక్కువ మరణాలు సంభవిస్తుండటంతో అవన్నీ జీజీహెచ్ లెక్కల్లోకి వచ్చేస్తున్నాయి. ట్రామా కేసులు సైతం మచిలీపట్నం, ఏలూరు నుంచి కూడా వస్తున్నాయి.

–డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి, సూపరింటెండెంట్, జీజీహెచ్

రోగుల బంధువుల హడావుడి

కార్పొరేట్ ఆస్పత్రి నుంచి చివరి దశలో వచ్చిన రోగి మరణిస్తే ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం అంటూ బంధువులు గొడవ చేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల ఒక రోగి విషయంలో ఇలాగే గొడవ చేస్తే జూనియర్ వైద్యులు ఎదురు తిరగడంతో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది.

అండర్-14 ఖో-ఖో జట్ల ఎంపిక


ఎంపికైన బాలుర జట్టు

గుడివాడ టౌన్ : కృష్ణాజిల్లా ఖో-ఖో సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి పోటీలకు అండర్-14 బాల బాలికల జట్లను ఎంపిక చేసినట్లు జిల్లా ఖో-ఖో సంఘం కార్యదర్శి మడకా ప్రసాద్ సోమవారం తెలిపారు. స్థానిక ఎస్‌పీఎస్ హైస్కూల్‌లో జరిగిన ఈ పోటీల్లో బాలుర విభాగంలో 9, బాలికల విభాగంలో 8 జట్లు పాల్గొన్నాయని వీరిలో బాలుర జట్టులో 16 మందిని, బాలికల జట్టులో 12 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ ఎంపికలో విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌పీఎస్ హెచ్‌ఎం టీఎంఈ రాణి, గాంధీ మున్సిపల్ హైస్కూల్ హెచ్‌ఎం ఎస్‌కే జానీ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఏఈఈ ఇంట్లో చోరీ

చల్లపల్లి: స్థానిక సన్‌ఫ్లవర్ కళాశాల వెనుక ఉన్న ఇస్లాం నగర్ టీచర్స్ కాలనీలో చోరీ జరిగింది. ఇరిగేషన్ శాఖలో ఏఈఈగా విధులు నిర్వర్తిస్తున్న పులిగడ్డ వెంకటేశ్వరరావు ఇంట్లో ఈ ఘటన జరిగింది. వెంకటేశ్వరరావు తమ కుమారుడిని చెన్నైలోని కళాశాలలో చేర్పించేందుకు శనివారం కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి గేటు తాళాలు వేసి ఉన్నా ఇంటి మెయిన్ డోర్ లాక్ ఊడగొట్టి చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఇంట్లో భద్రపరిచిన రూ.లక్ష నగదు, 100 గ్రాముల బంగారం, కిలో వెండి అపహరణకు గురైనట్లు వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ ఎండీ మహబూబ్ బాషా, చల్లపల్లి సీఐ బి.భీమేశ్వర రవికుమార్ ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. సాయంత్రం మచిలీపట్నం క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు ఆధారాలు సేకరిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ రవికుమార్ తెలిపారు.

తండ్రికి కర్మకాండలు చేసిన కుమార్తె


పరిటాలలో అనారోగ్యంతో మృతిచెందిన తండ్రికి కర్మకాండలు చేస్తున్న తనయ

కంచికచర్ల: తండ్రి అనారోగ్యంతో మృతిచెందిన నేపథ్యంలో కుమార్తే కర్మకాండలు చేసిన సంఘటన కంచికచర్ల మండలంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాసరావు(42) అనారోగ్యంతో ఆదివారం సాయంత్రం మృతిచెందారు. శ్రీనివాసరావుకు భార్య లక్ష్మి, ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె సిరిణి, చిన్నకుమార్తె స్పందన. ఈనెల 10 తేదీన పెద్ద కుమార్తె సిరిణికి మర్సుమల్లి గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. 16 రోజుల పండుగ సందర్భంగా సిరిణి పుట్టింటికి వచ్చింది. చిన్నకుమార్తె స్పందన కంచికచర్ల అక్షర జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. పెద్ద కుమార్తె వివాహమై 20 రోజులు కూడా కాకముందే శ్రీనివాసరావు మృతిచెందటంతో పెళ్లింట విషాదం అలుముకుంది. శ్రీనివాసరావుకు కొడుకులు లేకపోవటంతో చిన్నకుమార్తె స్పందన సోమవారం కర్మకాండలు చేసింది.

విగ్రహాల ఏర్పాటుపై ఆంక్షలు లేవు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ ఏడాది వినాయక చవితికి విగ్రహాల ఏర్పాటుపై ఎలాంటి ఆంక్షలు లేవని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు స్పష్టం చేశారు. వినాయక చవితి వేడుకలలో వినాయక పందిళ్ల నిర్వహణ, నిమజ్జనం ఏర్పాట్లపై సోమవారం కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సామరస్యపూర్వకమైన ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఉత్సవ నిర్వాహకులు పోలీసుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. పందిళ్ల వద్ద ఎటువంటి ఘర్షణలు తలెత్తకుండా భద్రత ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. పందిళ్లలో ఏర్పాటు చేసే విద్యుత్ అలంకరణ వలన షార్ట్ సర్క్యూట్‌కు తావులేకుండా తనిఖీలు నిర్వహించాలని కలెక్టర్ విద్యుత్ అధికారులను ఆదేశించారు. నగరంలో సుమారు 900 విగ్రహాలు, గ్రామీణ ప్రాంతాలలో 600 వరకు విగ్రహాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే పోలీస్ అధికారుల వద్ద అనుమతులు తీసుకున్నట్లు సమాచారం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని నిమజ్జనానికి అవసరమైన క్రేన్లు ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలి

నిమజ్జన ప్రాంతాల వద్ద గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని, ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, కార్పొరేషన్ శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు ఏర్పాట్లకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఏసీపీ కె.హనుమంతరావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎం.సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి మృతి

ఉమ్మడదేవరపల్లి(గంపలగూడెం): తనను అకారణంగా దూషించారనే మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఒక యువకుడు మృతిచెందిన సంఘటనపై గంపలగూడెం పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. మండలంలోని ఉమ్మడదేవరపల్లికి చెందిన ఇనపనూరి నాగబాబు(23) ఈ నెల 23న ఇంటి సమీపంలో మూత్ర విసర్జన చేస్తుండగా, ఒక మహిళ తనతో అసభ్యకరంగా వ్యవహరించాడంటూ దూషించింది. దీంతో మనస్తాపానికి గురైన నాగబాబు ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు హుటాహుటిన నాగబాబును తిరువూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సతీష్ తెలిపారు. నాగబాబుపై మహిళతో పాటు ఆమె భర్త, అత్త దౌర్జన్యానికి పాల్పడడంతో బలవన్మరణం చెందినట్లు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

మద్యం మత్తులో తండ్రిని హత్య చేసిన కొడుకు

కృష్ణలంక(విజయవాడ తూర్పు): మద్యం మత్తులో ఓ కుమారుడు తన కన్న తండ్రినే కడతేర్చిన ఉదంతం కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాణిగారితోట, కరెంట్ ఆఫీస్ రోడ్డులో నివాసం ఉంటున్న తిరుమలపల్లి సాంబయ్య(60) బందరురోడ్డులోని ఓ షాపింగ్ మాల్‌లో నైట్ వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. ఈయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మూడో కుమారుడు తిరుమలపల్లి రాయుడు ఆదివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో మద్యం తాగి ఇంటికి వెళ్లగా, మద్యం ఎందుకు తాగి వచ్చావని కుమారుడిని తండ్రి మందలించాడు. దీంతో మాటామాటా పెరిగి, కోపోద్రిక్తుడైన కుమారుడు క్షణికావేశంలో పక్కనే ఉన్న రోకలి బండతో తండ్రి తలపై మోదాడు. దీంతో సాంబయ్య తలపగిలి తీవ్ర రక్తస్రావమవడంతో చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాంబయ్య ఆదివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, నిందితుడు రాయుడును అరెస్ట్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాయుడిపై కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో సస్పెక్ట్ షీటర్‌గా పేరు నమోదై ఉన్నట్లు సమాచారం.

ఏడేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

వెంట్రప్రగడ (పెదపారుపూడి): కల్లాకపటం తెలియని ఏడేళ్ల బాలికపై ఓ వృద్ధుడు లైంగిక దాడికి యత్నించిన ఘటనపై సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణాజిల్లా పెదపారుపూడి మండలంవెంట్రప్రగడ శివారు పులవర్తి గూడేనికి చెందిన చీకుర్తి ఏలియా(70) టైలర్. గ్రామాల్లో ఇళ్లకు వెళ్లి ప్రార్థనలు కూడా చేస్తుంటాడు. అదే ప్రాంతంలో ఉంటున్న మూడో తరగతి చదువుతున్న ఏడేళ్ల బాలిక తన స్కూల్ బ్యాగ్ చిరిగిపోవటంతో తమ్ముడితో కలిసి పక్క సందులో ఉండే టైలర్ ఏలియా వద్దకు వెళ్లింది. తాతా... స్కూల్ బ్యాగ్ చిరిగిపోయింది, కుట్టమని అడిగింది. దీంతో టైలర్ బాలిక తమ్ముడిని ఇంటికి వెళ్లిపొమ్మని చెప్పి, ఆమెకు మాయమాటలు చెప్పి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక భయంతో పరుగున ఇంటికి వెళ్లి తల్లికి జరిగిన విషయం చెప్పింది. వెంటనే ఆమె దిశ యాప్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడు ఏలియాను అదుపులోకి తీసుకుని దిశ, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తాతాచార్యులు తెలిపారు.

ఏజెంట్ల మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైలు ప్రయాణికులు టికెట్ల కొనుగోలులో ఏజెంట్లు చేసే మోసాలపై అప్రమత్తంగా ఉండాలని విజయవాడ డివిజన్ సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు హెచ్చరించారు. ఇద్దరు నిరక్షరాస్య యువకులు కోల్‌కతాలో ఒక గుర్తింపు లేని ఏజెంట్ ద్వారా టికెట్లు కొనుగోలు చేయగా ఏజెంట్ వారికి వికలాంగ రాయితీతో కూడిన టికెట్‌లను విక్రయించాడన్నారు. ఆ టికెట్‌తో వారు ప్రయాణం చేస్తుండగా సోమవారం విజయవాడ-చెన్నై సెక్షన్‌లో టీటీఈ ఫణీంద్రకుమార్ తనిఖీలలో వాటిని వికలాంగ రాయితీతో ఉన్న టికెట్లుగా గుర్తించి, అపరాధ రుసుం విధించారని తెలిపారు.

క్లుప్తంగా

పోలీస్ స్పందనలో 74 ఫిర్యాదులు



విజయవాడ స్పోర్ట్స్: స్థానిక పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 74 మంది బాధితుల నుంచి డీసీపీ మేరీప్రశాంతి సోమవారం ఫిర్యాదులు స్వీకరించారు. నగదు లావాదేవీలపై 16, కుటుంబ కలహాలపై 10, ఆస్తి వివాదాలపై 9, ఇతర సమస్యలపై 39 మంది ఫిర్యాదు చేశారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో ఫిర్యాదుదారులతో మాట్లాడిన అనంతరం నిర్ణీత కాలవ్యవధిలో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్‌ల అధికారులకు డీసీపీ ప్రశాంతి ఆదేశాలిచ్చారు.

నేడు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ) : పద్మశాలి యువజన సేవా సంఘం, శబరిమల అయ్యప్ప సేవా సమాజం, సద్గురు సత్సంగ సేవా సమాజం ఆధ్వర్యంలో మంగళవారం నగరవాసులకు ఉచితంగా మట్టి గణపతి విగ్రహాల పంపిణీ చేస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ప్రజా ఆరోగ్యం, కాలుష్య నివారణకై నగరంలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో విగ్రహాల పంపిణీ ఉంటుందని చెప్పారు. వన్‌టౌన్ కలరా హాస్పటల్ సమీపంలోని ఫైర్‌స్టేషన్ వద్ద, 8వ లైన్, భగత్‌సింగ్‌నగర్ యనమలకుదురులో, కృష్ణలంక సత్యగారి హోటల్ వద్ద సాయంత్రం 4 గంటలకు ఉచితంగా విగ్రహాల పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ):అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన వివాహిత అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. గొల్లపాలెంగట్టు కస్తూరిబా ఆశ్రమం ప్రాంతానికి చెందిన షేక్. యాకోబీ, శంకర్ అనే యువకుడిని ప్రేమించి పెళ్లి చేసుకుంది. భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా కొంత కాలంగా ఇద్దరు విడివిడిగా ఉంటున్నారు. యాకోబీ తన బిడ్డతో తల్లి వద్దే ఉంటూ స్థానికంగా ఉన్న ఓ బట్టల దుకాణంలో పని చేస్తుంది. 26వ తేదీ రాత్రి షాపు నుంచి ఆలస్యంగా ఇంటికి వచ్చిన యాకోబీని తల్లి సైదాబీ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో యాకోబీ అలిగి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. గతంలో కూడా రెండు సార్లు ఇదే రీతిలో జరగడంతో ఉదయం ఇంటికి వస్తుందిలే అనుకుంది. రెండు రోజులైనా యాకోబీ జాడ లేకపోవడంతో కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

క్రీడలతో అద్భుతమైన భవిష్యత్



వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): క్రీడల ద్వారా అద్భుతమైన భవిష్యత్‌ను సొంతం చేసుకోవచ్చని కొత్తపేట హిందూ హైస్కూల్ పాలకవర్గ కార్యదర్శి కేఎల్వీ మోహనరావు అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలను పాఠశాల ఆవరణలో సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యాభ్యసించటంతో పాటు క్రీడల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి వివిధ ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు సాధించిన ఆరుగురు పూర్వ విద్యార్థులను సత్కరించారు. వారిలో పి.నాగమణి, పి.కనకసింహాచలం, ఎస్కే ఉస్మాన్, పి.పరమేశ్వరి, సిహెచ్ నైసయ్య, ఈ సాయి నిహారిక ఉన్నారు. రాష్ట్ర స్థాయి మెడల్స్ సాధించిన పలువురును పాలకవర్గం సత్కరించింది. ఈ నేపథ్యంలో క్రీడా విభాగాల్లో ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు సాధించిన పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో తెలుగు పండితులైన కొంచెం శ్రీనివాస్, డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, డాక్టర్ కొమండూరి కృష్ణలను సత్కరించారు.

హోండా ద్విచక్రవాహనాలు మార్కెట్‌లోకి విడుదల



కృష్ణలంక(విజయవాడ తూర్పు): బందరురోడ్డులోని అన్విత హోండా షోరూమ్‌లో యాక్టివా 6జీ ప్రీమియం, షైన్ సెలబ్రేషన్ మోడళ్లను మార్కెట్‌లోకి విడుదల చేశారు. షోరూమ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కొత్త మోడళ్లను హోండా ఏరియా సేల్స్ మేనేజర్ రమేష్ సాన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యంత ఆకర్షణీయమైన కలర్స్, గోల్డ్ గార్నిష్‌తో ప్రీమియం మోడల్ సుందరంగా ఉందని తెలిపారు. షైన్ ఒక కోటి వాహనాల లాండ్ మార్క్ దాటిన సందర్భంగా సెలబ్రేషన్ మోడల్‌ను కూడా అందంగా తీర్చిదిద్దారన్నారని చెప్పారు. కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అన్విత హోండా చైర్మన్ ఆంజనేయులు, ఎండీ శ్రీనివాస్, జీఎం శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పారు. భవానీపురం 42వ డివిజన్ 132వ సచివాలయం పరిధిలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ పి. చైతన్యరెడ్డితో కలిసి గడప గడపకు పర్యటించారు. వెలంపల్లికాలనీ పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ మూడేళ్ల కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

మంచినీటి సమస్య పరిష్కరిస్తాం...

ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీలో మంచినీటి సమస్య త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఈ ప్రాంతంలో సిమెంట్ రోడ్లు, బీటీ రోడ్లు నిర్మాణం చేశామని చెప్పారు. చిన్న రోడ్లు ఉన్నాయని వాటిని కూడా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పార్కులు డెవలప్ చేస్తామని తెలిపారు. ఈ ప్రాంతంలోని పేదలకు అమరావతిలో ప్లాట్లు కేటాయించామని, కోర్టులో కేసు ఉన్నందును స్టే ఎత్తివేయించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కోర్టు అడ్డంకులు తొలగని ప్రాంతంలో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ ఎక్కడ పోటీ చేస్తారో చెప్పగలరా...?

నాగబాబుకు దమ్ము ధైర్యం ఉంటే తన తమ్ముడు పవన్ కళ్యాణ్ ఎక్కడ పోటీ చేస్తాడో చెప్పాలని సవాల్ విసిరారు. జనసేన పార్టీ అధ్యక్షుడు అన్నగా ఆ పార్టీ సీఎం అభ్యర్థి పవన్ కళ్యాణ్ అని నాగబాబు చెప్పగలరా ? అని ప్రశ్నించారు. 175 నియోజకవర్గాల్లో మా అభ్యర్థులు పోటీ చేస్తారని చెప్పే సత్తా పవన్ కళ్యాణ్‌కు ఉందా? అని నిలదీశారు. నాగబాబు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడి పోయారని, ఆయన కూడా వైఎస్ జగన్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధిస్తుంటే జనాలు నవ్వుకుంటున్నారన్నారు. జనసేన పార్టీకి అసలు అభ్యర్థులేరన్నారు. రాజకీయాల్లో పవన్ కళ్యాణ్, నాగబాబు కామెడీ యాక్టర్లు అన్నారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష మాధుర్యం అపూర్వం



విజేతలకు బహుమతులు అందిస్తున్న సత్యవతి



గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఏడీసీపీ వెంకటరత్నం

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): తెలుగు భాషా మాధుర్యం అపూర్వమని ప్రముఖ సాహితీవేత్త వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి అన్నారు. కేబీఎన్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగు భాషా మాధుర్యం అనే అంశంపై సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషలో అనేక ప్రత్యేకతలున్నాయని పలువురు పరిశోధకులు నిరూపించారని తెలిపారు. దేశభాషలందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు కీర్తించి ప్రపంచానికి ఆ భాషలోని మాధుర్యాన్ని వివరించారని పేర్కొన్నారు. పద్యం, కవిత్వం, నాటకం వంటి విభిన్న అంశాలు భాషలోని వైవిధ్యాన్ని తెలియజేస్తాయన్నారు. ఏ భాషలోనూ లేని పద్యం ఒక్క తెలుగుకు మాత్రమే సొంతమన్నారు. మాతృభాషలో పట్టు సాధించినప్పుడే వారి జీవితాల్లోనూ చక్కని మనుగడను కొనసాగిస్తారన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్ మాట్లాడుతూ తెలుగు భాషా మాధుర్యం అమోఘమన్నారు. తెలుగు భాషలో ఉన్న వివిధ యాసలు, మాండలికాలు మరేభాషలో అంతగా కనిపించావన్నారు. సీనియర్ అధ్యాపకులు డాక్టర్ జేపీ చలపతిరావు మాట్లాడుతూ తెలుగు వెలుగుకు అందరూ కృషి చేయాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, విభాగాధిపతి శివయ్య నాయక్ పాల్గొన్నారు.

వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి పంతులని రచయిత్రి, తెలుగు పండితులు కావూరి సత్యవతి అన్నారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు 159వ జయంతి సందర్భంగా రమ్యభారతి సాహిత్య వేదిక ఆధ్వర్యంలో సోమవారం విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ హైస్కూల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అత్యంత మధురమైన భాష మన తెలుగు అని తెలిపారు. తెలుగు భాషకు మాత్రమే ప్రత్యేకమైన పద్యం, అవధానం వంటి వాటి పట్ల నేటి యువతరం అవగాహన పెంచుకోవాలన్నారు. పాఠశాల హెచ్ఎమ్ మాతంగి కోటయ్య మాట్లాడుతూ మాతృభాషలో నిష్ణాతులైనవారే ఇతర భాషల్లో రాణిస్తారని పేర్కొన్నారు. రమ్య భారతి సాహిత్య వేదిక వ్యవస్థాపక కార్యదర్శి చలపాక ప్రకాష్, కథా రచయిత్రి కోపూరి పుష్పాదేవి, ఉపాధ్యాయులు నాగ అనసూయ, ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాష ఆద్యులు ముత్తరాజు

సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): తెలుగు భాషా కిరణాలను దశదిశలా వ్యాపింపచేసిన తొలి తెలుగు శాసనకర్త 'ఎరికల్ ముత్తురాజు ధనంజయుడు'కి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు సముచిత స్థానం కల్పించి అధికారికంగా నివాళులర్పించాలని మాజీ కార్పొరేటర్, తొలి తెలుగు దివ్వె, తెలుగు మూలాల అధ్యయన సంఘం నగర అధ్యక్షురాలు పిల్లి తక్ష్మీతులసి కోరారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురష్కరించుకుని సోమవారం మధురానగర్‌లోని ముదిరాజ్ సంఘ కళ్యాణ మండపంలో ఎరికల్ ముత్తరాజు ధనంజయుడు చిత్రపటానికి నివాళులర్పించారు. తొలి తెలుగు దివ్వె సంఘ వ్యవస్థానక అధ్యక్షుడు, ముదిరాజ్ సంఘ కళ్యాణ మండపం ప్రధాన కార్యదర్శి పివిఎల్ఎస్ రాజు, వరప్రసాద్, పోలవరపు బుద్ధప్రసాద్, కోమటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

విజయవాడ స్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్‌లో తెలుగు భాషా దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. క్రైం ఏడీసీపీ పి.వెంకటరత్నం పాల్గొని మాట్లాడారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రామ్మూర్తి చేపట్టిన వ్యవహారిక భాషోద్యమంతోనే తెలుగు ఆధునిక సాహిత్యం కొత్త సొగసులు సంతరించుకోవడంతో పాటు అక్షరాస్యత పెరిగిందన్నారు. తెలుగును అధికారిక, పరిపాలనా భాషగా కీర్తికెక్కించడంలో గిడుగు రామ్మూర్తి చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. సీసీఆర్‌బీ ఏసీపీ వెంకటేశ్వరరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

11 వరకు బాలగణపతి ఆలయంలో ఉత్సవాలు



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న గ్రంధి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పాతబస్తీ పూజారివారివీధిలో వేంచేసి ఉన్న బాలగణపతి ఆలయంలో ఈ నెల 31 నుంచి సెప్టెంబర్ 11వ తేదీ వరకూ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు చెప్పారు. గణపతి ఉత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన 36 సంవత్సరాలుగా గణపతి ఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది పన్నెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయన్నారు. 31న బ్రహ్మ, విష్ణు, శివ సమేత పార్వతీ పరమేశ్వర శ్రీ బాలగణపతి అలంకారంలో స్వామి దర్శనమిస్తారన్నారు. ఒకటో తేదీన నాట్యగణపతిగా, రెండున శ్రీ వాంఛకల్ప గణపతిగా, మూడున శ్రీ వీణాపాణిగణపతిగా, నాలుగున విశ్వరూప గణపతిగా, ఐదున కుమార గణపతిగా, ఆరున హనుమద్ గణపతిగా, ఏడున సిద్ధిబుద్ధి కల్యాణ గణపతిగా ఎనిమిదిన శయన గణపతిగా తొమ్మిదిన విజయ గణపతిగా దర్శనమిస్తారన్నారు. అలంకారాలను తమిళనాడుకు చెందిన ప్రముఖ అలంకార విభూషణ సంజీవ్ శిరీష్ చంద్ర నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా చవితి రోజున సహస్ర మోదక పూజ ఉంటుందని తెలిపారు. ఒకటో తేదీన సాయి భజన, పండ్లు కూరగాయలతో వినాయకుని అలంకరణ పోటీ, రెండున వెయ్యి చెరుకుగడలతో స్వామివారికి విశేష పూజ, మామిడి తోరణాలతో అలంకరణ పోటీ, వీణావాద్యం తదితర కార్యక్రమాలుంటాయని చెప్పారు. మూడున సహస్రగాళార్చన, నాలుగున మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిళ్వార్చన, ఐదున సహస్రనామ పారాయణం, సిరిధాన్యాలతో వంటల పోటీలు, ఆరున 108 సార్లు హనుమాన్‌చాలీసా పారాయణం, ఏడున సిద్ధిబుద్ధి సమేత స్వామివారి కల్యాణం, కలశాల అలంకరణ పోటీ, ఎనిమిదిన ఊంజల సేవ, శయన గణపతి అలంకరణపోటీ, తొమ్మిదిన పూర్ణాహుతి, కోలాట పోటీలు పదిన గణపతి నగరోత్సవం, 11న అన్నదానం ఉంటాయని వివరించారు. ప్రధానంగా విద్యార్థులకు పుస్తకాల పంపిణీ, పలు పోటీలు ఉంటాయన్నారు. మామిడి లక్ష్మీ వెంకటకృష్ణారావు, మండేపూడి వేణుగోపాలరావు, కారమూడి నాగ వెంకటేశ్వరరావు, ఎంవీ ప్రసాద్, రాయుడు శ్రీనివాస్, సుధాకర్, గ్రంధి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కొండచరియ విరిగిపడి దెబ్బతిన్న ఇల్లు



కొండ రాయిపడి దెబ్బతిన్న ఇంటిని పరిశీలిస్తున్న హయాత్ షరీఫ్, సచివాలయ సిబ్బంది

భవానీపురం(విజయవాడ పశ్చిమ):విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని గుప్తాసెంటర్ ఎదురుగాగల మీరా సాహెబ్ వీధిలో కొండపైనుంచి పెద్ద బండ రాయి జారి కింద ఉన్న రేకుల షెడ్‌పై పడటంతో ఆ ఇల్లు దెబ్బ తింది. కేతు ఉమాశంకర్ రెడ్డి, పుష్పలత దంపతులు తమ ఇద్దరు కుమార్తెలతో కలిసి కొండపై 1-3/12-12 డోర్‌నెంబర్‌గల రేకుల షెడ్‌లో నివసిస్తున్నారు. తెల్లవారు జామున కురిసిన వర్షానికి సుమారు 5.30 గంటల సమయంలో కొండపై నుంచి జారిపడిన పెద్ద రాయి వారు ఉంటున్న ఇంట్లోని వంటగదిపై పడింది. దీంతో షెడ్‌పై రేకులు పగిలిపోయి తలుపు విరిగిపోయింది. వంట గదిలోగల వంట సామాను, ఇతర సామగ్రి, గోడ దెబ్బతిన్నాయి. ఆ సమయంలో ఉమాశంకరరెడ్డి పనికి వెళ్లిపోగా అప్పటి వరకు వంటగదిలోనే ఉన్న పుష్పలత ప్రమాదం జరిగే కొద్ది నిమిషాలకు ముందే బయటకు రావడంతో అదృష్టవశాత్తు ఎవరికీ ఏమీకాలేదు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ హయాత్ షరీఫ్ 159వ సచివాలయం అడ్మిన్ లక్ష్మణ్, వీఆర్‌ఓ శివాజీ, ప్లానింగ్ సెక్రటరీ అమలేశ్వరరావుతో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్న హయాత్ షరీఫ్ వారికి ఆర్థిక సహాయాన్ని అందచేశారు.

స్పందన అర్జీలను సత్వరమే పరిష్కరించాలి



మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు సమస్యలు వివరిస్తున్న అర్జీదారులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ):ప్రజా సమస్యల పరిష్కారం దిశగా సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రజల నుంచి 31 అర్జీలను స్వీకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని పలు ఆదేశాలు ఇచ్చారు. నగర పాలక సంస్థ ద్వారా కల్పిస్తున్న మౌలిక సదుపాయాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆయా సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అర్జీలలో అదనపు కమిషనర్ (జనరల్)కు సంబంధించి 2, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 12, ఇంజినీరింగ్ విభాగం - 4, పబ్లిక్ హెల్త్ విభాగం - 7, ఎస్టేట్ - 1, అకౌంట్స్ విభాగం - 2, రెవెన్యూ - 3 ఉన్నాయి. అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) కేవీ సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, సిటీ ప్లానర్ జీవీజీఎస్వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.రత్నావళి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డి. వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) శకుంతల, ఏడీహెచ్ శ్రీనివాస్, బయాలజిస్ట్ డాక్టర్ బాబు శ్రీనివాసన్ ఇతర అధికారులు పాల్గొన్నారు. జోనల్ కమిషనర్లు నిర్వహించిన స్పందనలో సర్కిల్ -2 పరిధిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 1, సర్కిల్ - 3 కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 1 అర్జీ రాగా సర్కిల్ - 1 పరిధిలో ప్రజల నుంచి ఎటువంటి అర్జీలు రాలేదని ఆయా సర్కిల్స్ జోనల్ కమిషనర్లు తెలిపారు.

రోడ్లపై నీరు నిలవకుండా చర్యలు



పాత రాజరాజేశ్వరిపేటలో పర్యటిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడ పశ్చిమ):మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం 56వ డివిజన్ పాత రాజరాజేశ్వరి పేటలో పర్యటించారు. తెల్లవారు జామున కురిసిన వర్షపు నీరు కాలువల ద్వారా ప్రవహించకుండా రోడ్లపైనే నిల్వ ఉండటం గమనించిన వారు సంబంధిత అధికారులను అప్రమత్తం చేశారు. ప్రధానంగా ఇంజినీరింగ్, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళి విభాగం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి రోడ్లపై వర్షపు నీరు నిల్వకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి మ్యాన్‌హోల్, కల్వర్ట్ మూతలు తీసి శుభ్రపరిచి మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణకు అవరోధంగా కాలువలపై ఆక్రమణలను తొలగించాలన్నారు. డ్రెయిన్స్‌లో పూర్తి స్థాయిలో సిల్ట్ తొలగించటం, కాలువల్లో చెత్త, వ్యర్థ పదార్థాలు పడకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నారాయణమూర్తి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ ఇక్బాల్ హుస్సేన్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేత్రదానం మహోన్నతమైనది

హెల్త్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్



ప్రదర్శన ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ శ్యామ్‌ప్రసాద్, పక్కన డాక్టర్ జి సమరం, రశ్మి తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేత్రదానం మహోన్నతమైందని, మరణించిన తర్వాత కూడా చేయగల గొప్పదానం నేత్రదానమేనని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వేచ్ఛాగోరా ఐ బ్యాంక్ ఆధ్వర్యంలో నేత్రదాన ప్రచార పక్షోత్సవాల్లో భాగంగా వాసవ్య మహిళా మండలి కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన నేత్రదాన అవగాహన ప్రదర్శనశాలను సోమవారం వీసీ డాక్టర్ పి.శ్యామ్‌ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశంలో నేత్రదానంపై అవగాహన లేక చాలా కొద్దిమందే నేత్రాలను దానం చేస్తున్నారన్నారు. చిన్నదేశమైన శ్రీలంక నేత్రదానంలో ముందున్నట్లు తెలిపారు. దాదాపు 40 దేశాలకు నేత్రాలను అందచేస్తూ తనలోని మానవత్వాన్ని చాటుకుంటుందన్నారు. మనదేశంలో నేత్రదానంతో చూపు వచ్చే అంధులు 30 లక్షల మంది ఉన్నారని చెప్పారు. కానీ నేత్రదానం చేసేవాళ్లు 25 వేలు మంది మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. అందుకు అవగాహన రాహిత్యమే కారణమన్నారు. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి కట్టుగా కృషి చేస్తే అంధత్వాన్ని నిర్మూలించడం అతి సులువైన విషయం అన్నారు. స్వేచ్ఛా గోరా ఐ బ్యాంక్ 25 ఏళ్లలో 900 మందికి చూపుని ప్రసాదించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఐ బ్యాంక్ డైరెక్టర్ డాక్టర్ జి.సమరం, రశ్మి, నియంత, రవి తదితరులు పాల్గొన్నారు.

బంగారపు వస్తువులు చోరీ

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): ఓ ఇంట్లో బంగారం, వెండి వస్తువులు చోరీకి గురైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. కొత్తపేట సుబ్రహ్మణ్య స్వామి వారి దేవస్థాన మెట్ల ప్రాంతానికి చెందిన పెళ్ళూరి వెంకట శివనాగరాజుకు 15 రోజుల కిందట గొల్లపాలెంగట్టు ప్రాంతానికి చెందిన యువతితో వివాహమైంది. నాగరాజు వీజీ చౌక్‌లోని ఓ మెడికల్ షాపులో పని చేస్తుంటాడు. ఆదివారం రాత్రి నాగరాజు తన భార్యను తీసుకుని సినిమాకు వెళ్లాడు. సినిమా అయిన తర్వాత భార్యను పుట్టింటిలో దించి వచ్చాడు. ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో లోపలకు వెళ్లి చూడగా బీరువాలో ఉంచిన చెవిజోడు, కళ్యాణపు ఉంగరంతో పాటు కాలి చుట్టలు కనిపించలేదు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ద్విచక్రవాహనం చోరీపై కేసు

చిట్టినగర్: కొత్త మసీదు ప్రాంతానికి చెందిన వీరప్ప ఈ నెల 23వ తేదీన బయటకు వెళ్లి వచ్చిన తర్వాత తన వాహనాన్ని ఇంటి ముందు పెట్టి తాళం వేశాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నగరాభివృద్ధే లక్ష్యంగా చర్యలు



స్థాయీ సంఘ సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి, కమిటీ సభ్యులు, అధికారులు

భవానీపురం(విజయవాడ పశ్చిమ): నగరాభివృద్ధే లక్ష్యంగా తగిన చర్యలు తీసుకుంటున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. మేయర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్థాయీ సంఘం సమావేశం నిర్వహించారు. చర్చకు అజెండాలో మొత్తం 32 అంశాలు రాగా అందులో మూడు అంశాలను వాయిదా వేశారు. 18 అంశాలను ఆమోదిస్తూ తీర్మానం చేయగా ఒక అంశాన్ని రికార్డ్, ఒక అంశాని ధ్రువీకరిస్తూ తీర్మానించా. కమిటీ సభ్యులు యరడ్ల ఆంజనేయరెడ్డి, కుక్కల అనిత, బలసాని మణిమ్మ, ఉమ్మడి రమాదేవి, వీఎంసీ అడిషనల్ కమిషనర్లు కేవీ సత్యవతి (ప్రాజెక్ట్), శ్యామల (జనరల్), సీఈ ప్రభాకరరావు, ఎస్టేట్ అధికారి అంబేడ్కర్, సిటీ ప్లానర్ జీవీజీఎస్ ప్రసాద్, ఇన్‌చార్జ్ సీఎంఓహెచ్ డాక్టర్ బాబూ శ్రీనివాసన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అజెండాలోని ప్రధాన అంశాలు...

- సర్కిల్ - పరిధిలోని కెఎల్‌రావు నగర్ 46వ డివిజన్‌లోగల కెఎల్‌రావు పార్క్ పునఃనిర్మాణం, అభివృద్ధి పరచటంలో భాగంగా క్రికెట్, టెన్నీస్ ఆటల ప్రాక్టీస్‌కు నెట్ కోర్ట్‌ను, పార్క్‌కు ఆగ్నేయంగా వైపున్న ఖాళీ ప్రదేశంలో ఏర్పాటు చేసేందుకు మేయర్ ఆదేశించగా రూ.34.50 లక్షల అంచనాలను తయారుచేసి ఆ మొత్తాన్ని సాధారణ నిధుల నుంచి మంజూరు చేసేందుకు వచ్చిన ప్రతిపాదనకు ఆమోదం తెలిపారు.
- 58వ డివిజన్ ఎంబీపీ స్టేడియంలో ఇండోర్ షటిల్ కోర్ట్ ఉడెన్ ఫ్లోరింగ్ మొత్తం పాడైపోయి ఆటకు పనికిరాని స్థితిలో ఉన్నందున, దానిని అభివృద్ధి చేయాలని డెప్యూటీ మేయర్ అవుతు శైలజా రెడ్డి చేసిన ప్రతిపాదనకు రూ.36.30 లక్షల ఖర్చు చేసేందుకు ఆమోదం తెలిపారు.
- సెంట్రల్ నియోజకవర్గం 57వ డివిజన్‌లోని న్యూ ఆర్ ఆర్‌పేట 3వ క్రాస్‌లో కచ్చా రోడ్లలో పక్కా రోడ్ల నిర్మాణం చేయాలని స్థానిక ఎమ్మెల్యే మల్లాది విష్ణు చేసినప్రతిపాదనపై రూ.49.80 లక్షల వ్యయంతో రోడ్లు అభివృద్ధి చేసేందుకు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు.

సంగీత వైభవాన్ని చాటిన గాత్ర కచేరి



గాత్ర సంగీత కచేరీ నిర్వహిస్తున్న అనూష

విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు లంకా వెంకటేశ్వర్లు సంస్మరణోత్సవాల సందర్భంగా లయనాద కళా ప్రవంతి ఆధ్వర్యంలో శివరామ కృష్ణ క్షేత్ర సముదాయంలో ఐదు రోజులపాటు నిర్వహించే సంగీతోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అనూష గాత్ర సభతో ఉత్సవాలు మొదలయ్యాయి. సంగీత త్రిమూర్తులు ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి, భక్తా గ్రేసులు రామదాసు, పురందర దాసు కీర్తనలను కళాకారులు భక్తిగా గానం చేశారు. ఎస్. సాత్విక, కె.భువనేశ్వరి గాత్ర యుగళం, టి. కృష్ణ ప్రియ లంకతేజస్విని కచేరిలో పలు సంప్రదాయ కీర్తనలు చోటు చేసుకున్నాయి. సుబ్రహ్మణ్య రాజు, కె.అరవింద్, ఎ.కామాక్షి వాద్య సహకారం అందించారు. నిర్వాహకురాలు ఎల్. మాధవి మాట్లాడుతూ వయొలిన్, గాత్ర సంగీత విద్వాంసులు లంకా వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

నేడు ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు(జనరల్, ఒకేషనల్) మంగళవారం ఉదయం 11 గంటలకు విడుదల కానున్నాయి. హెచ్‌టీటీపీఎస్://ఎడ్యుకేషన్.సాక్షి.కామ్, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఐఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్‌లలో ఫలితాలను చూసుకోవచ్చు.

వాటర్‌షెడ్ల నిర్మాణంపై కేంద్ర అదనపు కార్యదర్శి సమీక్ష

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 59 మండలాల్లో రూ.555 కోట్ల వ్యయంతో చేపడుతున్న వాటర్‌షెడ్ల నిర్మాణంపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కార్యదర్శి హుకుంసింగ్ సోమవారం ఏపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు రోజుల రాష్ట్ర పర్యటనకు వచ్చిన ఆయన తాడేపల్లిలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ ముఖ్య కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది, కమిషనర్ కోన శశిధర్, వాటర్‌షెడ్ విభాగం డైరెక్టర్ పీపీఆర్ఎం రెడ్డితో సమావేశమై పనుల పురోగతిపై చర్చించారు. రాష్ట్రంలో ఆరు లక్షల బీడు భూములను కొత్తగా సాగులోకి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి నిధులతో ఈ వాటర్ షెడ్ల నిర్మాణాన్ని చేపడుతున్నారు.

నారాయణ ఎన్‌శాట్ స్కాలర్‌షిప్ పోస్టర్ విడుదల

సాక్షి, హైదరాబాద్: దేశ అతిపెద్ద టాలెంట్ హంట్ ఎగ్జామ్.. ఎన్‌శాట్ (నారాయణ స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్) 18వ ఎడిషన్ పోస్టర్‌ను నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ కె.పునీత్ ఆవిష్కరించారు. 1వ తరగతి నుంచి 12వ తరగతి మధ్య చదువుతూ ఆర్థిక వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు నారాయణ కోచింగ్ సెంటర్ ఈ స్కాలర్‌షిప్ ఎగ్జామ్‌ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ పరీక్షను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో నిర్వహిస్తారు. విద్యార్థులు తమ పేర్లు www. nsat. narayanagroup. com లేదా ఏదైనా నారాయణ కోచింగ్ సెంటర్‌లో నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్ పరీక్షను అక్టోబర్ 26 నుంచి 30 వరకు, నవంబర్ 2 నుంచి 6 వరకు నిర్వహిస్తారు. ఈ పరీక్షలో ఎంపికైన మొదటి 5 అగ్రశ్రేణి విద్యార్థులకు ఉచితంగా నాసాను సందర్శించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నారాయణ కోచింగ్ సెంటర్ డైరెక్టర్స్ సింధూర నారాయణ, శరణి నారాయణ పాల్గొన్నారు.

గెజిటెడ్, నాన్‌గెజిటెడ్ పరీక్షల తేదీలు ఇవే..

ప్రకటించిన ఏపీపీఎస్సీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో వివిధ విభాగాల్లోని పోస్టుల భర్తీకి విడుదల చేసిన నోటిఫికేషన్లకు సంబంధించి పరీక్షల నిర్వహణ తేదీలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) సోమవారం ప్రకటించింది. ఈమేరకు కమిషన్ కార్యదర్శి హెచ్.అరుణ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. జనరల్ స్టడీస్ మెంటల్ ఎబిలిటీ (జీఎస్ఎంఏ) పరీక్ష, సబ్జెక్టు పేపర్ల పరీక్షలకు వేర్వేరు తేదీలను ప్రకటించారు. షెడ్యూళ్లను కమిషన్ వెబ్‌సైట్లో ఉంచారు. తెలుగు రిపోర్టర్ ఏపీ లెజిస్లేచర్ పోస్టులకు పరీక్షను విజయవాడలో మాత్రమే నిర్వహించనున్నారు.

పరీక్షల తేదీల వివరాలు

పోస్టు	జీఎస్ఎంఏ	సబ్జెక్టుపేపర్లు
గెజిటెడ్ పోస్టులు		
ఫిషరీస్ డెవలప్‌మెంటు ఆఫీసర్	అక్టోబర్ 21	అక్టోబర్ 19
సెరికల్చర్ ఆఫీసర్	అక్టోబర్ 21	అక్టోబర్ 20
అగ్రికల్చర్ ఆఫీసర్	అక్టోబర్ 21	అక్టోబర్ 21
డివిజనల్ అకౌంట్సు ఆఫీసర్	నవంబర్ 7	నవంబర్ 3
టెక్నికల్ అసిస్టెంటు ఏపీ పోలీసు సర్వీస్	అక్టోబర్ 21	అక్టోబర్ 21
ఎండోమెంటు అసిస్టెంటు కమిషనర్	అక్టోబర్ 21	అక్టోబర్ 19
హార్టికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్	అక్టోబర్ 21	అక్టోబర్ 20
సర్వే ల్యాండ్ రికార్డ్సు అసిస్టెంట్ డైరెక్టర్	అక్టోబర్ 21	అక్టోబర్ 21 .
నాన్ గెజిటెడ్ పోస్టులు		
అసిస్టెంట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్	నవంబర్ 7	నవంబర్ 4
అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్	నవంబర్ 7	నవంబర్ 4
ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్	అక్టోబర్ 21	అక్టోబర్ 19
గ్రేడ్–2 హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, ఉమెన్	నవంబర్ 7	నవంబర్ 5
తెలుగు రిపోర్టర్ ఏపీ లెజిస్లేచర్	నవంబర్ 7	నవంబర్ 5
జిల్లా పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్	నవంబర్ 7	నవంబర్ 6
గ్రేడ్–1 ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్, స్త్రీశిశు సంక్షేమం	నవంబర్ 7	నవంబర్ 7
అసిస్టెంట్ కన్జర్వేటర్	నవంబర్ 9	నవంబర్ 9, 10, 11

దేవుడితో ఆటలొద్దు

ప్రతిపక్షాలపై దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ధ్వజం



సాక్షి, అమరావతి: వినాయక చవితి వేడుకలు, ఇతర సమయాల్లో ప్రతిపక్ష పార్టీలు భగవంతుడి పేరుతో రాజకీయాలు, అసత్య ప్రచారాలను మానుకోవాలని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చవితి ఉత్సవాలపై అసత్య ప్రచారం చేస్తున్న విపక్షాల వైఖరిపై మండిపడ్డారు. వారు చేస్తున్న దుష్ప్రచారం భగవంతుడిపై చేస్తున్నారని గుర్తుపెట్టుకోవాలని హితవు పలికారు. దేవుడితో ఆటలొద్దని హెచ్చరించారు. భగవంతునికి ఆగ్రహం వస్తే ఏమి జరుగుతుందో తెలుసుకోవాలని అన్నారు. గణేష్ మండపాల ఏర్పాటులో ప్రభుత్వం కొత్తగా ఎలాంటి నిబంధనలు పెట్టలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉన్న నిబంధనలే ఇప్పుడూ ఉన్నాయన్నారు. కాగా అన్ని ప్రధాన అమ్మవారి దేవాలయాల్లో దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పలు ఆలయాల ఈవోలు, డిప్యూటీ, అసిస్టెంట్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడారు. ఆలయాల్లో ఏర్పాట్లు, ప్రత్యేక కార్యక్రమాలపై ఆరా తీశారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ కమిషనర్ హరి జవహర్‌లాల్ పాల్గొన్నారు.

చవితి పండుగపై ఏ ఆంక్షలూ లేవు

- గుళ్లు కూల్చే వారికి దేవుడి గురించి మాట్లాడే అర్హత లేదు
- మండపాలకు అనుమతులు గతంలో కంటే సులభతరం చేశాం
- గతంలో నాలుగు శాఖల పర్మిషన్ తీసుకోవాల్సి వచ్చేది
- ప్రస్తుత ప్రభుత్వం సింగిల్ విండో విధానం తెచ్చింది
- చీకట్లో ఆలయాలు కూల్చిన నీచ సంస్కృతి ప్రతిపక్షాలది
- మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్



సాక్షి, అమరావతి: వినాయక చవితి నిర్వహణపై ప్రభుత్వం ఏ ఆంక్షలూ విధించలేదని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ స్పష్టంచేశారు. పైగా, గణేష్ మండపాల అనుమతిని సులభతరం చేశామని తెలిపారు. గతంలో అగ్నిమాపక, పోలీసు, విద్యుత్ శాఖలు, మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అనుమతి కోసం వేర్వేరుగా దరఖాస్తు చేయాల్సి వచ్చేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక సింగిల్ విండో విధానాన్ని తెచ్చిందని తెలిపారు. మండపాల రుసుము ఒక్క రూపాయి కూడా పెంచలేదన్నారు. గత ప్రభుత్వ నిబంధనలే అమలు చేస్తున్నామని చెప్పారు. పైగా గత టీడీపీ ప్రభుత్వంలో 250 వాట్స్ వరకు విద్యుత్ వినియోగానికి రూ.1,000 చెల్లించాల్సి వచ్చేదని, ఇప్పుడు దాన్ని రూ.500కు తగ్గించామని చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. వినాయక చవితిపై ప్రభుత్వం నిబంధనలు విధించిందంటూ టీడీపీ ఆఫీసు నుంచి సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని పోస్టు చేస్తున్నారని చెప్పారు. వాటన్నింటిపై దేవదాయ శాఖ మంత్రి, డీజీపీ, అధికారులు కూడా వివరణ ఇచ్చారని తెలిపారు. అయినా సోము వీర్రాజు, టీడీపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని చెప్పారు. టీడీపీ ఆఫీస్ స్క్రిప్టును సోము వీర్రాజు, ఇతర బీజేపీ నేతలు మాట్లాడటం దుర్మార్గమన్నారు. దేవుడి పేరుతో రాజకీయం చేస్తే పుట్టగతులుండవని హెచ్చరించారు. చీకట్లో ఆలయాలను ధ్వంసం చేసిన నీచ చరిత్ర ఆనాటి టీడీపీ, బీజేపీ, జనసేన మిత్రపక్షానిదని అన్నారు. ఆలయాలు కూల్చి, విగ్రహాలను ధ్వంసం చేసి, రథాలు తగులబెట్టే వారికి దేవుడి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. పార్టీల నేతలకు చెప్పారు.

నిందలు మానాలి

ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో విపక్షాలకు దిక్కుతోచడం లేదని చెప్పారు. అసలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇలాంటి పథకాలు ఏమైనా అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. సోము వీర్రాజు వాస్తవాలు గ్రహించి, ప్రభుత్వంపై నిందలు మానాలని చెప్పారు. కులం, మతం, వర్గం, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న సీఎం జగన్‌ను ఒక మతానికి పరిమితం చేయొద్దని కోరారు.

రేపటి నుంచి వినాయక బ్రహ్మోత్సవాలు

సెప్టెంబర్ 20 వరకు నిర్వహణ



కాణిపాకం (యాదమరి): ప్రథమ పూజ్యుడైన గణనాథుని బ్రహ్మోత్సవాలకు కాణిపాకం క్షేత్రం సర్వం సిద్ధమవుతోంది. ఆగస్టు 31వ తేదీ బుధవారం నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారు సిద్ధి, బుద్ధి సమేతంగా వివిధ వాహనాలలో విహరిస్తూ భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. సత్యప్రమాణాల దేవుడైన వినాయకుడిని దర్శించుకోవడానికి రాష్ట్రం నలుమూలలతోపాటు కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి రానున్నారు. వారికి అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా రామ్మోహనరావు

- మరోసారి అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ
- కార్యదర్శిగా నజీర్ అహ్మద్

సాక్షి, అమరావతి/వైవీయూ:ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా ప్రొఫెసర్ కె.రామ్మోహనరావుకు మరోసారి (సెకండ్ టర్మ్) అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు జీవో 34ను విడుదల చేశారు. ఈయన పదవీ కాలం మరో మూడేళ్ల పాటు కొనసాగుతుందని ఆ ఉత్తర్వులలో పేర్కొన్నారు. కాగా, కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో ఫిజిక్స్ ప్రొఫెసర్ వై.నజీర్ అహ్మద్‌ను ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు మండలికి లేఖ రాశారు. ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా ఇప్పటివరకు బాధ్యతలు నిర్వర్తించిన బి.సుధీర్ ప్రేమ్‌కుమార్ స్థానంలో నజీర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

అర్హులందరికీ విదేశీవిద్యకు ఆర్థికసాయం

- జగనన్న విదేశీవిద్యకు మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- దరఖాస్తు గడువు సెప్టెంబర్ 30
- అధికారులతో మంత్రి నాగార్జున సమీక్ష



సాక్షి, అమరావతి: జగనన్న విదేశీవిద్య పథకానికి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం ఆర్థికసాయాన్ని అందిస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున చెప్పారు. జగనన్న విదేశీవిద్య పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియ మొదలైన నేపథ్యంలో ఆయన సోమవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విదేశీవిద్య పథకంలో ఏడాదికి ఇంతమందికే ఇవ్వాలన్న పరిమితి లేదని స్పష్టం చేశారు. అర్హులైన విద్యార్థులు సెప్టెంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటుగా అల్పాదాయం కలిగిన అగ్రవర్ణాల వారికి కూడా విదేశీవిద్యను అందుబాటులోకి తెస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని తీసుకొచ్చారని తెలిపారు. ఈ పథకానికి జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు చెప్పారు. రూ.8 లక్షలలోపు వార్షికాదాయం కలిగిన కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఈ పథకంలో లబ్ధిపొందడానికి అర్హులేనని పేర్కొన్నారు. ఆయా కేటగిరీల దరఖాస్తులను రాష్ట్రస్థాయి అధికారిక కమిటీలు పరిశీలించి వాటిలో అర్హులైన విద్యార్థుల జాబితాను తమ శాఖకు ఇస్తాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లలో శిక్షణపొందే వారికి మెరుగైన శిక్షణ అందేలా చూడాలని అధికారుల్ని ఆదేశించారు. స్టడీ సర్కిళ్లకు పూర్వ వైభవం తీసుకురావాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ ఇన్‌చార్జి కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్, డైరెక్టర్ కె.హర్షవర్ధన్, జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు, డిప్యూటీ సెక్రటరీ ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

అన్నం పెట్టే రైతుకు కష్టం రాకుండా చూడండి



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా చిత్రంలో జేసీ మహేష్‌కుమార్ తదితరులు



సమావేశానికి హాజరైన సభ్యులు, అధికారులు

కృష్ణాజిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): దేశానికి అన్నం పెట్టే రైతుకు ఎలాంటి కష్టం రాకుండా, వారికి ఎదురయ్యే సమస్యలను వెంటనే పరిష్కరించాలని కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎదురయ్యే సమస్యలను అధికారులు వెంటనే స్పందించి పరిష్కారం చూపాలన్నారు. పురుగు మందులు, ఎరువులు, సీజన్‌కు అవసరమైన వరి వంగడాలు, ఎలుకల నివారణ, నీటి యాజమాన్య పద్ధతులపై ర్యాలీలు, మైక్‌లతో ప్రచారం చేసి కరపత్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రైవేటు వ్యాపారులు అంటగట్టే నాసిరకం ఎరువులు, పురుగు మందులను రైతులు వాడవద్దన్నారు. అవి ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో అన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. 1318 వరి వంగడం సాగు చేసిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ–క్రాప్‌లో ఆ రకానికి అవకాశం కల్పిస్తున్నామన్నారు. నమోదు సమయంలో సిబ్బందికి ఎదురయ్యే సమస్యలను అధికారులు గుర్తించాలని ఆ సమస్యలను ప్రభుత్వానికి నివేదించటం జరుగుతుందన్నారు. మండల స్థాయిలో నిర్వహించే సమావేశాలకు ఆయాశాఖల ఏడీలు తప్పనిసరిగా హాజరై రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. అక్కడ పరిష్కారం కానివి జిల్లా స్థాయిలో జరిగే సమావేశంలో చర్చించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. రైతులకు రుణాలు, సీసీఆర్‌సీ కార్డులు మంజూరు, పంట బీమాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యవసాయశాఖ ద్వారా ముద్రించిన సామూహిక ఎలుకల నివారణ విధానాలపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మహేష్‌కుమార్ రావిరాల, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ జన్ను రాఘవరావు, వ్యవసాయశాఖ అధికారి మనోహరరావు, పశుసంవర్ధకశాఖ అధికారి చంద్రశేఖరరావు, ఉద్యానశాఖ అధికారి జె.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జైనుల శోభాయాత్ర



జైన గురువు శ్రీమత్ విజయతీర్థభద్ర సురీశ్వరకు స్వాగతం పలుకుతున్న జైన ప్రముఖులు

వన్‌టౌన్ (విజయవాడ పశ్చిమ): పర్యూషన్ పర్వదినాలను పురస్కరించుకొని సోమవారం విజయవాడ నగరంలోని జైనులు నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా జరిగింది. మహావీర్ భగవానుని స్మరించుకుంటూ జైనులు శోభాయాత్రలో పాల్గొన్నారు. శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘ్ ఆధ్వర్యంలో ఈ యాత్రను నిర్వహించారు. గుర్రపు బగ్గీని పూలతో అలంకరించి, అందులో మహావీరుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఊరేగించారు. అధిక రోజులు ఉపవాస దీక్షలు పాటించిన కుటుంబాలను గుర్రపు బగ్గీలలో ఊరేగించారు. ఎనిమిది రోజుల పాటు ఉపవాస దీక్షలను ఆచరించిన వారిని ఊరేగింపుగా ఆలయానికి తీసుకువెళ్లారు. దానికి ముందు జైనులు మహావీరుని స్మరించుకుంటూ భజనలు చేస్తూ ముందుకు సాగారు. సంకీర్తనలతో నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వన్‌టౌన్‌లోని జైనులు తమ ఇళ్ల ఎదుటకు వచ్చిన మహావీరునికి వారివారి సంప్రదాయ పద్ధతిలో నేలపై పీఠను ఉంచి బియ్యంతో మహావీరుని మంత్రాన్ని రాస్తూ ఎదురు చల్లుతూ స్వాగతం పలికారు. అలాగే శోభాయాత్ర ముందుకు సాగుతుండగా ఆయా ప్రాంతాల్లోని జైనులు తమ ఇళ్ల ముందుకు వచ్చిన వారికి మంచి నీటిని, శీతల పానీయాలను అందజేసి దాహార్తిని తీర్చారు.

ఆకలి విలువ తెలిపే ఉపవాసం..

ఉపవాస దీక్షలతో మానవులు సంస్కరించబడతారని ప్రముఖ జైనగురువు శ్రీమత్ విజయతీర్థ భద్ర సురీశ్వరజీ అన్నారు. దీక్షల ముగింపు సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్న ఆయన ఆకలి దప్పికల విలువ తెలియటంతో పాటుగా మనస్సును భగవంతునిపై లగ్నం చేయటానికి ఉపవాసం ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ బోడోతరియా, ఉపాధ్యక్షుడు అశోక్ జైన్, జయంతిలాల్ జైన్, కార్యదర్శి పన్నాలాల్ జైన్, సహాయ కార్యదర్శి భోగిలాల్ జైన్, కోశాధికారి డుంగరమల్ జైన్, సహకోశాధికారి రాహుల్ జైన్, అధికార ప్రతినిధి ప్రవీణ్ రాంకా తదితరులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఇన్‌స్పైర్ మనాక్‌లో ఉమ్మడి కృష్ణా విద్యార్థుల ప్రతిభ

జాతీయ స్థాయికి ఆరు ప్రాజెక్టులు



జాతీయ స్థాయికి ఎంపికైన కాటూరు జడ్పీ స్కూల్ విద్యార్థిని బేబీ జాహ్నవి తయారు చేసిన ప్రాజెక్టు

మచిలీపట్నం: ఇన్‌స్పైర్ మనాక్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు సంబంధించి ఆరు ప్రాజెక్టులు ఎంపికయ్యాయి. ఈ మేరకు జాతీయ ఇన్నోవేషన్ టెక్నాలజీ అధికారులు జిల్లా విద్యాశాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. సైన్సులో సరికొత్త పరిశోధనలు ఆవిష్కరించేలా ప్రతి ఏటా ఇన్‌స్పైర్ మనాక్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో విజయవాడ వేదికగా జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు జరిగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఆరు ప్రాజెక్టులను కేంద్ర అధికారులు ఎంపిక చేశారు. తొమ్మిదవ జాతీయ స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శన వచ్చే నెల 14 నుంచి 16 వరకు ఢిల్లీలో జరుగుతుంది. ఈ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన ఆరు ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులు పాల్గొనేందుకు అవకాశం దక్కింది.

ఎంపికైన విద్యార్థులు వీరే..

పెదపారుపూడి మండలం నుంచి ఎస్ గౌతమ్ సాయి, ఉయ్యూరు మండలం నుంచి కాటూరు జడ్పీ విద్యార్థినీ గుజ్జుల బేబీ జాహ్నవి, తిరువూరు సెయింట్ ఆన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థి జీడిమళ్ల కృష్ణ నిఖిల్, చంద్రనిఖిల్ ఎంపికయ్యారు. అదే విధంగా చందర్లపాడు మండలం ఎస్సీకేఎం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పి.మనోజ్ కృష్ణ, గంపలగూడెం మండలం కేజీబీవీ నుంచి కోట విజయసాయి, రామేశ్వరి తయారు చేసిన ప్రాజెక్టులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. ఉమ్మడి కృష్ణా జిల్లా నుంచి ఆరు ప్రాజెక్టులు ఎంపిక కావటం పట్ల కృష్ణా జిల్లా డీఈవో, ఉమ్మడి కృష్ణా నోడల్ అధికారి తాహెరా సుల్తానా ఆనందం వ్యక్తం చేశారు. ఆయా విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

దివిసీమకు క్రీడాహబ్‌గా గుర్తింపు తేవాలి

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, డీఈవో తాహెరా సుల్తానా
- ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం
- అవనిగడ్డలో భారీ జాతీయ పతాకం ఆవిష్కరణ



భారీ జాతీయ పతాకంతో విద్యార్థులు ర్యాలీ



క్రీడాజ్యోతితో ఎమ్మెల్యే సింహాద్రి, డీఈవో సుల్తానా



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ: ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఎడ్యుకేషన్ హబ్‌గా పేరు తెచ్చుకున్న అవనిగడ్డలో క్రీడల్లోనూ అదే గుర్తింపు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని సోమవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, డీఈవో కలిసి భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడార్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలు క్రీడల్లో గెలుపొందిన విజేతల బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ జిల్లాల్లో ఏ క్రీడా కార్యక్రమం జరిగినా దివిసీమ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల ప్రాధాన్యత తప్పనిసరిగా ఉంటుందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో విద్యపరంగా గుర్తింపు తెచ్చుకున్న విధంగా క్రీడల్లోనూ గుర్తింపు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత క్రీడాకారుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇలాంటి క్రీడా పోటీలు దోహదపడతాయన్నారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా ప్రతి క్రీడాకారుడు క్రీడల్లో రాణించి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. క్రీడలు, చదువుల్లో రాణిస్తూ జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా రాణించాలని విద్యార్థులకు సూచించారు.

ఆకట్టుకున్న భారీ పతాక ర్యాలీ..

పులిగడ్డ గురుకుల పాఠశాల విద్యార్థులతో 200 అడుగుల జాతీయ పతాకం, అవనిగడ్డలోని పలు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులతో 100 అడుగుల జాతీయ పతాకం, స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో 30 అడుగుల ఆరు జాతీయ పతాకాలతో రెండు వేల మంది విద్యార్థులు నిర్వహించిన భారీ ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. ఎంఈవో ఎన్.శివశంకరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు, డీఎస్పీ మహబూబ్ బాషా, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జడ్పీటీసీ సభ్యుడు చింతలపూడి లక్ష్మీనారాయణ, సర్పంచ్ జి.ఉమ తదితరులు పాల్గొన్నారు.

ఆది దంపతుల అభిషేకాలకు గుజరాత్ గోవు పాలు

ఇంద్రకీలాద్రికి గోమాతలు



దుర్గగుడి ప్రాంగణంలో గుజరాత్‌కు చెందిన గోవులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల అభిషేకాలకు, నివేదనలకు వినియోగించే ఆవుపాలను ఇకపై దేవస్థానమే సమకూర్చుకోనుంది. ఇందు కోసం గుజరాత్‌కు చెందిన గిర్ జాతి గోవులను దేవస్థాన గోశాలలో సంరక్షించి వాటి నుంచి పాలను సేకరించాలని నిర్ణయించారు. సోమవారం గుజరాత్‌కు చెందిన ఐదు గిర్ జాతి ఆవులను అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. గతంలో అమ్మవారి అభిషేకాలు, పూజల కోసం అవసరమైన ఆవు పాలను నగరంలోని పలు ప్రయివేటు డెయిరీల నుంచి దేవస్థానం కొనుగోలు చేసేది. ఇటీవల ఈవో భ్రమరాంబ వైదిక కమిటీ సభ్యులు, స్థానాచార్యతో నిర్వహించిన దసరా ఉత్సవాల ఏర్పాట్ల సమీక్షలో ఆవు పాల విషయం చర్చకు వచ్చింది. దేవస్థానం నిర్వహిస్తున్న గోశాలలో పాలను ఇచ్చే ఆవులను సంరక్షించి వాటి నుంచి పాలను ఎందుకు సేకరించ కూడదని చర్చ సాగడంతో దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఆలయ ఈవో భ్రమరాంబ వైదిక కమిటీకి సూచించారు. దీంతో గుజరాత్‌లోకి ప్రముఖ జాతి ఆవులు రోజుకు 5 నుంచి 7 లీటర్ల పాలను ఇస్తాయని, ఐదు ఆవులను సంరక్షిస్తే వాటి ద్వారా రోజుకు 30 లీటర్లపైగా ఆవుపాలు వచ్చే అవకాశం ఉందని వైదిక కమిటీ పేర్కొంది.

అమ్మవారికి ప్రతి నిత్యం తెల్లవారుజామున జరిగే అభిషేకాలతో పాటు ఖడ్గమాలార్చన, శ్రీచక్రనవార్చనకు మల్లేశ్వర స్వామి వారి అభిషేకాలు నిర్వహిస్తుంటారు. వీటి నిమిత్తం సుమారు 7 నుంచి 9 లీటర్ల పాలు అవసరమవుతాయి. ఇక అమ్మవారికి బాలభోగాలు, మహా నివేదన, నివేదనల నిమిత్తం సిద్ధం చేసే పరమాన్నం(పాల అన్నం), దద్ధ్యోజనం తయారీకి మరో 20 లీటర్ల పాలు అవసరం. ప్రస్తుతం దేవస్థానం వద్ద ఉన్న ఐదు ఆవులతో పూజలు, నివేదనకు అవసరమైన పాలను సేకరించే అవకాశం ఉందని ఆలయ వైదిక కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. గోవులను అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీగణపతి వేదిక వద్ద, రాజగోపురం ఎదుట ఉన్న గోశాలలో ఉంచి వాటి మేత, వాటి సంరక్షణ చూసేందుకు ఇద్దరిని ప్రత్యేకంగా నియమించినట్లు తెలుస్తోంది.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
మంగళవారం
30-8-2022

పేరెంటింగ్

'మా అమ్మ ముగ్గురు పిల్లలను పెంచింది. ముగ్గురం ఐఐటి చదివాం. నాకు ఇద్దరు అమ్మాయిలు. వారిని ఉత్తమమైన సంతానంగా పెంచడానికి ప్రయత్నిస్తున్నాను. పిల్లల్ని పెంచడంలో తల్లిదండ్రులు నేర్చుకోవాల్సిన పాఠాలు ఉన్నాయి. నేను తెలుసుకున్నవి మీకు చెబుతాను. పనికొస్తాయేమో చూడండి' అంటూ ఉత్తర ప్రదేశ్ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ దివ్య మిట్టల్ రాసిన ట్విట్టర్ పోస్టు వైరల్ అయ్యింది. ఇంతకీ ఆమె చెప్పిన పాఠాలు ఏమిటి?

ఐ.ఏ.ఎస్ పెంపకం పాఠాలు


దివ్య మిట్టల్

'మా అమ్మ నుంచి నేను పిల్లల పెంపకం నేర్చుకున్నాను. మా అమ్మ ముగ్గురు పిల్లల్ని పెంచింది. ముగ్గురం ఐ.ఐ.టికి వెళ్లాం. నేను ఐ.ఐ.ఎంలో కూడా చదివాను. ఆ తర్వాత 2013 కేడర్‌లో ఐ.ఏ.ఎస్ అయ్యాను. నా ఇద్దరు తోబుట్టువులు కూడా బాగా సెటిల్ అయ్యారు. ఇదంతా మంచి పెంపకం వల్లే జరిగిందని అనుకుంటున్నాను. నాకు ఇద్దరు అమ్మాయిలు. వారిని నేను బాగా పెంచాలి. మా అమ్మ నుంచి నేర్చుకున్నవి, నాకు నేనై గ్రహించినవి మీకు చెప్తాను. ఉపయోగపడితే చూడండి' అని ఉత్తరప్రదేశ్ ఐ.ఏ.ఎస్ అధికారి దివ్య మిట్టల్ రాసిన ట్విటర్ పోస్టు (వరుస) ఇటీవల కాలంలో దేశంలో ఎక్కువ మంది మెచ్చిన పోస్ట్‌గా గుర్తింపు పొందింది.

ఉత్తరప్రదేశ్‌లోని సంత్ కబీర్ నగర్ జిల్లాకు కలెక్టర్‌గా ఉన్న దివ్య మిట్టల్ అప్పుడప్పుడు ట్విటర్ ద్వారా నలుగురికీ ఉపయోగపడే కిటుకులు, స్ఫూర్తినిచ్చే సందేశాలు ఇస్తుంటుంది. ఇటీవల ఆమె పేరెంటింగ్ గురించి రాసిన పోస్టు కూడా అలాంటిందే. ఆమె నమ్మి చెప్పిన విషయాలు చాలామందికి నచ్చాయి. అయితే వీటితో విభేదించేవాళ్లు ఉండొచ్చు. ఉంటారు కూడా. కాని ఎక్కువ మంది ఇలాగే పెంచాలని భావిస్తారు కాబట్టి దివ్యను మెచ్చుకుంటూ పోస్ట్‌ను వైరల్ చేశారు. దివ్య చెప్పిన పెంపకం పాఠాలు ఇలా ఉన్నాయి.

ఏదైనా చేయగలరు అని చెప్పండి: పిల్లలకు ఆత్మవిశ్వాసం ముఖ్యం. చిన్నప్పటి నుంచి నువ్వు ఏదైనా చేయగలవు అనే భావన వారిలో కల్పించాలి. నిన్ను నువ్వు నమ్ము అని తల్లిదండ్రులు పిల్లలకు తరచూ చెప్పాలి. ఆత్మవిశ్వాసమే వారిని లక్ష్యాన్ని నిర్ణయించుకోవడంలో చేరుకోవడంలో సాయం చేయగలదు.

పడనివ్వండి పర్వాలేదు: పిల్లలకు చిన్న నొప్పి కూడా కలగకుండా పెంచాలని చూడొచ్చు. జీవితం పూలపాన్పు కాదు. పరిష్కార పత్రాలతో అది సమస్యలను తేదు. పడి లేచి అందరూ ముందుకెళ్లాల్సిందే. అందుకే పిల్లల్ని బాగా ఆడనివ్వండి. పడనివ్వండి. లేవనివ్వండి. వాళ్లు పడగానే పరిగెత్తి పోకండి. విఫలమైనప్పుడు లేవడం వారికి తెలియాలి. లేచాక సరే.. పద అని వారితో పాటు ముందుకు పదండి.

పోటీ పడాలి: వాళ్లను రకరకాల పోటీలలో పాల్గొనేలా చేయండి. గెలవడానికి మాత్రమే కాదు. ఓటమితో తగినంత పరిచయం ఏర్పడటానికి, ఓటమి కూడా ఉంటుందని తెలియడానికి వారు పాల్గొనాలి. ఓటమి కంటే ఓడిపోతామనే భయం ఎక్కువ ప్రమాదకరమైనది. ఓడినా పర్వాలేదు... పోటీ పడాలి అనేది నేర్పించాలంటే ఈ పని తప్పనిసరి.

రిస్క్ కూడా ముఖ్యమే: పిల్లలు రిస్క్ తీసుకోవడానికి ఇష్టపడతారు. అలాంటి సమయాలలో తప్పనిసరి పర్యవేక్షణ చేయండి. అంతే తప్ప అసలు రిస్కే వద్దు అనేలా ఉండొద్దు. అడ్వంచర్ స్పోర్ట్స్ ఆడతానంటే ఆడనివ్వండి. చెట్టు ఎక్కుతానంటే దగ్గరుండి ఎక్కించండి. అలాంటి సమయాలలో ప్రమాదం ఉందనిపిస్తే పిల్లలు జాగ్రత్త పడతారు. ప్రమాదాలు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉండాలని ఈ అనుభవం వారికి నేర్పుతుంది.

బోలెడన్ని అవకాశాలు: మా చిన్నప్పుడు ఇంత పేదగా ఉన్నాం... అంత పేదగా ఉన్నాం... కాబట్టి నువ్వు బాగా చదువుకుని పైకి రావాలి... ఇలా కొందరు తల్లిదండ్రులు చెబుతుంటారు. అలా చెప్పక్కర్లేదు. ఈ లోకం చాలా పెద్దది... ఎక్కడ చూసినా అవకాశాలు ఉంటాయి... బోలెడంత సంపద ఉంది... నేర్చుకున్న విద్యకు విలువ ఉంటుంది... ఏదో ఒకటి సాధించడం కష్టం కాదు. కాని ఆ సాధించేదేదో పెద్దదే సాధించు అనే విధాన పిల్లలకు స్ఫూర్తినివ్వాలి.

మీరే ఆదర్శం: పిల్లలకు తల్లిదండ్రులకు మించి రోల్‌మోడల్స్ ఉండరు. వారికి మీరే ఆదర్శంగా ఉండండి. మీరు ఒకటి చెప్పి మరొకటి చేస్తూ ఉంటే పిల్లలు ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలో తెలియక బాధ పడతారు. మీ పిల్లలు ఎలా ఉండాలనుకుంటారో మీరు వారి ఎదుట అలా ఉండండి. అద్భుతమైన ఫలితాలు వస్తాయి.

మందలించండి: పిల్లలు తప్పు చేస్తే మందలించండి. ఇది సరియైన పని కాదు అని గట్టిగా చెప్పండి. తప్పు లేదు. మంచి నడవడిక అంటే ఏమిటో వారికి తెలియాలి.

వారిని నమ్మండి: మీ అంచనాకు తగినట్టుగా పిల్లలు లేకపోతే నిరాశ చెందకండి. 'నీ మీద నమ్మకం పోయింది' అని పిల్లలతో పొరపాటున కూడా అనకండి. మీరే వారిపై నమ్మకం పోగొట్టుకుంటే ఇక వారిని నమ్మేదెవరు. పిల్లలు కుదేలైపోతారు. అందుకని వారికి అవకాశం ఇవ్వండి. 'నిన్ను నమ్ముతున్నాం. నువ్వు చేయగలవు. పర్వాలేదు. మళ్లీ ప్రయత్నించు' అని చెప్పండి.

భిన్న అనుభవాలను ఇవ్వండి: మీ పిల్లలకు లోకం చూపించండి. ఊళ్లు, కొత్త ప్రదేశాలు, అనాథ గృహాలు, సైన్స్ ల్యాబ్‌లు, భిన్న రంగాల పెద్దలు ఇలా మీకు వీలైనచోటుకు తీసుకెళ్లి వీలైన వారితో పరిచయం చేయించండి. తిరిగొచ్చేప్పుడు వారితో ఆ విషయాలను మాట్లాడండి. మీ పనుల్లో మీరు ఉండకండి.

వారు చెప్పేది వినండి: పిల్లలు ఏదైనా చెప్పడం మొదలెట్టగానే నోర్మూయ్ నీకేం తెలియదు అనకండి. వాళ్లు శుంఠలనే భావన తీసేయండి. ముందు వారు చెప్పేది పూర్తిగా వినండి. వెంటనే రియాక్ట్ కావద్దు. ఆలోచించి అప్పుడు మాట్లాడండి. తాము చెప్పేది తల్లిదండ్రులు వింటారు అనే నమ్మకం పోతే పిల్లలు చెప్పడం మానేస్తారు.

పోల్చకండి: మీ పిల్లలను ఇతర ఏ పిల్లలతో పోల్చకండి. అలాగే వారి తోబుట్టువులతో కూడా పోల్చకండి. మీరు మీ పిల్లల్లో ఒకరిని గారాబం చేస్తే వారు లోకంలో అంతా ఇంతే సుఖంగా ఉంటుంది అనుకుంటారు. ఎవరినైనా నిర్లక్ష్యం చేస్తే వారు గుర్తింపు కోసం, అంగీకారం కోసం పాకులాడే స్థితికి వెళతారు. కాబట్టి రెండూ వద్దు.

ఇవీ ఐ.ఏ.ఎస్ ఆఫీసర్ చెప్పిన పెంపకం పాఠాలు. ఇక నిర్ణయం మీదే.

మల్టీ టాలెంట్

ఆన్‌లైన్ పాఠాల నుంచి ఉద్యమ బాటల వరకు..

'నేనింతే' అనుకుంటే
'అవును. అంతే' అంటుంది విధి.
అప్పుడు కాళ్లకు బంధనాలు పడతాయి.
కలలు మసకబారిపోతాయి.
'యస్. నేను సాధించగలను.
ఆ శక్తి నాలో ఉంది అనుకుంటే మాత్రం
కొత్త అడుగులు పడతాయి.
మన విజయాలు సగర్వంగా మాట్లాడుతాయి...'
అని చెప్పడానికి నిలువెత్తు నిదర్శనం
రెహన షాజహాన్...

ఒక్క మార్కుతో దిల్లీలోని ప్రసిద్ధ జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో ఎంకాం సీటు మిస్ అయిన సందర్భంలో కేరళలోని కొట్టాయంకు చెందిన రెహన షాజహాన్ ముందు ప్రశ్న రూపంలో చీకటి నిల్చుని ఉంది.

ఆ చీకట్లోనే, అక్కడే ఉండి ఉంటే రెహన ఎంతో మందికి స్ఫూర్తిదాయకమైన వ్యక్తిగా నిలిచేది కాదు.


రెహన షాజహాన్

సీటు మిస్ అయిన నిరాశలో నుంచి వేగంగా తేరుకొని, ఒకేసారి ఆన్‌లైన్‌లో సోషల్ వర్క్, గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సులు చేసింది. జామియా మిలియా ఇస్లామియాలో ఎంబీఏలో సీటు సంపాదించింది.

'ఎంబీఏ సీటు సంపాదించడం నా ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. నేను సాధించగలను అనే బలాన్ని ఇచ్చింది' అంటుంది రెహన.

'మహిళలలో ఉన్న శక్తిసామర్థ్యాలు అపారం. వాటిని వారికి ఎరుకపరచడమే మా ధ్యేయం' అనే నినాదంతో దిల్లీ కేంద్రంగా 'వుమెన్స్ మ్యానిఫెస్టో' అనే స్వచ్ఛంద సంస్థ మొదలైంది. ఈ సంస్థలో భాగం కావడం ద్వారా తన మానసిక దృక్పథాన్ని విశాలం చేసుకునే అవకాశం ఏర్పడింది.

నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడం, గృహహింస బాధితులకు అండగా నిలవడం, వారికి కావాల్సిన న్యాయసహాయాన్ని అందించడం, ఆరోగ్యం, శుభ్రతకు సంబంధించి అవగాహన కార్యక్రమాలు చేపట్టడం...ఇలా కెరీర్ గైడెన్స్ నుంచి బాధితుల కన్నీరు తుడవడం వరకు 'వుమెన్స్ మ్యానిఫెస్టో' కార్యక్రమాల్లో చురుకైన పాత్ర నిర్వహించింది.

పాఠ్యపుస్తకాలు చదువుకున్న రెహనకు 'ఉమెన్స్ మ్యానిఫెస్టో' ప్రభావంతో సమాజాన్ని లోతుగా చదువుకునే అవకాశం లభించింది. వెబినార్ స్పీకర్, జోష్ టాక్స్ స్పీకర్‌గా ప్రపంచవ్యాప్తంగా వందలాది మంది విద్యార్థులను ప్రభావితం చేసింది.

జ్ఞానాన్ని విస్తృతం చేసుకోవడానికి అవకాశం ఇచ్చే, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ సంస్థల ఉచిత ఆన్‌లైన్ కోర్సుల గురించి తెలుసుకుంది.

24 గంటలలో 81 ఆన్‌లైన్ సర్టిఫికెట్‌లను సొంతం చేసుకొని ప్రపంచ రికార్డ్ సృష్టించింది. అంతకుముందు ఉన్న రికార్డ్‌ను బ్రేక్ చేసింది.

'నీలో ఉన్న ధైర్యాన్ని నువ్వు కనిపెట్టేంత వరకు నువ్వు ఎంత ధైర్యవంతురాలివో నీకు తెలియదు. నీలోని శక్తి,సామర్థ్యాలను తెలుసుకునేంత వరకు నువ్వు ఎంత శక్తిమంతురాలివో నీకు తెలియదు' అంటున్న రెహన యూట్యూబ్ ఛానల్ మొదలుపెట్టింది.

రెహన స్ఫూర్తిదాయకమైన ప్రసంగంలోని నుంచి కొంత... 'మన కోసం ఒక అవకాశం ఎక్కడో ఒకచోట ఎదురు చూస్తుంటుంది. అది ఎక్కడ ఉందో తెలుసుకోవడమే మన పని. మిమ్మల్ని ఎవరైనా ఎప్పుడైనా తక్కువ చేసి చూశారా? ఏమీ సాధించలేరనే వెక్కిరింపులు మీకు ఎదురయ్యాయా! అయితే మీరు నా గురించి తెలుసుకోవాల్సిందే. చిన్నప్పుడు అక్కయ్యతో పోల్చుతూ నన్ను చిన్నబుచ్చేవారు. మనకు ఏ సబ్జెక్ట్‌లో ఆసక్తి ఉందో ఆ సబ్జెక్ట్‌లోనే రాణిస్తాం. మంచి విజయాలు సాధిస్తాం. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకొని సైన్స్ నుంచి కామర్స్‌కు మారాను. ఇక వెనక్కి చూసుకోవాల్సిన పనిలేదు. అయితే జామియా యూనివర్శిటీలో పీజీ సీట్ మిస్ అయిన క్షణం మాత్రం కొంచెం నిరాశకు గురయ్యాను. దీని నుంచి నేను గుణపాఠం తీసుకున్నాను. ఆత్మవిశ్వాసం మంచిదే, అతి ఆత్మవిశ్వాసం మాత్రం చెడ్డది'

'మీ ప్రసంగం విన్న తరువాత నన్ను నేను చాలా మార్చుకున్నాను' అని యూట్యూబ్ కామెంట్ సెక్షన్‌లో ఒకే వాక్యంలో తనలోని మార్పు గురించి రాసింది ఒక అమ్మాయి.

రెహన షాజహాన్ స్ఫూర్తిదాయకమైన విజేత అని చెప్పడానికి ఆ అమ్మాయి కామెంట్ చాలు కదా!

గాల్లో ఎగురుతూ పండ్లు కోసే రోబోలు!



పండ్ల కోత కూలీలు సమయానికి దొరక్క రైతులు నానా యాతన పడుతూ ఉంటారు. కూలీల కొరత వల్ల కోత ఆలస్యం కావటం, నాణ్యత కోల్పోవటం.. రైతులు ఆశించిన ధర దక్కకపోవటం చూస్తుంటాం. ప్రపంచవ్యాప్తంగా కోత కూలీలు దొరక్క ఏటా 3 వేల కోట్ల డాలర్ల మేరకు రైతులు నష్టపోతున్నారు. రెండు వారాలు ఆలస్యంగా కోసిన పండ్ల వెల 80% తగ్గిపోతున్నదట. 2050 నాటికి 50 లక్షల మంది పంట కోత కార్మికుల కొరత నెలకొంటుందని అంచనా. కోసే వాళ్లు లేక 10% పండ్లు కుళ్లిపోతున్నాయట.

ఈ సమస్యకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం పరిష్కారాలు చూపుతోంది. ఎత్తయిన చెట్ల నుంచి పక్వానికి వచ్చిన పండ్లను మాత్రమే సుతిమెత్తగా పట్టుకొని కోసి తెచ్చే రోబోలు వచ్చేశాయి.

తోటలో నేల మీద కదులుతూ స్ట్రాబెర్రీలు, కూరగాయలు, పండ్లను కోసే రోబోలు వున్నాయి. అయితే, గాలిలో ఎగురుతూ ఎత్తయిన చెట్ల నుంచి పండ్లు కోసే రోబోలను కూడా తాజాగా ఇజ్రాయెల్‌కు చెందిన ఓ స్టార్టప్ కంపెనీ విజయవంతంగా రూపొందించింది. ఇజ్రాయిల్‌కు చెందిన టెవెల్ ఏరోబోటిక్స్ టెక్నాలజీస్ అనే స్టార్టప్ కంపెనీ ఈ సమస్య పరిష్కారానికి స్వతంత్రంగా ఎగురుతూ చెట్ల నుంచి పండ్లను కోసే రోబోలను తయారు చేసింది. ఈ రోబోలకు మీటరు పొడవుండే ఇనుప చెయ్యిని బిగించారు. కోయాల్సిన పండు రకాన్ని బట్టి ఈ చేతిలో తగిన మార్పులు చేస్తారు. అత్యాధునిక కృత్రిమ మేధను కలిగి ఉన్నందున ఏ రంగు, ఏ సైజు పండు కొయ్యాలి? ఏది అక్కర్లేదు? అనే విషయాన్ని ముందుగానే వీటికి ఫీడ్ చేస్తారు. ఆ సమాచారం మేరకు మెషిన్ లెర్నింగ్ అల్గోరిథమ్స్ ద్వారా సెన్సార్లు, కామెరాల సహాయంతో ఈ రోబోలు పనిచేస్తున్నాయి. పక్వానికి వచ్చిన పండ్లనే కచ్చితంగా గుర్తించి కోయగలుగుతున్నాయని టెవెల్ ఏరోబోటిక్స్ సీఈవో యనివ్ మోర్ తెలిపారు. ఒక వ్యాన్‌పై నాలుగు పండ్లు కోసే రోబోలను వైర్లతో అనుసంధానం చేస్తారు. అవి చెట్లపై ఎగురుతూ పండ్లను కోసి, వాటిని జాగ్రత్తగా వ్యాన్‌పై పెడతాయి.

ఈ రోబోలు ఒక ఆప్‌తో అనుసంధానమై ఉండి రైతుకు ఎప్పటికప్పుడు సమగ్ర సమాచారాన్ని అందిస్తాయి. ఎంత మొత్తంలో పండ్ల కోత పూర్తయ్యింది? ఏదైనా పురుగుమందు లేదా చీడపీడల ప్రభావం ఉందా? అనే విషయాన్ని కూడా రైతుకు తెలియజేస్తాయి. ఆపిల్స్ నుంచి అవకాడో వరకు అనేక రకాల పండ్లను ఈ రోబోలు అవలీలగా రాత్రీ పగలు నిరంతరాయంగా కోస్తున్నాయని కంపెనీ చెప్తోంది.

ఆపిల్స్, అవకాడో, పియర్స్, నారింజ తదితర పండ్ల కోత పరీక్షల్లో చక్కని ఫలితాలు వచ్చాయి. సాధారణంగా రెండున్నర ఎకరాల్లో పండ్ల కోతకు ఒక ఎగిరే రోబో సరిపోతుందట. అయితే, చెట్ల వయసు, పండ్ల రకం, సైజులను బట్టి ఎంత తోటకు ఎన్ని రోబోలు అవసరమవుతాయన్నది ఆధారపడి ఉంటుంది.

'గాలిలో ఎగురుతూ పండ్లను కోసే రోబోలు మావి మాత్రమే. ఈ ఏడాది మార్కెట్లోకి తెస్తున్నాం' అంటున్నారు ఆ కంపెనీ సీఈవో. సుమారు 3 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఐదేళ్ల పరిశోధించి కంపెనీ ఈ వినూత్న రోబోలను తయారు చేసింది కదా.. ధర కూడా ఆ స్థాయిలోనే ఉంటుందిగా మరి! మన దేశంలో ఎంత ధరకు అమ్ముతారో వేచి చూద్దాం...

సాగుబడి
పుబ్బ కార్తె :
ఆగస్టు 30 నుంచి

ఆకుకూరలు, కూరగాయల సాగు

రైతుకు రోజూ ఆదాయమే!

చిన్న, సన్నకారు రైతు కుటుంబం రోజూ పొలానికెళ్లి చెమటోడ్చడానికి ఇష్టపడితే ఆకుకూరలు, కూరగాయల సాగుతో ప్రతి రోజూ ఆదాయం కళ్ల చూడొచ్చు. అంతేకాదు, ఖర్చులు పోను.. ఎకరానికి ఏటా రూ. 2 లక్షలకు పైగా నికరాదాయం సంపాయించటం సాధ్యమేనని ఓ యువ రైతు కుటుంబం నిరూపిస్తోంది. పంటకు తోడు నాలుగు ఆవులు, గేదెలూ పెట్టుకుంటే నిశ్చింతగా జీవనయానం సాగుతుందని సంద్రాల వెంకన్న, మంగమ్మ దంపతులు సంతోషంగా చెబుతున్నారు.

వరి సాగు గిట్టుబాటు కాకపోవడంతోపాటు ధాన్యం అమ్మకానికి వెళ్లిన ప్రతిసారీ చుక్కలు కనిపిస్తుండటంతో కూరగాయల సాగుపై దృష్టి కేంద్రీకరించారు వెంకన్న, మంగమ్మ. రైతుబజారుకు తీసుకెళ్లి రోజూ స్వయంగా అమ్ముకుంటూ సేద్యంలో సంతోషాన్ని చవిచూస్తున్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం ఐలాపురం గ్రామానికి చెందిన వెంకన్న(36) ఇంటర్ వరకూ చదివి దాదాపు 15 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నారు. తండ్రి నాలుగేళ్ల క్రితం మరణించాక భార్య మంగమ్మ, తల్లి మల్లమ్మ సాయంతో వెంకన్న తమకున్న 3.5 ఎకరాల్లో సేద్యం చేస్తున్నారు. వైఎస్సార్ హయాంలో 8 ఏళ్ల పాటు ఆదర్శ రైతుగా పనిచేసిన అనుభవం, కంపసాగర్‌లోని కృషి విజ్ఞాన కేంద్రంలో శాస్త్రవేత్తలతో పాటు ప్రకృతి వ్యవసాయ పితామహుడు సుభాష్ పాలేకర్ వద్ద పొందిన శిక్షణ ప్రేరణ వ్యవసాయంపై శ్రద్ధాసక్తులతో దృష్టి కేంద్రీకరించే విధంగా తనను మార్చాయని వెంకన్న తెలిపారు.

ఎత్తు మడులపై ఆకుకూరలు..

నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద ఉన్న రెండెకరాల లోతట్టు భూమిలో వరి సాగు చేస్తూ.. ఊరికి దగ్గర్లో ఉన్న మిగతా ఎకరన్నరకు పైగా భూమిలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. పండించిన కూరగాయలు, ఆకుకూరలను తమ గ్రామానికి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న మిర్యాలగూడెం రైతు బజారుకు రోజూ తీసుకెళ్లి స్వయంగా తామే అమ్ముతూ రోజుకు కనీసం రూ. వెయ్యికి తగ్గకుండా సంపాయిస్తున్నారు. పంటతో పాడిని అనుసంధానం చేయటం విశేషం. రెండు ఆవులు, రెండు గేదెలను పెంచుతూ పాలపై ఆదాయం గడిస్తున్నారు. పేడ, మూత్రంలను పంటల సాగుకు ఉపయోగిస్తున్నారు. ఎకరంన్నర ఎర్ర నేలలో ఎత్తుమడుల (4 అడుగుల వెడల్పు, 20 అడుగుల పొడవు, అడుగు ఎత్తు)పై మిశ్రమ పద్ధతుల్లో సాగు చేస్తూ మంచి ఫలితాలు సాధిస్తున్నారు వెంకన్న. మరో ఎకరంలో వరిని పూర్తిగా ప్రకృతి సేద్య పద్ధతుల్లో సాగు చేయాలనుకుంటున్నానన్నారు.

పాలకూర తోటలో కుటుంబ సభ్యులు



- ఏడాది పొడవునా కూరగాయలు, ఆకుకూరల సాగు
- మిర్యాలగూడ రైతుబజార్లో స్వయంగా వినియోగదారులకు అమ్మకం
- ప్రతి రోజూ ఆదాయం.. ఎకరానికి ఏటా రూ. 2 లక్షల నికరాదాయం

ఆకుకూరలతో నమ్మకమైన లాభం!



స్వయంగా రోజూ భార్యాభర్త కష్టపడి పని చేసుకొని, దళారులకు అమ్మకుండా నేరుగా స్వయంగా మార్కెట్/ రైతుబజారుకెళ్లి అమ్ముకుంటే ఆకుకూరలు, కూరగాయల సాగులో 99% నమ్మకంగా ఫైనలొస్తాయి. 'రెయిన్ డ్రిప్' ఆకుకూరల సాగుకు అనుకూలంగా ఉంది. నెలకు రూ.30 వేల వరకు పంటల నుంచి ఆదాయం వస్తుంది. ప్రతి రోజూ పంట పండించాల్సిందే. అమ్మాల్సిందే. రోజూ ఆదాయం వస్తుంది. సంవత్సరానికి ఎకరానికి రూ. 2 లక్షల నికరంగా మిగులుతోంది. వరికైతే పెట్టుబడి ఎక్కువ లాభం ఎకరానికి రెండు పంటలు కలిపి రూ. 20 వేలే. అందుకే కూరగాయలపైనే దృష్టి పెట్టా. నాకు ఇద్దరు పిల్లలు. ఎవరి దగ్గరా చేయి చాచకుండా సంతోషంగా జీవిస్తున్నాం.

– సంద్రాల వెంకన్న (99630 84576),
యువ రైతు, ఐలాపురం, నల్లగొండ జిల్లా

40 రోజులకోసారి ఆకుకూర మడులు..

ఎకరంన్నర చెలకను 6 భాగాలుగా చేసుకొని.. పది గుంటలు లేదా పావెకరానికి ఒక విభాగంగా ఏర్పాటు చేసి.. వాటిలో ఎత్తుమడుల(పీక)లను నిర్మించి, దఫాల వారీగా విత్తుకుంటూ, ఏడాది పొడవునా ఏరోజు చూసినా ఆకుకూరలు, కూరగాయల దిగుబడి చేతికందేలా ప్రణాళిక ప్రకారం సాగు చేస్తున్నారు వెంకన్న. పాలకూర, చుక్కకూర, మెంతికూర, గోంగూర, పుదీనాలతోపాటు బెండ, బీర, దోస, కాకర, సొరకాయ తదితర కూరగాయలను పండిస్తున్నారు.


తల్లి మల్లమ్మతో వెంకన్న

మొదట అరెకరంలో పంటలు సాగు ప్రారంభిస్తారు. 40 రోజుల తర్వాత మరో అరెకరంలో, ఇంకో అరెకరంలో మరో 40 రోజులకు విత్తుకుంటారు. పాలకూర విత్తిన 30 రోజుల్లో మొదటి కోతకు వస్తుంది. తర్వాత పది రోజులకోసారి 6–7 కోతలొస్తాయి.

తోటకూర విత్తిన తర్వాత మొదటి కోత 30 రోజులకు కోతకొస్తుంది. ఆ తర్వాత 8 రోజులకోసారి 15–20 కోతలు వస్తాయి. చుక్కకూర 30–40 రోజుల్లో మొదటి కోత వస్తుంది. తర్వాత 8–9 రోజులకొకటి చొప్పున 5–6 కోతలొస్తాయి. మెంతికూర విత్తిన పది రోజులకు పీకెయ్యాలి. మళ్లీ విత్తుకోవాలి. ఆకుకూరల మడుల్లో 15–20 రోజులకు ఓసారి కలుపును కూలీలు పెట్టి తీయిస్తాం. తర్వాత నుంచి పల్చగా వచ్చిన గడ్డిని నా భార్య, మరీ అవసరమైతే మా అమ్మ తీసేస్తారు. గడ్డి మందు కొట్టం అన్నారు వెంకన్న. వెంకన్న స్వామినాథన్ అవార్డు సహా పలు అవార్డులు అందుకున్నారు.

– కె.నాజిమొద్దీన్, సాక్షి, మిర్యాలగూడ

4న చిరుధాన్యాల వంటకాలపై గుంటూరులో శిక్షణ

చిరుధాన్యాలతో వివిధ రకాలైన వంటకాలు తయారు చేయటంపై సెప్టెంబర్ 4 (ఆదివారం) ఉ. 10 గం. నుంచి సా. 5 గం. వరకు గుంటూరులోని బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆవరణలో చిరుధాన్య వంటకాల నిపుణులు మిల్లెట్స్ రాంబాబు శిక్షణ ఇస్తారు. రైతునేస్తం ఫౌండేషన్ సహకారంతో కర్షక్ సేవా కేంద్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ముందస్తు పేర్ల నమోదు తప్పనిసరి. వివరాలకు.. 9553825532, 7093973999.

బసంపల్లిలో 4న రైతులకు శిక్షణ

శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి మండలం బసంపల్లి గ్రామం (ధర్మవరం- పుట్టపర్తి రోడ్)లో సెప్టెంబర్ 4 (ఆదివారం) ఉ. 9 గం. నుంచి సా. 4 గం. వరకు ప్రకృతి వ్యవసాయంపై సీనియర్ రైతు నాగరాజు తన తోటలో శిక్షణ ఇస్తారు. ప్రవేశ రుసుం రూ. 200. వివరాలకు.. 91826 71819.

సెప్టెంబర్ 20 నుంచి హైడ్రోపోనిక్స్‌పై కేరళ వర్సిటీ శిక్షణా శిబిరం



పోషకాలతో కూడిన నీటిలో కూరగాయలు, ఆకుకూరల మొక్కలను సాగు చేయటమే 'హైడ్రోపోనిక్స్'. కేరళ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా త్రిస్సూర్‌లోని వెల్లనిక్కరలో ఏర్పాటైన హైటెక్ పరిశోధన–శిక్షణా కేంద్రంలో సెప్టెంబర్ 20 నుంచి 24 వరకు 5 రోజుల పాటు 'హైడ్రోపోనిక్స్ సాగు పద్ధతులపై జాతీయ స్థాయి శిక్షణా శిబిరం' జరగనుంది. హైడ్రోపోనిక్స్ నిపుణులు డా. పి.సుశీల ప్రత్యక్షంగా ఆంగ్లంలో శిక్షణ ఇస్తారు. వివిధ రకాల హైడ్రోపోనిక్స్ సాగు పద్ధతులు, వివిధ హైడ్రోపోనిక్స్ వ్యవస్థల నిర్మాణం, నిర్వహణ, నీటి నాణ్యత పరీక్ష, నియంత్రణ చర్యలు; హైడ్రోపోనిక్ సాగులో పోషకాల నిర్వహణ, పోషక లోపం లక్షణాలు–నివారణ, చీడపీడల నియంత్రణ తదితర అంశాలపై పవర్‌పాయింట్, వీడియోల సహాయంతో శిక్షణ ఇస్తారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ. 4,500. ఇతర వివరాలకు డా.పి.సుశీల–99615 33547 కార్యాలయం–9037033547

htrtuvellanikkara@gmail.com

జీవవైవిధ్య సేంద్రియ సేద్యంపై 'నవధాన్య' కోర్సు

ప్రసిద్ధ శాస్త్రవేత్త, సేంద్రియ వ్యవసాయ నిపుణురాలు డా. వందనా శివ ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ సమీపంలో జీవవైవిధ్య సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై పరిశోధనకు 'నవధాన్య' సంస్థను నెలకొల్పారు. అందులోనే ఎర్త్ యూనివర్సిటీ (బీజ విద్యాపీఠ్)ను ఏర్పాటు చేసి సేంద్రియ సేద్యం, దేశీ విత్తన సంరక్షణ తదితర అంశాలపై వివిధ కోర్సులు ఆఫర్ చేస్తున్నారు. 'రిటర్న్ టు ఎర్త్' పేరిట అక్టోబర్ 1–12 తేదీల్లో రెసిడెన్షియల్ కోర్సును నిర్వహించనున్నారు. జీవవైవిధ్య పరిరక్షణ, సేంద్రియ సేద్యం, పునరుత్పాదక సేంద్రియ ఆహార వ్యవస్థ.. ఈ అంశాలకు సంబంధించి లోతైన అవగాహన కల్పించేలా శిక్షణ ఇస్తారు. రిజిస్ట్రేషన్ వివరాల కోసం ఈ-మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

earthuniversity@navdanya.net ; www.navdanya.org



శ్రీవేద్య జోడీకి డబుల్స్ టైటిల్

కామెరూన్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీలో హైదరాబాద్ క్రీడాకారిణి గురజాడ శ్రీవేద్య మహిళల డబుల్స్ టైటిల్‌ను సాధించింది. ఫైనల్లో శ్రీవేద్య-పూర్వీషా రామ్ (భారత్) ద్వయం 21-12, 21-14తో టాప్ సీడ్ కస్తూరి-వినోషా (మలేసియా) జోడీపై గెలిచింది. 'అర్జున అవార్డీ' చేతన్ ఆనంద్‌కు చెందిన అకాడమీలో శ్రీవేద్య శిక్షణ తీసుకుంటోంది. ఇదే టోర్నీలో పురుషుల సింగిల్స్ ఫైనల్లో భారత ప్లేయర్ సతీశ్ 21-13, 21-13తో చువా కిమ్ పెంగ్ (మలేసియా)పై నెగ్గి టైటిల్ సాధించాడు.

నేడు బంగ్లాదేశ్‌తో అఫ్గానిస్తాన్ పోరు

ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీ గ్రూప్ 'బి'లో ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. తొలి మ్యాచ్‌లో శ్రీలంకను చిత్తు చేసి సమరోత్సాహంతో ఉన్న నబీ సారథ్యంలోని అఫ్గానిస్తాన్ జట్టు షార్జాలో నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌తో ఆడనుంది. బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ కెరీర్‌లో ఇది 100వ అంతర్జాతీయ టి20 మ్యాచ్ కానుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.



'రికార్డు'తో ప్లే ఆఫ్స్‌కు తెలుగు యోధాస్



పుణే: అల్టిమేట్ ఖో-ఖో లీగ్‌లో తెలుగు యోధాస్ జట్టు అద్భుత ప్రదర్శన కొనసాగుతోంది. టోర్నీలో ఐదో విజయం సాధించిన జట్టు ప్లే ఆఫ్స్‌కు దూసుకుపోయింది. ఈ క్రమంలో పలు రికార్డులతో సత్తా చాటింది. సోమవారం జరిగిన పోరులో తెలుగు యోధాస్ 88-21 పాయింట్ల తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుగా ఓడించింది. ఈ మ్యాచ్‌లో తెలుగు టీమ్ టోర్నీలో అత్యధికంగా 88 పాయింట్లు స్కోర్ చేయగా, గెలుపు తేడా కూడా అత్యధికంగా 67 పాయింట్లు ఉండటం విశేషం. ప్రజ్వల్, ప్రతీక్, అవధూత్ పాటిల్ యోధాస్ గెలుపులో కీలక పాత్ర పోషించారు. రేపు జరిగే మ్యాచ్‌లో ఒడిషా జగర్‌నాట్స్‌తో తెలుగు యోధాస్ తలపడుతుంది. మరోవైపు చెన్నై క్విక్ గన్స్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరింది. హోరాహోరీగా సాగిన పోరులో చెన్నై 58-42 పాయింట్ల తేడాతో ముంబై ఖిలాడీస్‌ను ఓడించింది. ఒడిషా జగర్‌నట్స్, గుజరాత్ జెయింట్స్ కూడా ప్లే ఆఫ్ బెర్త్‌లను ఖరారు చేసుకున్నాయి.

దక్షిణాసియా ఫుట్‌బాల్ టోర్నీకి సౌమ్య



న్యూఢిల్లీ: వచ్చే నెలలో నేపాల్ వేదికగా జరిగే దక్షిణాసియా మహిళల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 26 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ అమ్మాయి సౌమ్య గుగులోత్ తన స్థానాన్ని నిలబెట్టుకుంది. భారత జట్టుకు సోమవారం పుణేలో ఐదు రోజుల శిక్షణ శిబిరం మొదలైంది. సెప్టెంబర్ మూడో తేదీన భారత జట్టు నేపాల్‌కు వెళుతుంది. డిఫెండింగ్ చాంపియన్ భారత్ గ్రూప్ 'ఎ'లో మాల్దీవులు, పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లతో లీగ్ మ్యాచ్‌లు ఆడుతుంది. గ్రూప్ 'బి'లో నేపాల్, భూటాన్, శ్రీలంక జట్లున్నాయి. లీగ్ దశ ముగిశాక రెండు గ్రూప్‌ల నుంచి టాప్-2లో నిలిచిన జట్లు సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. సెప్టెంబర్ 19న ఫైనల్ జరుగుతుంది.

ముర్రే శుభారంభం

- రెండో రౌండ్‌లోకి మాజీ చాంపియన్
- తొలి రౌండ్‌లో 24వ సీడ్ ప్లేయర్‌పై వరుస సెట్‌లలో విజయం

కొన్నేళ్ల క్రితం 'బిగ్ ఫోర్'లో ఒకడిగా వెలుగొందిన బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రే కెరీర్ గాయాల కారణంగా గాడి తప్పింది. 'గ్రాండ్‌స్లామ్' విజయాల్లో జొకోవిచ్, నాదల్, ఫెడరర్ దూసుకుపోతుంటే ముర్రే మాత్రం వెనుకబడిపోయాడు. తాను పాల్గొన్న చివరి ఎనిమిది గ్రాండ్‌స్లామ్ టోర్నీలలో ముర్రే ఒక్కసారి మాత్రమే మూడో రౌండ్ వరకు వెళ్లగలిగాడు. ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్‌తో టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ యూఎస్ ఓపెన్‌లో బరిలోకి దిగిన ముర్రే వరుస సెట్‌లలో తొలి రౌండ్‌లో విజయం అందుకున్నాడు.



ముర్రే



సాకరి

న్యూయార్క్: ఈ ఏడాది ఆడుతున్న మూడో గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లోనూ బ్రిటన్ టెన్నిస్ స్టార్ ఆండీ ముర్రే తొలి రౌండ్ అడ్డంకిని అధిగమించాడు. సోమవారం మొదలైన టెన్నిస్ సీజన్ చివరి గ్రాండ్‌స్లామ్ టోర్నీ యూఎస్ ఓపెన్‌లో 2016 చాంపియన్ ఆండీ ముర్రే శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్ మ్యాచ్‌లో ప్రపంచ 51వ ర్యాంకర్ ముర్రే 7-5, 6-3, 6-3తో ప్రపంచ 27వ ర్యాంకర్, 24వ సీడ్ ఫ్రాన్సిస్కో సెరున్‌డొలో (అర్జెంటీనా)పై గెలుపొంది రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. రెండు గంటల 41 నిమిషాలపాటు జరిగిన పోరులో ముర్రే ఆరు ఏస్‌లు సంధించి, ఐదు డబుల్ ఫాల్ట్‌లు చేశాడు. నెట్ వద్దకు 23 సార్లు దూసుకొచ్చిన ముర్రే 18 సార్లు పాయింట్లు గెలిచాడు. మ్యాచ్ మొత్తంలో ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిది సార్లు బ్రేక్ చేసిన ఈ మాజీ నంబర్‌వన్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయాడు. 32 అనవసర తప్పిదాలు చేసిన ముర్రే 25 విన్నర్స్ కొట్టాడు. కెరీర్‌లో 16వసారి యూఎస్ ఓపెన్‌లో ఆడుతున్న ముర్రే 2016లో టైటిల్ సాధించి, 2008లో రన్నరప్‌గా నిలిచాడు.

మెద్వెదెవ్ అలవోక విజయం

పురుషుల సింగిల్స్‌లో తొలిరోజు జరిగిన మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ డానిల్ మెద్వెదెవ్ (రష్యా) కూడా అలవోక విజయంతో రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. స్టెఫాన్ కొజ్లోవ్ (అమెరికా)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో మెద్వెదెవ్ 6-2, 6-4, 6-0తో గెలుపొందాడు. రెండు గంటల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో మెద్వెదెవ్ 10 ఏస్‌లు సంధించి, ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేశాడు. మరో మ్యాచ్‌లో 'వైల్డ్ కార్డు'తో బరిలోకి దిగిన అమెరికా ప్లేయర్ జేజే వుల్ఫ్ 6-4, 6-4, 6-4తో 16వ సీడ్ రొబెర్టో బాటిస్టా అగుట్ (స్పెయిన్)ను ఓడించాడు.

శ్రమించి నెగ్గిన సాకరి

మహిళల సింగిల్స్ విభాగంలో మూడో సీడ్ మరియా సాకరి (గ్రీస్) రెండో రౌండ్ చేరేందుకు కష్టపడాల్సి వచ్చింది. తాత్యానా మరియా (జర్మనీ)తో జరిగిన తొలి రౌండ్‌లో సాకరి 6-4, 3-6, 6-0తో గెలిచింది. 2 గంటల 13 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకరి ఆరు ఏస్‌లు సంధించి, ఎనిమిది డబుల్ ఫాల్ట్‌లు, 39 అనవసర తప్పిదాలు చేసింది. ఇతర తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో 17వ సీడ్ కరోలినా గార్సియా (ఫ్రాన్స్) 6-2, 6-4తో రఖిమోవా (రష్యా)పై, అలీసన్ రిస్కీ అమృత్‌రాజ్ (అమెరికా) 6-2, 6-4తో ఎలీనా యు (అమెరికా)పై విజయం సాధించారు.

'ఏదో సాధించినట్లనిపిస్తోంది'

తన ప్రదర్శనపై హార్దిక్ పాండ్యా వ్యాఖ్య



దుబాయ్: సరిగ్గా నాలుగేళ్ల క్రితం...ఇదే వేదికపై ఆసియా కప్‌లో పాకిస్తాన్‌తోనే జరిగిన వన్డేలో బౌలింగ్ చేస్తూ హార్దిక్ పాండ్యా తీవ్రంగా గాయపడ్డాడు. స్ట్రెచర్‌పై అతడిని మైదానం నుంచి బయటకు తీసుకుపోవాల్సి వచ్చింది. ఒకదశలో ఈ వెన్ను గాయం అతడి కెరీర్‌నే ముగించేలా అనిపించింది. అయితే హార్దిక్ అన్ని అవరోధాలను అధిగమించి మళ్లీ పైకి లేచాడు. సర్జరీల అనంతరం కోలుకొని ఆటపై దృష్టి పెట్టాడు. అయితే భుజం గాయంతో గత ఏడాది యూఏఈలోనే జరిగిన టి20 ప్రపంచకప్‌లో స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే ఆడిన అతను ఇప్పుడు తన అసలు సత్తాను చూపించాడు. పాత హార్దిక్‌ను గుర్తు చేస్తూ అటు బౌలింగ్‌లో, ఇటు బ్యాటింగ్‌లో చెలరేగి తన విలువేంటో చూపించాడు. 'ఆ రోజు నాకు బాగా గుర్తుంది. అప్పటి పరిస్థితితో ఈ రోజును పోల్చి చూసుకుంటే ఎంతో సాధించిన ఆనందం కలుగుతోంది. నేను ఒకప్పటి ఆటగాడిలా మళ్లీ కనిపించేందుకు ఈ నాలుగేళ్లు ఎంతో కష్టపడ్డాను. నా ఈ ప్రయాణంలో చాలా మంది సహకరించారు' అని హార్దిక్ అన్నాడు. పాక్‌తో మ్యాచ్‌లో గెలుపు విషయంలో తనకు ఎలాంటి సందేహం లేదని అతను వ్యాఖ్యానించాడు. అసలు ఎలాంటి ఒత్తిడి ఎదుర్కోలేదని పాండ్యా చెప్పాడు. 'చివరి ఓవర్లో 7 పరుగులు అనేది పెద్ద విషయం కాదు. 15 పరుగులైనా సాధించగలననే నమ్మకం నాకుంది. నాకంటే బౌలర్ నవాజ్‌పైనే ఎక్కువ ఒత్తిడి ఉంటుందని తెలుసు. అందుకే ప్రశాంతంగా నా పని పూర్తి చేశాను. జట్టుగా కూడా మాకు ఇది కీలక విజయం. ఎలాంటి స్థితిలోనైనా ఆడగలమని నిరూపించాం. మా లక్ష్యం ఈ టోర్నీ మాత్రమే కాదు. ప్రపంచకప్ వరకు ఇదే జోరు కొనసాగించడమే ముఖ్యం' అని హార్దిక్ స్పష్టం చేశాడు.

రన్నరప్ భారత్

రిఫా (బహ్రెయిన్): ఆసియా అండర్-20 పురుషుల వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు రన్నరప్‌గా నిలిచింది. సోమవారం జరిగిన ఫైనల్లో భారత్ 12-25, 19-25, 22-25, 15-25తో డిఫెండింగ్ చాంపియన్ ఇరాన్ చేతిలో ఓడిపోయింది. 42 ఏళ్ల ఈ టోర్నీ చరిత్రలో ఇరాన్ చాంపియన్‌గా నిలువడం ఇది ఏడోసారి కావడం విశేషం. మరోవైపు భారత జట్టు మూడుసార్లు ఫైనల్ చేరి (1994, 2002, 2022) మూడుసార్లూ రన్నరప్‌తో సరిపెట్టుకోవడం గమనార్హం. విజేత, రన్నరప్ హోదాలో ఇరాన్, భారత్ వచ్చే ఏడాది జరిగే అండర్-21 ప్రపంచ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించాయి.



ధ్యాన్‌చంద్‌కు ఘన నివాళి



సాక్షి, హైదరాబాద్: భారత హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతిని (జాతీయ క్రీడా దినోత్సవం) పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా నివాళులు అర్పించింది. గచ్చిబౌలి స్టేడియంలో ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేసి రాష్ట్ర క్రీడా మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ ఆయనను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో హాకీ 'ట్రిపుల్ ఒలింపియన్' ఎన్.ముకేశ్ కుమార్, 'శాట్స్' చైర్మన్ అల్లిపురం వెంకటేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాకీ, స్విమ్మింగ్ తదితర క్రీడాంశాల్లో ప్రత్యేక పోటీలు కూడా నిర్వహించారు.

సింగిల్స్ చాంప్స్ నవ్య, జస్టిన్ హో



సాక్షి, హైదరాబాద్: కొటక్ ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ సిరీస్ బ్యాడ్మింటన్ టోర్నీలో అండర్-19 మహిళల సింగిల్స్‌లో నవ్య కండేరి (భారత్), జస్టిన్ హో (మలేసియా) విజేతలుగా నిలిచారు. గచ్చిబౌలిలోని పుల్లెల గోపీచంద్ అకాడమీలో ముగిసిన ఈ టోర్నీ ఫైనల్స్‌లో నవ్య 21-15, 21-18తో ఇషారాణి బారువా (భారత్)పై, జస్టిన్ 21-18, 21-14తో ప్రణయ్ షెట్టిగర్ (భారత్)పై గెలిచారు. పురుషుల డబుల్స్ ఫైనల్లో నికోలస్ రాజ్-తుషార్ సువీర్ (భారత్) జోడీ 21-14, 21-18తో అపిలుక్-విత్‌చాయా (థాయ్‌లాండ్) ద్వయంపై... మహిళల డబుల్స్ ఫైనల్లో ఓంగ్ జిన్ యీ-కార్మెన్ టింగ్ (మలేసియా) ద్వయం 21-16, 21-15తో రాధిక శర్మ-తన్వీ శర్మ (భారత్) జోడీపై నెగ్గాయి. మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్లో మయాంక్ రాణా-నర్తన రవిశంకర్ (భారత్) జోడీ 25-23, 23-21తో కణపురం సాత్విక్ రెడ్డి-వైష్ణవి ఖాడ్కేకర్ (భారత్) జంటను ఓడించింది.

సినిమా

రిపీట్టే!

కొన్ని కాంబినేషన్స్ రిపీట్ అవుతుంటాయి. అయితే ఎక్కువగా హీరో-హీరోయిన్ కాంబినేషన్ రిపీట్ అవుతుంటుంది. కానీ ఇప్పుడు రిపీట్ అవుతున్న కాంబినేషన్ వేరు. ఇరవై, ఇరవై ఐదేళ్ల తర్వాత ఆ కాంబినేషన్స్ కుదిరాయి. 'రిపీట్టే' అంటూ మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకునేందు రెడీ అయిన ఆ స్టార్స్ గురించి తెలుసుకుందాం.



చిరంజీవి



రవితేజ

మెగాస్టార్ చిరంజీవితో ఇప్పటి మాస్ మహారాజా అప్పటి అప్‌కమింగ్ హీరో రవితేజ కలిసి నటించిన చిత్రం 'అన్నయ్య' (2000). ముత్యాల సుబ్బయ్య దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో చిరంజీవికి ఓ తమ్ముడిగా నటించారు రవితేజ (ఈ చిత్రంలో వెంకట్ మరో తమ్ముడు). అన్నతమ్ముల కెమిస్ట్రీ 'అన్నయ్య'లో బాగానే పండింది. ఇక ఆ తర్వాత స్వయంకృషితో హీరోగా చాలా బిజీ అయ్యారు రవితేజ. ఇప్పుడు 22 ఏళ్లకు చిరంజీవి, రవితేజ కలిసి 'వాల్తేరు వీరయ్య' చిత్రంలో కలిసి నటిస్తున్నారు. ఈ సినిమాకు బాబీ (కేఎస్ రవీంద్ర) దర్శకుడు. ఈ చిత్రంలో కూడా చిరంజీవి, రవితేజ అన్నతమ్ముళ్లుగానే నటిస్తున్నారనే టాక్ వినిపిస్తోంది. ఇందులో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు.



రజనీకాంత్



రమ్యకృష్ణ

రజనీకాంత్ కెరీర్‌లో 'పడయప్ప' (తెలుగులో 'నరసింహ') సినిమాది ప్రత్యేక స్థానం. కేఎస్ రవికుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దివంగత నటి సౌందర్య హీరోయిన్‌గా నటించగా, నీలాంబరిగా రమ్యకృష్ణ పవర్‌ఫుల్ విలన్ రోల్ చేశారు. రజనీ, రమ్యకృష్ణల మధ్య సన్నివేశాలు పోటాపోటీగా ఉంటాయి. 1999లో వచ్చిన ఈ చిత్రం తర్వాత రజనీకాంత్, రమ్యకృష్ణ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోలేదు. తాజాగా మళ్లీ 'జైలర్' సినిమా కోసం రజనీ, రమ్యకృష్ణ కలిశారు. నీలాంబరిలానే ఇందులోనూ రమ్యకృష్ణ పవర్‌ఫుల్ నెగటివ్ షేడ్‌లో కనిపించనున్నారని తెలిసింది. నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది.

దాదాపు 22 సంవత్సరాల తర్వాత హీరో అజిత్, హీరోయిన్ ఐశ్వర్యా రాయ్ మళ్లీ కలిసి నటించనున్నారా? అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. హీరో అజిత్, దర్శకుడు విఘ్నేష్ శివన్ కాంబినేషన్‌లో ఓ సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా మంజు వారియర్ పేరు తెరపైకి వచ్చింది. తాజాగా ఈ చిత్రంలో ఓ హీరోయిన్ పాత్రకు ఐశ్వర్యా రాయ్ పేరు వినిపిస్తోంది. ఒకవేళ ఆమె కన్ఫార్మ్ అయితే అజిత్, ఐశ్వర్యలు దాదాపు రెండు దశాబ్దాల తర్వాత స్క్రీన్ షేర్ చేసుకుంటున్నట్లే లెక్క. 'కందుకొండేన్ కందుకొండేన్' (2000) చిత్రంలో అజిత్, టబు, ఐశ్వర్యా రాయ్ ప్రధాన పాత్రల్లో నటించారు. మరోవైపు 'మాస్టర్' (2021) చిత్రం తర్వాత హీరో విజయ్, దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో మరో సినిమా రూపొందనున్న సంగతి తెలిసిందే. ఈ సినిమాలో హీరోయిన్ త్రిష నటించనున్నారనే ప్రచారం సాగుతోంది. ఇదే నిజమైతే 14 సంవత్సరాల తర్వాత విజయ్, త్రిష మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకున్నట్లు అవుతుంది. విజయ్, త్రిష చివరిసారిగా 'కురివి' (2008) అనే చిత్రంలో నటించారు. ఈ సినిమాకు ముందు విజయ్, త్రిష కలిసి 'గిల్లి' (2004), 'తిరుపాచ్చి' (2005), 'ఆది' (2006) చిత్రాల్లో నటించారు. ఇలాగే మరికొందరు తారలు కొంత గ్యాప్ తర్వాత మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నట్లుగా తెలుస్తోంది.



విజయ్, ప్రకాశ్‌రాజ్

దాదాపు 20 ఏళ్ల క్రితం విజయ్‌కి విలన్‌గా నటించారు ప్రకాశ్‌రాజ్. ఈ హీరో-విలన్ 2004లో వచ్చిన 'గిల్లి' (తెలుగు హిట్ 'ఒక్కడు'కి తమిళ రీమేక్)లో ఎవరి స్టయిల్‌లో వారు నటనలో రెచ్చిపోయారు. ఇప్పుడు 'వారిస్'లో నటిస్తున్నారు. తమిళ హీరో విజయ్, దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'వారిస్' (తెలుగులో 'వారసుడు'). ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్ విలన్‌గా నటిస్తున్నారు. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్నారు.



రవితేజ

డిష్యుం డిష్యుం

ఏ సినిమాలో అయినా క్లయిమాక్స్ ఫైట్ ప్రేక్షకులకు మంచి కిక్ ఇస్తుంది. ప్రత్యేకించి ఆయా హీరోల అభిమానులైతే తమ హీరో విలన్లను రప్ఫాడిస్తుంటే విజిల్స్ వేస్తూ ఎంజాయ్ చేస్తుంటారు. హీరో రవితేజ కూడా తన తాజా చిత్రం 'రావణాసుర' కోసం విలన్ల భరతం పడుతున్నారు. సుధీర్ వర్మ దర్శకత్వంలో రవితేజ హీరోగా నటిస్తున్న చిత్రం 'రావణాసుర'. అనూ ఇమ్మాన్యుయేల్, మేఘా ఆకాశ్, ఫరియా అబ్దుల్లా, దక్షా నగార్కర్, పూజిత పొన్నాడ హీరోయిన్లు. ఈ చిత్రంలో హీరో సుశాంత్ కీలక పాత్రధారి. అభిషేక్ నామా నిర్మిస్తున్న ఈ చిత్రం కొత్త షెడ్యూల్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. రూ.5 కోట్లతో వేసిన సెట్‌లో ఫైట్ మాస్టర్ స్టన్ శివ నేతృత్వంలో క్లయిమాక్స్ ఫైట్ చిత్రీకరిస్తున్నారు.

పవర్‌ఫుల్ ఆంటోనీ



విశాల్

విశాల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'మార్క్ ఆంటోనీ'. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో ఎస్. వినోద్‌కుమార్ నిర్మిస్తున్నారు. సోమవారం (ఆగస్టు 29) విశాల్ పుట్టినరోజు సందర్భంగా 'మార్క్ ఆంటోని' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ''పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రమిది. తెలుగు, తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా ప్రేక్షకులముందుకు రానుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

డెడ్‌లైన్ పెట్టుకుని వర్క్ చేశాం

- రాజ్ కె నల్లి



కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన చిత్రం 'నేను మీకు బాగా కావాల్సినవాడిని'. సంజనా ఆనంద్ హీరోయిన్‌గా నటించారు. శ్రీధర్ గాదె దర్శకత్వంలో కోడి దివ్య నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 9న విడుదల కానుంది. ఈ చిత్రం కెమెరామేన్ రాజ్ కె నల్లి మాట్లాడుతూ - ''నా చిన్నతనంలో 'సఖి', 'బొంబాయి' సినిమాలను స్ఫూర్తిగా తీసుకుని సినిమాటోగ్రాఫర్ కావాలనుకున్నాను. దీంతో 2014లో సినిమాటోగ్రఫీ కోర్సు పూర్తి చేశాను. ఆ తర్వాత 'రారండోయ్ వేడుక చూద్దాం', 'అర్జున్ సురవరం', 'దేవదాస్', 'ఉప్పెన' వంటి సినిమాలకు అసోసియేట్ కెమెరామేన్‌గా వర్క్ చేశాను. 'ఉప్పెన' సినిమా సమయంలో కృష్ణవంశీగారు కాల్ చేసి 'రంగ మార్తాండ' సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా తీసుకున్నారు. ఆ తర్వాత కిరణ్ అబ్బవరం చేసిన 'సెబాస్టియన్ పీసీ 524' సినిమాకు కెమెరామేన్‌గా చేశాను. ఇప్పుడు కిరణ్‌తో నేను చేసిన రెండో సినిమా 'నేను మీకు బాగా కావాల్సినవాడిని'. కిరణ్ చాలా కూల్ యాక్టర్. తను ఏ టెన్షన్‌లో ఉన్నా కూడా సీన్‌లోకి వచ్చేసరికి ఆ సన్నివేశానికి తగ్గట్టుగా భావోద్వేగాలు పండిస్తాడు. ఈ సినిమా కోసం చాలా కష్టపడ్డాం. ఓ డెడ్‌లైన్ పెట్టుకుని వర్క్ చేశాను. నిర్మాత కోడి దివ్యగారు అందరికీ ఓ కంఫర్ట్ జోన్ క్రియేట్ చేసారు. కొత్తగా ఆలోచిస్తారు. ఇక నేను చేసిన 'రంగ మార్తాండ' సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది'' అని చెప్పుకొచ్చారు.

అంత పిరికివాడు కాదు...



అల్లు అర్జున్, సుబ్బు, రాజా గౌతమ్

''వీడికి ఉన్న భయంతో వీడు ఎంత వరకు వెళ్లగలడో', 'అయినా వాడేం అంత పిరికివాడు కాదులెండి'.. వంటి డైలాగులతో 'బ్రేక్ అవుట్' ట్రైలర్ విడుదలైంది. ప్రముఖ నటుడు బ్రహ్మానందం తనయుడు రాజా గౌతమ్ లీడ్ రోల్‌లో సుబ్బు చెరుకూరి దర్శకత్వం వహించిన చిత్రం 'బ్రేక్ అవుట్'. అనిల్ మోదుగ నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని హీరో అల్లు అర్జున్ విడుదల చేశారు. ''మోనోఫోబియా ఉన్న హీరో ఒంటరిగా ఒక గ్యారేజ్‌లో చిక్కుకుపోతాడు. అక్కడి నుంచి బయటపడటానికి ఎలాంటి ప్రయత్నాలు చేశాడు? అనేది ఈ చిత్రంలో ఆసక్తిగా ఉంటుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

ఆ సినిమా చూసి యాక్టర్ అవ్వాలనుకున్నా!



కేతిక

''విభిన్నమైన వృత్తుల్లో (పాత్రల్లో) కనిపించగలిగే అవకాశం యాక్టర్స్‌కు మాత్రమే దక్కుతుంది. అందుకే నేను యాక్టర్‌ని అయినందుకు సంతోషంగా ఉంది. నా పేరెంట్స్, తాతగారు డాక్టర్స్. మా నాన్నగారు నన్ను డాక్టర్‌గా చూడాలనుకున్నారు. కానీ నా ఇష్టం మేరకు నేను యాక్టర్‌ని అయ్యాను. అయితే 'రంగ రంగ వైభవంగా..' చిత్రంలో మెడికల్ స్టూడెంట్ రాధగా నటించాను. అలా స్క్రీన్‌పై డాక్టర్‌గా కనిపించాను. ఈ విధంగా మా నాన్నగారి కల నిజం అయినందుకు సంతోషంగా ఉంది'' అన్నారు కేతికా శర్మ. వైష్ణవ్ తేజ్, కేతికా శర్మ జంటగా గిరీశాయ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'రంగ రంగ వైభవంగా..'. బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 2న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కేతికా శర్మ మాట్లాడుతూ- ''ప్రతి సినిమా నాకో లెర్నింగ్ ఎక్స్‌పీరియన్సే. 'రొమాంటిక్', 'లక్ష్య' చిత్రాలతో యూత్ ఆడియన్స్‌కు దగ్గరైన నేను 'రంగ రంగ వైభవంగా..'తో ఫ్యామిలీ ఆడియన్స్‌కు దగ్గర కానున్నందుకు సంతోషంగా ఉంది. ఇందులో నేను చేసిన రాధ పాత్రలో ప్రతి అమ్మాయి తనను తాను కొంచెం అయినా ఊహించుకుంటుంది'' అన్నారు.

అలా సినిమా చాన్స్ వచ్చింది



సంచిత

''ముందు టిక్ టాక్ వీడియోలతో పాపులర్ అయ్యాను. నా వీడియోలు చూసిన దర్శకుడు అనుదీప్ 'ఫస్ట్ డే ఫస్ట్ షో' సినిమాకి అవకాశం ఇచ్చారు'' అన్నారు సంచిత బషు. శ్రీకాంత్ రెడ్డి, సంచిత బషు జంటగా వంశీధర్ గౌడ్, లక్ష్మీ నారాయణ పుట్టంశెట్టి ద్వయం తెరకెక్కించిన చిత్రం 'ఫస్ట్ డే ఫస్ట్ షో'. దర్శకుడు అనుదీప్ కథతో ఏడిద శ్రీజ నిర్మించిన ఈ చిత్రం సెప్టెంబరు 2న విడుదల కానుంది. సంచిత మాట్లాడుతూ - ''చిన్నతనం నుంచే యాక్టింగ్ అంటే చాలా ఇష్టం. ఈ చిత్రంలో పవన్ కల్యాణ్ వీరాభిమాని అయిన లయ పాత్రలో నటించాను. దర్శకులు వంశీ, లక్ష్మీ నన్ను బాగా ప్రోత్సహించారు. నిర్మాత శ్రీజగారు నన్ను ఎంతో ఆప్యాయంగా చూసుకున్నారు'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▼ 861	57,973
నిఫ్టీ ▼ 246	17,313

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 ముగింపు)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,091	▼	56
డోజోన్స్	32,261	▼	23
ఎఫ్‌టీఎస్ఈ 100 (మధ్యాహ్నం ముగింపు)	7,427	▼	52
డాక్స్	12,893	▼	78
షాంఘై	3,242	▲	5
నికాయ్	27,879	▼	762

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

దీపావళికల్లా రిలయన్స్ 5జీ

- 2023 చివరి నాటికి దేశవ్యాప్తంగా సేవలు
- వ్యాపారాల విస్తరణపై రూ. 2.75 లక్షల కోట్ల పెట్టుబడులు
- ఎఫ్‌ఎంసీజీ రంగంలోకి ఎంట్రీ
- పవర్ ఎలక్ట్రానిక్స్ కోసం గిగా ఫ్యాక్టరీ
- 45వ ఏజీఎంలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ వెల్లడి
- వ్యాపార విభాగాలకు వారసుల ప్రకటన



ముంబై: దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత దూకుడుగా విస్తరించనుంది. ఇందుకోసం రూ. 2.75 లక్షల కోట్ల పెట్టుబడులతో భారీ ప్రణాళికలు రూపొందించుకుంది. ఇందులో 5జీపై రూ. 2 లక్షల కోట్లు, కీలకమైన చమురు.. పెట్రోకెమికల్స్ వ్యాపారంపై వచ్చే అయిదేళ్లలో రూ. 75,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న 5జీ టెలికం సర్వీసులను అక్టోబర్‌లో (దీపావళి నాటికి) అందుబాటులోకి తేనుంది. అలాగే పోటీ దిగ్గజం అదానీ గ్రూప్‌ను ఢీకొట్టేందుకు ఎఫ్‌ఎంసీజీ రంగంలోకి కూడా ఎంట్రీ ఇవ్వబోతోంది. సోమవారం జరిగిన రిలయన్స్ ఇండస్ట్రీస్ 45వ సర్వసభ్య సమావేశంలో (ఏజీఎం) కంపెనీ చైర్మన్ ముకేశ్ అంబానీ ఈ విషయాలు వెల్లడించారు. అలాగే వారసత్వ ప్రణాళికలను కూడా ప్రకటించారు. ముగ్గురు సంతానం సారథ్యం వహించబోయే విభాగాలను కూడా వివరించారు.

చౌకగా, నాణ్యమైన 5జీ సేవలు..

రిలయన్స్‌లోని టెలికం విభాగం రిలయన్స్ జియో 5జీ నెట్‌వర్క్‌పై రూ. 2 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీపావళి నాటికి నాలుగు మెట్రో నగరాల్లో, ఆ తర్వాత 2023 డిసెంబర్ ఆఖరు కల్లా దేశవ్యాప్తంగా ఈ సర్వీసులను అందుబాటులోకి తేనుంది. 'సిసలైన పాన్–ఇండియా 5జీ నెట్‌వర్క్ నిర్మించేందుకు మేము రూ. 2 లక్షల కోట్లు పెట్టుబడులు పెడుతున్నాం. వచ్చే రెండు నెలల్లో.. అంటే దీపావళి నాటికి ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా సహా కీలకమైన మెట్రో నగరాల్లో జియో 5జీ సేవలను ప్రారంభిస్తాం' అని ముకేశ్ అంబానీ వివరించారు. అత్యంత వేగవంతమైన 5జీ రాకతో కోట్ల కొద్దీ స్మార్ట్ సెన్సర్స్‌ను ఆవిష్కరిస్తామని, ఇవి ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, నాలుగో పారిశ్రామిక విప్లవానికి ఊతమిస్తాయని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకంగా భారత్ కోసం 5జీ సొల్యూషన్స్ రూపొందించేందుకు చిప్ తయారీ దిగ్గజం క్వాల్‌కామ్‌తో జట్టు కట్టినట్లు అంబానీ చెప్పారు. అలాగే, అత్యంత చౌకైన 5జీ స్మార్ట్‌ఫోన్స్‌ను అభివృద్ధి చేసేందుకు టెక్ దిగ్గజం గూగుల్‌తో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. ప్రైవేట్ 5జీ నెట్‌వర్క్స్‌లోకి కూడా విస్తరిస్తున్నట్లు అంబానీ తెలిపారు. ఇటీవల ముగిసిన వేలంలో జియో రూ. 88,078 కోట్ల విలువ చేసే స్పెక్ట్రంను కొనుగోలు చేసింది. మరోవైపు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లు వంటి పవర్ ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల తయారీ కోసం కొత్తగా మరో గిగా ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఇప్పటికే సోలార్ ప్యానెల్స్, ఎనర్జీ స్టోరేజీ, ఎలక్ట్రోలైజర్లు, ఫ్యూయల్ సెల్స్ ఉత్పత్తి కోసం నాలుగు గిగా ఫ్యాక్టరీలను రిలయన్స్ ప్రకటించగా ఇది ఐదోది కానుంది.

ఎఫ్‌ఎంసీజీలో అదానీతో ఢీ..

వ్యాపార విస్తరణ ప్రణాళికల్లో భాగంగా ఈ ఏడాది వినియోగ ఉత్పత్తుల (ఎఫ్‌ఎంసీజీ) విభాగంలోకి కూడా ప్రవేశిస్తున్నట్లు ముకేశ్ అంబానీ కుమార్తె, రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్) డైరెక్టర్ ఈశా అంబానీ తెలిపారు. ప్రజల రోజువారీ అవసరాలకు సంబంధించి అత్యంత నాణ్యమైన ఉత్పత్తులను, చౌకగా అందించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో ఫుడ్, బెవరేజెస్, వ్యక్తిగత సంరక్షణ, నిత్యావసరాలు వంటి విభాగాల్లో పటిష్టమైన బ్రాండ్స్‌తో కలిసి పనిచేయనున్నట్లు ఈషా చెప్పారు. అలాగే కంపెనీల విలీనాలు, కొనుగోళ్ల ద్వారా పోర్ట్‌ఫోలియోను విస్తరించనున్నట్లు తెలిపారు. 'వచ్చే అయిదేళ్లలో ఒక కోటి మంది పైగా వ్యాపారస్తులతో భాగస్వామ్యాలు కుదుర్చుకునే దిశగా ముందుకు వెడుతున్నాం. దేశవ్యాప్తంగా 7,500 పట్టణాలు, 5 లక్షల గ్రామాలకు విస్తరించబోతున్నాం' అని ఈషా పేర్కొన్నారు. ఇదే సందర్భంగా జియోమార్ట్‌లో కొనుగోళ్లకు వాట్సాప్ ద్వారా ఆర్డర్లు పెట్టడం, చెల్లింపులు జరిపే విధానాన్ని ఆమె ఆవిష్కరించారు. అటు, జియోమార్ట్‌తో జట్టుకట్టడంపై హర్షం వ్యక్తం చేస్తూ మెటా సీఈవో మార్క్ జుకర్‌బర్గ్ .. ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. రిలయన్స్‌లో రిటైల్ వ్యాపారాలకు ఆర్‌ఆర్‌వీఎల్ హోల్డింగ్ కంపెనీగా వ్యవహరిస్తోంది. దీని విలువ దాదాపు రూ. 2 లక్షల కోట్లు.. 2022 జూన్ 30 నాటికి రిలయన్స్ రిటైల్‌కు 15,866 స్టోర్స్ ఉన్నాయి. ఎఫ్‌ఎంసీజీలో ఎంట్రీతో ఆ విభాగంలో దిగ్గజంగా ఉన్న అదానీ గ్రూప్‌తో రిలయన్స్ నేరుగా తలపడనుంది. అదానీకి చెందిన అదానీ విల్మర్ వంట నూనెలు మొదలుకుని వివిధ ప్యాకేజ్ ఆహారోత్పత్తులతో దేశంలోనే అగ్రగామి సంస్థల్లో ఒకటిగా ఉంది. ఈ నేపథ్యంలో అదానీ ప్రధాన వ్యాపారమైన ఎఫ్‌ఎంసీజీలోకి అంబానీ ఎంట్రీ ప్రాధాన్యం సంతరించుకుంది.

వారసులొచ్చేశారు..

ఆకాశ్‌కు టెలికం, ఈషాకు రిటైల్, అనంత్‌కు ఎనర్జీ..

ఏజీఎం వేదికగా ముకేశ్ అంబానీ (65) తమ వ్యాపార సామ్రాజ్యానికి వారసులను కూడా ప్రకటించారు. అంబానీకి ముగ్గురు సంతానం (ఇద్దరు కవలలు–ఆకాశ్, ఈషా) కాగా, రిలయన్స్ సామ్రాజ్యంలో ప్రధానంగా ఆయిల్ రిఫైనింగ్..పెట్రోకెమికల్స్, రిటైల్, టెలికం సహా డిజిటల్ సర్వీసులు అని మూడు వ్యాపార విభాగాలు ఉన్నాయి. వీటిని ఒక్కొక్కరికి ఒక్కొక్కటి చొప్పున అంబానీ కేటాయించారు. 'జియో (టెలికం విభాగం)లో ఆకాశ్ (30), రిటైల్‌లో ఈషా ఇప్పటికే సారథ్య బాధ్యతలు చేపట్టారు. కన్జూమర్ వ్యాపార విభాగాలను ప్రారంభించిన తొలినాళ్ల నుంచి వారు చురుగ్గా పాల్గొంటున్నారు. ఇక అనంత్ (26) కూడా మా కొత్త ఇంధన వ్యాపార విభాగం కార్యకలాపాల్లో ఎంతో ఆసక్తిగా పాలుపంచుకున్నారు' అంటూ ఎవరికి ఏయే వ్యాపార విభాగాల బాధ్యతలు ఇస్తున్నదీ ఆయన వెల్లడించారు. అయితే, వారసులను ప్రకటించినంత మాత్రాన తాను రిటైర్ అవుతున్నట్లుగా భావించరాదని ఆయన స్పష్టం చేశారు. 'స్వర్ణ దశాబ్ది ముగిసే 2027 నాటికి రిలయన్స్ విలువ రెట్టింపయ్యేలా, గ్రూప్ సమగ్రంగా..సురక్షితంగా ఉండేలా ఈ ప్రణాళికలు దోహదపడగలవు' అని అంబానీ చెప్పారు. మూడు వ్యాపార విభాగాలు ప్రస్తుతం దాదాపు ఒకే పరిమాణం స్థాయిలో ఉన్నాయి. జూన్‌లోనే ఆకాశ్.. జియో ప్లాట్‌ఫామ్స్ అనుబంధ సంస్థ రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈషా, అనంత్‌లు గ్రూప్ సంస్థల్లో డైరెక్టర్లుగా ఉన్నారు.

ముందుజాగ్రత్త ..

వారసత్వ ప్రకటన ద్వారా, గతంలో తండ్రి ధీరూభాయ్ అంబానీ మరణానంతరం రిలయన్స్ వ్యాపార విభజనపై సోదరుడు అనిల్ అంబానీతో తనకు తలెత్తిన విభేదాల్లాంటివి, తన సంతానం విషయంలో జరగకుండా ముకేశ్ జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు అయిందని పరిశ్రమవర్గాలు అభిప్రాయపడ్డాయి. ధీరూభాయ్ అంబానీ 1973లో రిలయన్స్‌ను ప్రారంభించారు. టెక్స్‌టైల్స్ నుంచి చమురు, టెలికం వరకూ వ్యాపారాన్ని వివిధ విభాగాల్లోకి విస్తరించారు. అయితే, వీలునామాల్లాంటివేవీ రాయకుండా 2002లో ఆయన ఆకస్మికంగా మరణించడంతో రిలయన్స్ సామ్రాజ్యం బీటలు బారింది. ముకేశ్, ఆయన తమ్ముడు అనిల్ అంబానీల మధ్య విభేదాలు తలెత్తాయి. చివరికి వారి మాతృమూర్తి కోకిలాబెన్ జోక్యం చేసుకుని 2005లో రిలయన్స్‌ను విడగొట్టి సోదరులిద్దరికీ పంచారు. ముకేశ్‌కు రిఫైనింగ్, ఆయిల్, టెక్స్‌టైల్స్ వ్యాపారం లభించగా.. అనిల్‌కు టెలికం, అసెట్ మేనేజ్‌మెంట్ మొదలైనవి దక్కాయి. 2019 మార్చి ఆఖరు నాటికి రిలయన్స్‌లో అంబానీల వాటా 50.6 శాతంగా ఉంది. ప్రస్తుతం ముకేశ్ అంబానీ నికర సంపద విలువ 94 బిలియన్ డాలర్లుగా ఉంది. ఆయన రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఎండీగా కొనసాగుతుండగా, భార్య నీతా అంబానీ (59) కంపెనీ బోర్డులో సభ్యురాలిగా ఉన్నారు.



ఆసియాలో టాప్ టెక్నాలజీ హబ్‌గా హైదరాబాద్

కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ నివేదిక

న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంతంలో బీజింగ్ తర్వాత అగ్రస్థాయి టెక్నాలజీ కేంద్రాలుగా బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, ఢిల్లీ నిలిచాయి. నైపుణ్యాలు, రియల్ ఎస్టేట్ మార్కెట్, వ్యాపార అనుకూల వాతావరణం ఇత్యాది 14 అంశాల ఆధారంగా టాప్ టెక్నాలజీ హబ్‌లను కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ సంస్థ ప్రకటించింది. ఈ మేరకు ఓ నివేదికను సోమవారం విడుదల చేసింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో బెంగళూరు 2,30,813 టెక్నాలజీ ఉద్యోగాలను కల్పించింది. ఆ తర్వాత చెన్నైలో 1,12,781, హైదరాబాద్‌లో 1,03,032 మందికి,



ఢిల్లీలో 89,996 మందికి కొత్తగా ఐటీ రంగంలో ఉద్యోగాలు లభించాయి. ఐటీ, టెక్నాలజీ ఆధారిత రంగాలు భారత ఆర్థిక వ్యవస్థను నడిపించే కీలక చోదకాలుగా కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ భారత ఎండీ అన్షుల్ జైన్ పేర్కొన్నారు. "మార్కెట్ మూలాలు బలంగా ఉన్నాయి. దీంతో ప్రపంచ ఐటీ సంస్థలకు భారత్ అనుకూల కేంద్రంగా అవతరించింది. అంతేకాదు, అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాలకు సైతం కేంద్రంగా ఉంది" అని జైన్ వివరించారు. కార్యాలయ స్థలాల లీజులో (ఆఫీస్ స్పేస్) బెంగళూరు సగటున 38–40 శాతం వాటాను కలిగి ఉందని.. అలాగే, బెంగళూరులో వార్షిక ఆఫీసు లీజు పరిమాణంలో టెక్నాలజీ రంగాలకు సంబంధించి 38–40 శాతంగా ఉందని ఈ నివేదిక తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-8-2022	
విశాఖ	425–00
చిత్తూరు	423–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	405–00
విజయవాడ	405–00
రిటైల్ ధర (డజను)	60.00
29-8-2022 ఫామ్ ధర...	
హైదరాబాద్	370–00
వరంగల్	372–00
రిటైల్ ధర	4.30

పావెల్ ప్రకటనతో భారీ పతనం

- సెన్సెక్స్ 861 పాయింట్లు క్రాష్
- నిఫ్టీకి 246 పాయింట్ల నష్టం
- ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు
- రూ.2.39 లక్షల కోట్ల సంపద ఆవిరి



ముంబై: ద్రవ్యోల్బణ కట్టడికి వడ్డీరేట్ల పెంపు తప్పదని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రకటనతో సోమవారం స్టాక్ మార్కెట్ భారీగా నష్టపోయింది. ఉదయం భారీ నష్టాలతో మొదలైన సూచీలు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల ప్రభావంతో రోజంతా బలహీనంగానే ట్రేడయ్యాయి. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక షేర్లలో విక్రయాలు వెల్లువెత్తడంతో సెన్సెక్స్ 861 పాయింట్లు క్షీణించి 57,973 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 246 పాయింట్ల పతనంతో 17,313 వద్ద నిలిచింది. ఆసియాలో ఒక్క చైనా అన్ని దేశాల స్టాక్ సూచీలు రెండుశాతం నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 0.50% నుంచి ఒకశాతం పతనమయ్యాయి. అమెరికా సూచీలు పావుశాతం నష్టాలతో ట్రేడవుతున్నాయి. సెన్సెక్స్ ఒకటిన్నర నష్టంతో బీఎస్‌ఈలో రూ.2.39 లక్షల కోట్ల సంపద మాయమైంది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈ నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.274 లక్షల కోట్లకు దిగివచ్చింది.

ఆరంభ నష్టాల నుంచి రికవరీ

అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో ఉదయం స్టాక్ మార్కెట్ భారీ నష్టాలతో మొదలైంది. సెన్సెక్స్ 1467 పాయింట్ల పతనంతో 57,367 వద్ద, నిఫ్టీ 370 పాయింట్ల పతనంతో 370 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 57,367 వద్ద కనిష్టాన్ని, 58,208 గరిష్టాన్ని చూసింది. నిఫ్టీ 17,380 – 17,166 పరిధిలో ట్రేడైంది. రిలయన్స్ షేరు ఒడిదుడుకులకు లోనై, చివరికి ఒక శాతం నష్టంతో రూ.2,597 వద్ద ముగిసింది.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	51,265
బంగారం (99.5 స్వచ్ఛత)	51,060
వెండి (కిలో)	54,316

భవిత

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్మీలో 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్-48 కోర్సులో ప్రవేశాలు

ఆర్మీలో పర్మనెంట్ కమిషన్‌కు సంబంధించి జనవరి 2023 నుంచి ప్రారంభమయ్యే 10+2 టెక్నికల్ ఎంట్రీ స్కీమ్-48 కోర్సులో ప్రవేశాలకు భారత సైన్యం అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 90
» అర్హత: కనీసం 60శాతం మార్కులతో 10+2(ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమేటిక్స్) ఉత్తీర్ణతతోపాటు తప్పనిసరిగా జేఈఈ(మెయిన్స్)–2022కు హాజరై ఉండాలి.
» వయసు: 16ఏళ్ల కంటే తక్కువ, 19 ఏళ్ల కంటే ఎక్కువ ఉండకూడదు.
» ఎంపిక విధానం:స్టేజ్–1,స్టేజ్–2, ఇంటర్వ్యూ,మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 21.09.2022
» వెబ్‌సైట్: joinindianarmy.nic.in

ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్, తమిళనాడులో 226 పోస్టులు

తమిళనాడు రాష్ట్రం నైవేలిలోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్.. దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌ఎల్‌సీ ఇండియా యూనిట్లలో వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈ4 గ్రేడ్)–167, డిప్యూటీ మేనేజర్(ఈ3 గ్రేడ్)–39, మేనేజర్(ఈ4 గ్రేడ్)–20.
» విభాగాలు: మెకానికల్(థర్మల్), మెకానికల్(మైన్స్), ఎలక్ట్రికల్(థర్మల్), ఎలక్ట్రికల్(రెన్యూవబుల్ ఎనర్జీ), సివిల్(థర్మల్), సివిల్(మైన్స్), సివిల్(రెన్యూవబుల్ ఎనర్జీ), సైంటిఫిక్(థర్మల్), జియాలజీ(మైన్స్), ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్(మైన్స్), ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్, కెమికల్(మైన్స్), హెచ్‌ఆర్, లీగల్.
» అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, డిప్లొమా, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: ఈ4 గ్రేడ్–36ఏళ్లు, ఈ3 గ్రేడ్–32ఏళ్లు మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 24.09.2022
» వెబ్‌సైట్: www.nlcindia.in

సీసీఎంబీ, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ.. ఒప్పంద ప్రాతిపదికన పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ అసోసియేట్1–01, ల్యాబొరేటరీ అసిస్టెంట్–01, సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్–02, ప్రాజెక్ట్ అసోసియేట్2–04.
» అర్హత: పోస్టును అనుసరించి బీఎస్సీ(బయోటెక్నాలజీ/బయోకెమిస్ట్రీ), బీఈ, బీటెక్, ఎంబీబీఎస్, మాస్టర్స్ డిగ్రీ(నేచురల్ సైన్సెస్) ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» ఇంటర్వ్యూ తేది: 02.09.2022
» వేదిక: సీసీఎంబీ, హబ్సిగూడ, హైదరాబాద్.
» వెబ్‌సైట్: ccmb.res.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్

తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్).. ఒప్పంద ప్రాతిపదికన ప్రిన్సిపల్ సైంటిఫిక్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 01
» అర్హత:పీహెచ్‌డీ(బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, మాలిక్యులార్ బయాలజీ) ఉత్తీర్ణతతో పాటు పదేళ్ల పని అనుభవం ఉండాలి.
» జీతం: నెలకు రూ.1,87,060 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష/స్కిల్‌టెస్ట్/ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 13.09.2022
» వెబ్‌సైట్: iisertirupati.ac.in

సిపెట్, విజయవాడలో లెక్చరర్ పోస్టులు

విజయవాడలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజనీరింగ్–టెక్నాలజీ ఒప్పంద ప్రాతిపదికన లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 05
» పోస్టుల వివరాలు: లెక్చరర్(ప్లాస్టిక్స్ ఇంజనీరింగ్– టెక్నాలజీ /మెకానికల్/కంప్యూటర్ సైన్స్)–04, ప్లేస్‌మెంట్ కన్సల్టెంట్–01.
» అర్హత: సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 65ఏళ్ల లోపు ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జాయింట్ డైరెక్టర్–హెడ్, సిపెట్, విజయవాడ, సర్వే నెం.377, సూరంపల్లి గ్రామం, గన్నవరం మండలం, విజయవాడ చిరునామాకు రిజిస్టర్డ్/స్పీడ్ పోస్టు ద్వారా పంపాలి.
» దరఖాస్తులకు చివరితేది: 20.09.2022
» వెబ్‌సైట్: www.cipet.gov.in

విదేశీ విద్యకు.. ఐఈఎల్‌టీఎస్

» ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌తో విదేశీ వర్సిటీల్లో ప్రవేశం
» నాలుగు విభాగాల్లో పరీక్ష నిర్వహణ

ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టెస్టింగ్ సిస్టమ్.. ఐఈఎల్‌టీఎస్! ఇది విదేశాల్లో ఉన్నత విద్యకు వెళ్లాలనుకునే విద్యార్థుల ఇంగ్లిష్ నైపుణ్యాలను పరిశీలించేందుకు అంతర్జాతీయంగా నిర్వహించే లాంగ్వేజ్ టెస్ట్! ముఖ్యంగా అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లోని యూనివర్సిటీల్లో ప్రవేశం పొందాలంటే.. జీమ్యాట్, జీఆర్ఈలతో పాటు.. లాంగ్వేజ్ టెస్ట్‌లోనూ స్కోర్ సాధించాలి. టోఫెల్, పియర్సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ వంటి లాంగ్వేజ్ టెస్ట్‌లు ఉన్నా.. ఐఈఎల్‌టీఎస్‌కు పోటీ పెరుగుతోంది! స్టడీ అబ్రాడ్‌కు సన్నద్ధతమవుతున్న విద్యార్థులకు ఉపయోగపడేలా ఐఈఎల్‌టీఎస్ ప్రాధాన్యత, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలపై ప్రత్యేక కథనం...


ఐఈఎల్‌టీఎస్.. తొలుత యూరప్ దేశాలకే పరిమితమని భావించేవారు. కానీ ఈ టెస్ట్ ప్రామాణికత, పరీక్ష విధానం తదితర కారణాల వల్ల ఇప్పుడు దాదాపు అన్ని దేశాలు ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌ను పరిగణనలోకి తీసుకుంటున్నాయి. ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌ను ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో పదకొండు వేలకుపైగా ఇన్‌స్టిట్యూట్‌లు, యూనివర్సిటీలు ప్రామాణికంగా భావిస్తున్నాయి. గతంలో టోఫెల్ స్కోర్‌తోనే దరఖాస్తులు స్వీకరించిన అమెరికాలోని ఇన్‌స్టిట్యూట్స్ కూడా ఇప్పుడు ఐఈఎల్‌టీఎస్ స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తున్నాయి. యూఎస్‌లోని 3,400కు పైగా విద్యాసంస్థలు ఐఈఎల్‌టీఎస్ ఆధారంగా అడ్మిషన్స్ ఖరారు చేస్తున్నాయి.

నాలుగు విభాగాల్లో పరీక్ష

ఐఈఎల్‌టీఎస్ పరీక్ష.. మొత్తం నాలుగు విభాగాల్లో అభ్యర్థుల ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పరిశీలించేలా నిర్వహిస్తున్నారు. అవి..లిజనింగ్, రీడింగ్, రైటింగ్, స్పీకింగ్. విభాగాల వారీగా పరీక్ష విధానం, మార్కింగ్ వివరాలు..

లిజనింగ్

- 30 నిమిషాల వ్యవధిలో జరిగే లిజనింగ్ టెస్ట్ ప్రధాన ఉద్దేశం..సదరు విద్యార్థి అన్ని దేశాల 'యాస'లను అర్థం చేసుకోగలడా.. లేదా అనేది పరిశీలించడం. అభ్యర్థులకు ఆయా అంశాలకు సంబంధించిన నాలుగు సంభాషణల ఆడియో రికార్డ్‌లను వినిపిస్తారు. వాటి ఆధారంగా ప్రశ్నలు అడుగుతారు. అవి.. **రికార్డింగ్–1:** నిజ జీవిత సంఘటనలపై ఇద్దరు వ్యక్తుల మధ్య సంభాషణ. **రికార్డింగ్–2:** నిజ జీవిత సంఘటనలపై ప్రసంగం. **రికార్డింగ్–3:** విద్య లేదా శిక్షణకు సంబంధించి గరిష్టంగా నలుగురు వ్యక్తుల మధ్య సంభాషణ. **రికార్డింగ్–4:** ఒక అకడమిక్ సబ్జెక్ట్‌పై యూనివర్సిటీ లెక్చర్.
- మొత్తం 30 నిమిషాల వ్యవధిలో ఇవి ఉంటాయి. వీటి నుంచి 40 ప్రశ్నలు అడుగుతారు.



మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు, మ్యాచింగ్ టైప్ ప్రశ్నలు, ప్లాన్/మ్యాప్/ డయాగ్రమ్ లేబిలింగ్ తదితర రూపాల్లో ప్రశ్నలు అడుగుతారు.

- ఇలా.. గరిష్టంగా 40 మార్కులకు నిర్వహించే లిజనింగ్ టెస్ట్‌ను 9 బ్యాండ్ స్కేల్‌లోకి క్రోడీకరించి.. అభ్యర్థులు చూపిన ప్రతిభ ఆధారంగా బ్యాండ్స్ కేటాయిస్తారు.

రీడింగ్

నిర్ణీత అంశానికి సంబంధించి చదివిన విషయాన్ని విద్యార్థి ఏ స్థాయిలో అర్థం చేసుకోగలడో తెలుసుకునేందుకు ఈ పరీక్ష జరుగుతుంది. మొత్తం 60 నిమిషాల వ్యవధిలో రీడింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ సమయంలో మూడు ప్యాసేజ్‌లను చదివి.. దాదాపు 40 ప్రశ్నలకు సమాధానాలివ్వాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు కేటాయిస్తారు.

రైటింగ్

- విద్యార్థికున్న ఇంగ్లిష్ రాత నైపుణ్యాన్ని పరీక్షించే విభాగం ఇది. ఇందులో రెండు టాస్క్‌లు ఇచ్చి.. వాటికి అభ్యర్థుల నుంచి సమాధానాలు అడుగుతారు.
- టాస్క్–1లో గ్రాఫ్ లేదా టేబుల్ లేదా డయాగ్రమ్ ఇచ్చి దానిపై విశ్లేషణ రాయమంటారు.
- టాస్క్–2లో ఒక అంశం లేదా సమస్య లేదా చర్చకు సంబంధించిన స్టేట్‌మెంట్‌ను చదివి విద్యార్థి తనదైన విశ్లేషణ చేయాలి. ఐఈఎల్‌టీఎస్ టాస్క్–1లో 150 పదాలు, టాస్క్–2లో 250 పదాలతో సమాధానం రాస్తేనే ఉపయుక్తంగా ఉంటుంది.

స్పీకింగ్

అభ్యర్థుల్లోని స్పోకెన్ ఇంగ్లిష్ నైపుణ్యాలను పరిశీలించే ఉద్దేశంతో స్పీకింగ్ విభాగంలో పరీక్ష నిర్వహిస్తారు. మూడు పార్ట్‌లుగా స్పీకింగ్ టెస్ట్ ఉంటుంది.

- **పార్ట్–1:** ఈ విభాగంలో అభ్యర్థులకు సంబంధించి సాధారణ విషయాల(ఉదా: కుటుంబ నేపథ్యం, చదువు, ఉద్యోగం, ఆసక్తులు తదితర అంశాలు)పై ప్రశ్నలు అడుగుతారు. ఈ విభాగం నాలుగు నుంచి అయిదు నిమిషాల వ్యవధిలో ఉంటుంది.
- **పార్ట్–2:** నిర్దిష్టంగా ఒక అంశంపై మాట్లాడాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ముందుగా సదరు అంశంపై అవగాహనకు ఒక నిమిషం సమయం కేటాయిస్తారు. ఆ తర్వాత గరిష్టంగా రెండు నిమిషాల వ్యవధిలో ఒకటి లేదా రెండు ప్రశ్నలు అడుగుతారు.
- **పార్ట్–3:** పార్ట్–2కు కొనసాగింపుగా పార్ట్–3ని నిర్వహిస్తారు. పార్ట్–2లో చర్చించిన అంశంపై మరింత కూలంకషంగా చర్చించడం, ఐడియాలు, సమస్యల గురించి చర్చించాల్సి ఉంటుంది. ఈ పార్ట్ నాలుగు నుంచి అయిదు నిమిషాల వ్యవధిలో ముగుస్తుంది.
- మొత్తంగా 11 నుంచి 14 నిమిషాల వ్యవధిలో స్పీకింగ్ విభాగంలో పరీక్షను నిర్వహిస్తారు.

9 బ్యాండ్ స్కేల్

- అన్ని విభాగాల్లోనూ అభ్యర్థులు పొందిన మార్కుల ఆధారంగా 9 బ్యాండ్ స్కేల్ విధానంలో స్కోర్‌ను నిర్ధారిస్తారు. 9 బ్యాండ్స్ పొందితే ఎక్స్‌పర్ట్ యూజర్‌గా, 8 బ్యాండ్స్ పొందితే వెరీ గుడ్ యూజర్‌గా, 7బ్యాండ్స్ పొందితే గుడ్ యూజర్‌గా, 6 బ్యాండ్స్ పొందితే కాంపిటెంట్ యూజర్‌గా, 5 బ్యాండ్స్ పొందితే మోడెస్ట్ యూజర్, 4 బ్యాండ్స్ పొందితే లిమిటెడ్ యూజర్, 3 బ్యాండ్స్ పొందితే ఎక్స్‌ట్రీమ్లీ లిమిటెడ్ యూజర్, 2 బ్యాండ్స్ పొందితే ఇంటర్మిటెంట్ యూజర్, 1 బ్యాండ్ పొందితే నాన్–యూజర్‌గా పేర్కొంటారు.
- కాబట్టి విద్యార్థులు కనీసం ఆరు బ్యాండ్స్ పొందేలా కృషి చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. అప్పుడు మాత్రమే ఆయా యూనివర్సిటీలు వారి దరఖాస్తులను పరిగణనలోకి తీసుకుంటాయని అంటున్నారు.

సన్నద్ధత ఇలా

- ఐఈఎల్‌టీఎస్‌లో బెస్ట్ స్కోర్‌కు అభ్యర్థులు విభిన్న వ్యూహంతో ప్రిపరేషన్ సాగించాలి. అకడమిక్ పరీక్షల మాదిరిగా పరీక్ష కోణంలో కాకుండా.. నైపుణ్యాలు పెంచుకునేలా చదవాలి. గ్రామర్ బుక్స్ కంటే.. వొకాబ్యులరీని పెంచే పుస్తకాలు చదవడం ఉపకరిస్తుంది. రీడింగ్‌లో పరిజ్ఞానం పెంచుకోవడానికి నవలలు, ఇంగ్లిష్ న్యూస్ పేపర్లు క్రమం తప్పకుండా చదవాలి. ఇంగ్లిష్‌లిటరేచర్‌కు సంబంధించినవే కాకుండా.. బిజినెస్, సైన్స్, ఆర్ట్స్ సంబంధిత వ్యాసాలు చదవడం, వినడం ద్వారా విభిన్న పదజాలంపై అవగాహన లభిస్తుంది. ఇది పరీక్ష సమయంలో ముఖ్యంగా లిజనింగ్, రీడింగ్ విషయంలో ఎంతో లాభిస్తుంది.
- రైటింగ్ నాలెడ్జ్ పెంచుకోవడానికి 'యాక్టివ్ వాయిస్, ప్యాసివ్ వాయిస్', 'సబ్జెక్ట్ అండ్ వెర్బ్ అగ్రిమెంట్', 'కాంప్లెక్స్ సెంటెన్స్ ఫార్మేషన్'పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాలి. ప్రాక్టీస్ సమయంలో స్పీడ్ రీడింగ్ అలవర్చుకోవాలి. ప్రతి పదానికి, ప్రతి వాక్యానికి అర్థం వెతకడానికి ప్రయత్నించే బదులు.. కాన్సెప్ట్ ఆధారంగా త్వరగా అర్థం చేసుకోవాలి. ఇది స్పీడ్ రీడింగ్‌కు కూడా ఉపయోగపడుతుంది.
- లిజనింగ్‌లో నైపుణ్యం కోసం ఇంగ్లిష్ సినిమాలు, ఇంగ్లిష్ న్యూస్ ఛానెల్స్ వీక్షించాలి.
- స్పీకింగ్ స్కిల్ పెంచుకోవడానికి ఇంగ్లిష్ పత్రికలు, పుస్తకాల్లోని అంశాలను, ప్యాసేజీలను చదవడంతోపాటు మాట్లాడటం ప్రాక్టీస్ చేయాలి.

స్కోర్‌కు రెండేళ్ల గుర్తింపు

- ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌కు రెండేళ్లపాటు గుర్తింపు ఉంటుంది. అంటే.. సదరు స్కోర్ కార్డ్ ఆధారంగా రెండేళ్లపాటు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ఐఈఎల్‌టీఎస్ పరీక్షకు ఏడాదిలో ఎప్పుడైనా, ఎన్ని సార్లయినా హాజరయ్యే అవకాశం ఉంటుంది.
- పరీక్షకు కనీసం వారం ముందు టెస్ట్ డేట్ బుక్ చేసుకోవాలి. ఇందుకోసం ఐఈఎల్‌టీఎస్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న స్లాట్స్‌ను చూసుకుని దానికి అనుగుణంగా.. దరఖాస్తు ప్రక్రియను ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలి.
- టెస్ట్ పూర్తయిన తర్వాత 13 రోజులకు ఫలితాలు విడుదల చేస్తారు. ఆ ఫలితాల్లో సరైన స్కోర్ రాలేదని భావిస్తే.. మరో స్లాట్‌లో పరీక్షకు హాజరయ్యే అవకాశం ఉంటుంది.
- అభ్యర్థులు గరిష్టంగా రెండు స్లాట్లలోనే మెరుగైన స్కోర్ సాధించేలా ప్రయత్నించాలని నిపుణులు సూచిస్తున్నారు. మూడు, నాలుగు స్లాట్లకు హాజరైతే అది యూనివర్సిటీ ప్రవేశాల సమయంలో కొంత ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంటున్నారు.

ఐఈఎల్‌టీఎస్-ముఖ్య సమాచారం

- అంతర్జాతీయంగా 11 వేలకు పైగా యూనివర్సిటీలకు, ఇన్‌స్టిట్యూట్స్‌కు ప్రామాణికంగా నిలుస్తున్న ఐఈఎల్‌టీఎస్ స్కోర్.
- అమెరికాలోనూ టోఫెల్‌తోపాటు ఐఈఎల్‌టీఎస్ స్కోర్‌తో ప్రవేశాలు కల్పిస్తున్న పలు యూనివర్సిటీలు.
- ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు విధానాల్లోనూ పరీక్ష నిర్వహణ.
- 9 బ్యాండ్ స్కేల్ విధానంలో స్కోరింగ్.
- కనీసం 6 బ్యాండ్స్ సాధిస్తే మెరుగైన ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశం లభించే అవకాశం.
- ఐఈఎల్‌టీఎస్ ముఖ్యమైన వెబ్‌సైట్స్:
  https://ielts.org
  https://www.britishcouncil.in/exam/ielts
  https://www.ieltsidpindia.com



పాతాళగంగ.. పెల్లుబుకంగ!

అన్నమయ్య జిల్లాలో పాతాళగంగ పెల్లుబుకుతోంది. బి.కొత్తకోట మండలం నాయనబావి పంచాయతీకి చెందిన గుట్టపాళ్యం పరిసరాల్లో బి.కొత్తకోట–మదనపల్లె రోడ్డుకు ఇరువైపులా రైతులు వ్యవసాయ బోర్లకు మోటార్లు లేకుండానే పంటలు సాగుచేస్తున్నారు. గతంలో వీరు పంటల సాగు కోసం బోర్లు వేసుకున్నారు. అయితే ఈ బోర్లకు మూడేళ్లుగా మోటార్లు అమర్చాల్సిన అవసరం లేకుండా పోయింది. భూగర్భజలాలు పుష్కలంగా ఉండటంతో కొందరు రైతుల బోర్ల నుంచి నీళ్లు పైకి నిరంతరాయంగా ఉబికి వస్తున్నాయి. ఈ నీళ్లను పైపుల ద్వారా పొలాలకు మళ్లించి పంటలు పండిస్తున్నారు. – బి.కొత్తకోట



సూక్ష్మ కళతో 'మహా'నేతకు నివాళి

తనకు ఎంతో ఇష్టమైన దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి జీవిత చరిత్రను సూక్ష్మ కళతో పెన్సిళ్ల మొనలపై రాసింది డిగ్రీ విద్యార్థిని అన్నం మహిత. బాపట్ల జిల్లా కారంచేడు మండలం స్వర్ణ గ్రామానికి చెందిన మహిత.. వైఎస్సార్ బాల్యం నుంచి ఆయన చివరి మజిలీకి సంబంధించిన అంశాలను పెన్సిళ్లపై రాసింది. ఐదు రోజుల వ్యవధిలో 100 పెన్సిళ్లపై ఆంగ్లంలో రాసి, ఫ్రేమ్ కట్టించినట్టు మహిత చెప్పింది. వైఎస్సార్ వర్ధంతి రోజున ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌కు అందించాలని ఉందని, తనను ఎవరైనా జగనన్న దగ్గరకు తీసుకెళ్లాలని కోరుతోంది. – కారంచేడు

ఎట్టకేలకు పులస పలికింది..!



గోదావరికి వరదలనేపథ్యంలో మొన్నటి దాకా కానరాకుండా పోయిన పులసలు ఇప్పుడిప్పుడే మత్స్యకారుల వలలకు చిక్కుతున్నాయి. కోనసీమ జిల్లాకు చేరువలోని యానాం గౌతమీ గోదావరిలో సోమవారం మత్స్యకారులకు రెండు కేజీల బరువు గల పులస చేప చిక్కింది. స్థానిక రాజీవ్ రివర్ బీచ్ వద్ద జరిగిన వేలం పాటలో రూ.22 వేలకు అమ్ముడుపోయింది. కొన్న వ్యక్తి మళ్లీ దానిని రూ.23 వేలకు విక్రయించాడు. – యానాం

క్లుప్తంగా

ప్రజల్లో అవగాహన కోసం తెలుగులోనే తీర్పు

- కడప ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కెతావత్ మోతీలాల్



కడప అర్బన్: ప్రజల్లో అవగాహన పెంపొందించేలా తాను తెలుగులోనే తీర్పును ఇచ్చినట్లు కడపలోని ప్రధాన దిగువ తరగతి పౌర న్యాయస్థానం న్యాయమూర్తి (ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి) కెతావత్ మోతీలాల్ అన్నారు. తెలుగు భాషాదినోత్సవం సందర్భంగా కడప జిల్లా కోర్టులోని తన చాంబర్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో జడ్జి మోతీలాల్ మాట్లాడుతూ తాను తెలుగుభాషలో ఇస్తున్న తీర్పుల్లో ఇది మూడోదని చెప్పారు. పుంగనూరు కోర్టులో 2016లో, పాలకొల్లులో 2018లో తెలుగులో తీర్పు ఇచ్చామన్నారు. తాజాగా సోమవారం కడప కోర్టులో తెలుగులోనే తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

కార్పొరేట్ స్కూళ్లలో విద్య శిక్షగా మారింది

- జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్



పురస్కారాలు అందజేస్తున్న జస్టిస్ దేవానంద్, జస్టిస్ మానవేంద్రనాథ్ రాయ్ తదితరులు

గుడివాడ టౌన్: కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోవడం పిల్లలకు ఒక శిక్షగా మారిందని, విద్య ఎక్కడ నేర్చుకున్నా ఒకటేననే భావనను ప్రస్తుత సమాజం గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్ అన్నారు. కృష్ణాజిల్లా గుడివాడలో సోమవారం బట్టు వెంకటరత్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన బట్టు మనోరంజితం మెమోరియల్ ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్య అందుతుందన్నారు. అనంతరం 40 మంది విద్యార్థులకు నగదు పురస్కారాలు, జ్ఞాపికలు అందజేశారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్, కలెక్టర్ రంజిత్ బాషా, ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకరరెడ్డి, ఆర్డీవో పి.పద్మావతి, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ బట్టు అంబేడ్కర్, సీనియర్ సివిల్ జడ్జి పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్ కుమార్, మేజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి కె.నాగలక్ష్మి, ట్రస్ట్ చైర్‌పర్సన్ బట్టు పద్మకుమారి పాల్గొన్నారు.

కొత్త స్కూటర్ కొనివ్వండి

- కర్నూలు జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు

సాక్షి, అమరావతి: ఎలక్ట్రిక్ స్కూటర్ సేవాలోపంతో మానసిక వేదనకు గురైన ఫిర్యాదుదారుడికి వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో ఊరట లభించింది. లోపభూయిష్టమైన పాత వాహనం స్థానంలో కొత్త స్కూటర్ ఇవ్వడం.. లేదంటే స్కూటర్ కొనుగోలుకు వెచ్చించిన మొత్తం, మరమ్మతు ఖర్చులు, రిజిస్ట్రేషన్ చార్జీలు కలిపి రూ.77,657ను 6 శాతం వడ్డీతో వాహనం కొనుగోలుచేసిన తేదీనుంచి లెక్కగట్టి చెల్లించాలంటూ కిషోర్‌కుమార్, నారాయణరెడ్డి, నజీమాకౌర్‌తో కూడిన కర్నూలు జిల్లా కమిషన్ ఈనెల 25న తెలుగులో తీర్పు వెలువరించింది. ఫిర్యాదీ కర్నూలు జిల్లా అవుకు గ్రామానికి చెందిన శంకరశర్మ మానసిక వేదనకు గురైన కారణంగా రూ.10 వేలు, కోర్టు ఖర్చులు రూ.5 వేలు అదనంగా అందించాలని ప్రతివాదులను ఆదేశించింది. ఈ మేరకు నజీమా కౌర్ తీర్పు చదవి వినిపించారు. శంకరశర్మ రాజస్థాన్‌లోని ఒకినావా ఆటో టెక్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహనాన్ని 2018 మే నెలలో రూ.72,900కు కొనుగోలు చేయగా.. అదే ఏడాది ఆగస్టులో డెలివరీ చేశారు. కొన్నప్పటి నుంచీ వాహనం మొరాయించేది. మరమ్మతులు చేసినా ఫలితం లేపోయింది. ఈ క్రమంలో ఆయన తనకు న్యాయం చేయాలంటూ 2021 సెప్టెంబర్ 25న కమిషన్‌ను ఆశ్రయించారు. వాదనలు విన్న కమిషన్ ఈ నెల 10న తుది విచారణ చేపట్టి.. తయారీసంస్థతోపాటు ఇద్దరు డీలర్లు కొత్త వాహనం లేదా తాము సూచించిన విధంగా నష్టపరిహారాన్ని చెల్లించాలంటూ తీర్పునిచ్చింది.

ఏపీని ఆదర్శంగా తీసుకోండి

అన్ని రాష్ట్రాల్లో ఈ-క్రాప్ అమలు చేయండి

- 2023 మార్చికల్లా ఆచరణలోకి తీసుకురండి
- రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి మనోజ్ అహూజా సూచన
- కేంద్ర స్టీరింగ్ కమిటీలో ఏపీకి భాగస్వామ్యం
- కమిటీలో స్పెషల్ సీఎస్ పూనమ్‌కు ప్రాతినిధ్యం
- ఈ-క్రాప్‌పై జాతీయస్థాయి వీడియో కాన్ఫరెన్స్
- వివిధ రాష్ట్రాల సందేహాలను నివృత్తి చేసిన ఏపీ అధికారులు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మూడేళ్లుగా విజయవంతంగా అమలుచేస్తున్న ఎలక్ట్రానిక్ క్రాపింగ్ (ఈ–క్రాప్)ను 2023 మార్చికల్లా అన్ని రాష్ట్రాలు అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి మనోజ్ అహూజా సూచించారు. ఏపీని ఆదర్శంగా తీసుకొని ఈ–క్రాపింగ్ అమలుచేయాలని సూచించారు. అగ్రిస్టాక్ డిజిటల్ అగ్రికల్చర్ పేరిట జాతీయ స్థాయిలో ఈ–క్రాపింగ్ అమలుపై అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖాధికారులతో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించింది. ఈ సమావేశంలో అహూజా మాట్లాడుతూ వాస్తవ సాగుదారులకు సంక్షేమ ఫలాలు అందించేందుకు ఏపీలో ఈ క్రాపింగ్ విధానాన్ని అమలు చేస్తున్నారని వివరించారు. ప్రస్తుత



వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ-క్రాప్ అమలుపై అవగాహన కల్పిస్తున్న హరికిరణ్

ఖరీఫ్, వచ్చే రబీసీజన్‌లో అన్ని రాష్ట్రాలు పైలెట్ ప్రాజెక్టుగా ఈ–క్రాపింగ్‌ను అమలు చేయాలని సూచిం చారు. 2023 మార్చి నుంచి పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. ఏపీలో ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న చోట ఆన్‌లైన్‌లో, లేని చోట ఆఫ్‌లైన్‌లో ఈ–క్రాపింగ్ నమోదు చేస్తున్నారని చెప్పారు. ఇదే హైబ్రిడ్ విధానంలో అన్ని రాష్ట్రాలూ పాటించాలన్నారు. ఇంటర్నెట్ సౌకర్యం లేని చోట ఆఫ్‌లైన్‌లో నమోదు చేసి, ఆ వివరాలను ఇంటర్నెట్ ఉన్న చోట ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని సూచించారు.

రైతులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా

ఈ–క్రాప్ అమలుపై రాష్ట్ర వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ పూనం మాలకొండయ్య, స్పెషల్ కమిషనర్ హరికిరణ్ ఇతర రాష్ట్రాల అధికారులకు వివరించారు. వాస్తవ సాగుదారులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన మేరకు ఈ–క్రాపింగ్‌ను డిజైన్ చేసినట్లు తెలిపారు. ఈ–క్రాపింగ్ ప్రామాణికంగా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులతో పాటు రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, పంట రుణాలు, సున్నా వడ్డీ రాయితీ, పంట నష్ట పరిహారం, పంటల బీమా వంటి అన్ని పథకాలనూ అందిస్తున్నామన్నారు. గ్రామస్థాయిలో ఆర్బీకేల ద్వారా ధాన్యం, ఇతర పంటల కొనుగోళ్లను కూడా దీని ఆధారంగానే చేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకాన్ని పీఎంఎఫ్‌బీవైతో అనుసంధానించి అమలు చేయనున్నట్లు చెప్పారు. ఆర్బీకేలు, సచివాలయాల్లో ఉండే వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ సహాయకులు సంయుక్తంగా ఈ–క్రాపింగ్ నమోదు చేసి, ప్రతి రైతుకు రశీదులు ఇస్తున్నారన్నారు. వివిధ రాష్ట్రాల అధికారుల సందేహాలను స్పెషల్ సీఎస్, కమిషనర్ నివృత్తి చేశారు. వందేళ్ల తర్వాత రాష్ట్రంలో సమగ్ర భూసర్వేకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ సర్వే పూర్తయితే భూముల సరిహద్దులు కచ్చితంగా నిర్ధారణ అవుతాయని, ఈ క్రాప్‌ను మరింత పక్కాగా ఇంటిగ్రేట్ చేయవచ్చని చెప్పారు.

జాతీయ స్టీరింగ్ కమిటీలో తొలిసారి ప్రాతినిధ్యం

కేంద్ర వ్యవసాయ పథకాలు, కార్యక్రమాల అమలుకు జాతీయ స్థాయిలో ఏర్పాటు చేసిన స్టీరింగ్ కమిటీలో ఆంధ్రప్రదేశ్‌కి ప్రాతినిధ్యం కల్పించారు. ఈ కమిటీలో ఓ రాష్ట్రానికి ప్రాతినిధ్యం కల్పించడం ఇదే తొలిసారి. ఈ కమిటీలో కేంద్ర వ్యవసాయ మంత్రి, కార్యదర్శులు, సంబంధిత కేంద్ర ప్రభుత్వ అధికారులే ఉంటారు. ఆంధ్రప్రదేశ్‌ని ఆదర్శంగా తీసుకొని ఈ–క్రాపింగ్‌ను అమలు చేస్తున్నందున ఏపీ వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్‌కు కూడా చోటు కల్పించారు.

సచివాలయ వ్యవస్థ భేష్

ఏపీలో గ్రామీణాభివృద్ధికి అత్యుత్తమ చర్యలు



మల్లంగుంట సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న మిట్టర్‌సైన్ తదితరులు

- జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ ఏడీజీ మిట్టర్ సైన్ ప్రశంసలు
- తిరుపతి రూరల్ మల్లంగుంట సచివాలయం సందర్శన

తిరుపతి రూరల్ : రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ భేషుగ్గా ఉందని, గ్రామాల అభివృద్ధికి ఈ వ్యవస్థ వెన్నెముకగా నిలుస్తోందని జాతీయ గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు డైరెక్టర్ జనరల్ మిట్టర్‌సైన్ ప్రశంసించారు. తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట పంచాయతీ సచివాలయాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. చిన్న పంచాయతీలో తొమ్మిది మంది సిబ్బంది విధులు నిర్వర్తించడం, నిత్యం ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. అత్యుత్తమ పరిపాలన వ్యవస్థగా సచివాలయాలను అభివర్ణించారు. ఈ మేరకు ఆయన సచివాలయంలోని సందర్శకుల పుస్తకంలో తన అభిప్రాయాన్ని రాశారు. ఈ సందర్భంగా మిట్టర్ సైన్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణాభివృద్ధికి చేపడుతున్న చర్యలు అత్యుత్తమంగా ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రజలకు సత్వర సేవలను అందించేందుకు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది దోహదపడుతున్నారని తెలిపారు. తమ ఇంటికే వచ్చి వలంటీర్లు అందిస్తున్న సేవలను లబ్ధిదారులు ఈ సందర్భంగా ఏడీజీకి వివరించారు. అనంతరం సచివాలయం ప్రాంగణంలో ఆయన మొక్కలు నాటారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నియోజకవర్గంలో ప్రతి ఇంటికి అందిస్తున్న మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమాన్ని మల్లంగుంట పంచాయతీలో మిట్టర్ సైన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జానకమ్మ, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, డీఎల్‌డీవో సుశీలాదేవి, ఎంపీడీవో వెంకటనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మధుసూదనరావు పాల్గొన్నారు.

బెంచ్ హంటింగ్‌ను అనుమతించం


- కొందరు నిరర్థక వ్యాజ్యాలతో కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారు
- పిటిషనర్లకు కోర్టు ఖర్చులు విధిస్తాం : హైకోర్టు

సాక్షి, అమరావతి: ఓ వ్యక్తి దాఖలు చేసిన వ్యాజ్యంలో సింగిల్ జడ్జి వద్ద ఉత్తర్వులు రాకపోవడంతో అదే అంశంపై మరి కొందరు ధర్మాసనం ముందు ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేయడంపై హైకోర్టు మండిపడింది. ఇది బెంచ్ హంటింగ్(కావాల్సిన బెంచ్‌ను ఎంచుకోవడం) అవుతుందని, ఇలాంటి వాటిని తాము ఎంత మాత్రం అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. న్యాయవ్యవస్థ ప్రతిష్టను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ధర్మాసనం.. కొందరు ఇలాంటి వ్యాజ్యాలు దాఖలు చేస్తూ కోర్టు సమయాన్ని వృథా చేస్తున్నారంటూ మండిపడింది. పిటిషనర్లకు కోర్టు ఖర్చులు విధించేందుకు ఇది అన్నివిధాలా తగిన కేసని స్పష్టం చేసింది. పిటిషనర్లకు తప్పక ఖర్చులు విధిస్తామన్న ధర్మాసనం.. తదుపరి విచారణను సెప్టెంబర్ 6కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్‌మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులిచ్చింది. తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలం మర్రిపూడి గ్రామ పరిధిలో బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ ఏర్పాటును సవాలు చేస్తూ సుధాకర్‌రెడ్డి మరో ఇద్దరు పిల్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఏపీ కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తరఫు న్యాయవాది సురేందర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇదే అంశంపై సింగిల్ జడ్జి ముందు ఓ వ్యక్తి పిటిషన్ వేశారని, అందులో ఎలాంటి ఉత్తర్వులు రాలేదన్నారు. సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇవ్వలేదన్న విషయం తెలిసి కూడా పిటిషనర్లు మరలా ఈ పిల్ దాఖలు చేశారని, సింగిల్ జడ్జి ఉత్తర్వులు ఇవ్వలేదన్న విషయాన్ని పిటిషనర్లు తమ వ్యాజ్యంలో ఎక్కడా చెప్పలేదని, ఇది కోర్టును తప్పుదోవ పట్టించడమే అవుతుందన్నారు.

రాజధాని ఇళ్లపట్టాల కేసు విచారణ అక్టోబర్ 21కి వాయిదా

సుప్రీంకోర్టులో ఎస్ఎల్పీ పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ధర్మాసనం నిర్ణయం

సాక్షి, అమరావతి: 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకం కింద రాజధాని ప్రాంతంలో ఇళ్ల పట్టాల పంపిణీ కోసం జారీచేసిన జీవో 107ను సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాల్లో తదుపరి విచారణ అక్టోబర్ 21కి వాయిదా పడింది. రాజధాని వ్యవహారంలో కొందరు రైతులు సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలుచేసిన నేపథ్యంలో ఈ వ్యాజ్యాల్లో విచారణను వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తులు జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజులు, జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్‌ల త్రిసభ్య ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్ర ప్రభుత్వం 2020 ఫిబ్రవరి 25న జారీచేసిన జీవో



107ను సవాలు చేస్తూ గుంటూరు జిల్లాకు చెందిన జి.హరిగోవింద్‌ప్రసాద్, రాయపూడికి చెందిన పఠాన్ మున్నా, కృష్ణాయపాలేనికి చెందిన అవల నందకిషోర్, తుళ్లూరుకు చెందిన కొల్లి సాంబశివరావు వేర్వేరుగా హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే. అప్పట్లో ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన అప్పటి త్రిసభ్య ధర్మాసనం ఈ జీవో అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ వ్యాజ్యాలను సీజే నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారించింది. పిటిషనర్ల న్యాయవాది కారుమంచి ఇంద్రనీల్‌బాబు వాదనలు వినిపించేందుకు సిద్ధమవుతుండగా ధర్మాసనం జోక్యం చేసుకుని.. రాజధాని వ్యవహారంలో కొందరు రైతులు సుప్రీంకోర్టును ఆశ్రయించినందున ఈ వ్యాజ్యాల్లో విచారణను అక్టోబర్ 21కి వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. ఈ సమయంలో ప్రభుత్వం తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. విచారణను రెండువారాలకు వాయిదా వేయాలని కోరారు. మధ్యంతర ఉత్తర్వుల వల్ల 50 వేలమందికి ఇళ్లపట్టాల మంజూరు ఆగిపోయిందని చెప్పారు. ధర్మాసనం స్పందిస్తూ.. రాజధానిని అమరావతిలోనే నిర్మిస్తున్నారా? అని అడిగింది. దీనికి ఔనని సమాధానం ఇస్తే మీరుకోరిన విధంగానే విచారణను చేపడతామని చెప్పింది. రాజధాని వ్యవహారం తన పరిధిలోనిది కాదని సుధాకర్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. దీంతో ధర్మాసనం విచారణను అక్టోబర్ 21కి వాయిదా వేస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేసింది.

ప్రత్యామ్నాయాలపై కేంద్రం చెప్పడం లేదు

- కేంద్రాన్ని వివరణ కోరండి.. హైకోర్టుకు నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం, పిటిషనర్లు
- విశాఖ ఉక్కు కేసు విచారణ సెప్టెంబర్ 21కి వాయిదా

సాక్షి, అమరావతి: విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు బదులుగా దాన్ని లాభాలబాట పట్టించేందుకు ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించిందా? లేదా? అన్న అంశంపై కేంద్ర ప్రభుత్వం తన కౌంటర్‌లో స్పష్టత ఇవ్వలేదని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం హైకోర్టుకు నివేదించింది. ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై కేంద్ర ప్రభుత్వాన్ని వివరణ కోరాలని రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ హైకోర్టును అభ్యర్థించారు. పిటిషనర్ల న్యాయవాదులు సైతం ఇదే రీతిలో కోరారు. స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు వల్ల నిర్వాసితులైనవారి కుటుంబసభ్యులు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని ఇప్పటికే దాఖలైన వ్యాజ్యాలతో జతచేయాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. అన్ని వ్యాజ్యాలను కలిపి సెప్టెంబర్ 21న విచారిస్తామంది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డి.వి.ఎస్.ఎస్.సోమయాజుల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిమిత్తం కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మాజీ ఐపీఎస్ అధికారి జేడీ లక్ష్మీనారాయణ హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే అంశంపై సువర్ణరాజు అనే వ్యక్తి కూడా పిల్ దాఖలు చేశారు. వీటిపై పలుమార్లు విచారించిన సీజే ధర్మాసనం సోమవారం మరోసారి విచారించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ శ్రీరామ్ స్పందిస్తూ, విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు బదులు, దాన్ని లాభాలబాట పట్టించేందుకు ప్రత్యామ్నాయాల అన్వేషణను నొక్కిచెబుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రధానమంత్రికి లేఖ రాశారని చెప్పారు. ముఖ్యమంత్రి లేవనెత్తిన అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు కేంద్రం తన కౌంటర్‌లో పేర్కొనలేదన్నారు. దీనిపై కేంద్రాన్ని వివరణ కోరాలన్నారు. జేడీ లక్ష్మీనారాయణ న్యాయవాది యలమంజుల బాలాజీ వాదనలు వినిపిస్తూ.. ఉక్కు పరిశ్రమ కోసం ఎంతోమంది తమ భూములను ఇచ్చారన్నారు. దాదాపు 22 వేల ఎకరాలను ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం తీసుకున్నారని తెలిపారు. భూములిచ్చినవారి కుటుంబసభ్యులకు ఉద్యోగాలిస్తామన్న హామీ ఇన్నేళ్లయినా అలాగే మిగిలిపోయిందని చెప్పారు. విశాఖ ఉక్కును లాభాలబాట పట్టించేందుకు ప్రత్యామ్నాయాలను పరిశీలించారో లేదో కేంద్రం చెప్పడం లేదన్నారు. ఈ సమయంలో న్యాయవాది వై.కోటేశ్వరరావు స్పందిస్తూ.. ఉక్కు కర్మాగారం ఏర్పాటుతో భూములు కోల్పోయి నిర్వాసితులు అయినవారి కుటుంబసభ్యులు పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. ఈ వ్యాజ్యాన్ని కూడా విచారించాలని కోరగా ధర్మాసనం అంగీకరించింది.

అవినీతి కేసుల్లో జాప్యాన్ని సహించం

- 2017లో నమోదైన కేసులో ఇప్పటికీ సీఐడీ దర్యాప్తు పూర్తి చేయకపోవడమేంటి?
- అప్పటి నుంచి నమోదైన అవినీతి కేసుల పురోగతిపై అఫిడవిట్ దాఖలు చేయండి
- హోంశాఖ ముఖ్య కార్యదర్శికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అవినీతి కేసుల దర్యాప్తు విషయంలో సీఐడీ ఉదాశీనంగా వ్యవహరిస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. జాప్యాన్ని సహించేది లేదని తేల్చిచెప్పింది. సాక్షులను నాలుగు నెలలకొకరిని, ఏడాదికొకరి చొప్పున విచారిస్తుంటే దర్యాప్తు ఎప్పటికి పూర్తి చేస్తారని సీఐడీని ప్రశ్నించింది. 2017లో నమోదైన ఓ కేసులో ఇప్పటివరకు దర్యాప్తు పూర్తిచేయకపోవడాన్ని తప్పుపట్టింది. 2017 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో ఎన్ని అవినీతి కేసులు నమోదయ్యాయి? ఆ కేసుల్లో దర్యాప్తు పురోగతేంటి? తదితర వివరాలను అఫిడవిట్ రూపంలో తమ ముందుంచాలని హోంశాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది. తదుపరి విచారణను సెప్టెంబర్ 14కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి(సీజే) జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజుల ధర్మాసనం సోమవారం ఉత్తర్వులిచ్చింది. కర్నూలు జిల్లా రాయలసీమ విశ్వవిద్యాలయంలో 2007–12 సంవత్సరాల మధ్య వివిధ కొనుగోళ్ల చెల్లింపుల వ్యవహారంలో రూ.1.46 కోట్ల మేర నిధుల దుర్వినియోగం జరిగినట్టు విజిలెన్స్ నివేదిక ఇచ్చినా.. బాధ్యులపై చర్యలు తీసుకోలేదని, చర్యలు తీసుకునేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ ఏఐఎస్ఎఫ్ నేత కల్లప్ప హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాజ్యంపై సీజే నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ జరిపింది. పిటిషనర్ న్యాయవాది యోగేష్ వాదనలు వినిపించారు. ఈ కేసులో ఇప్పటి వరకు 16 మంది సాక్షులను విచారించామని, త్వరలో కౌంటర్లు వేస్తామని.. కొంత గడువివ్వాలని సీఐడీ న్యాయవాది కోరారు. సీఐడీ అధిపతి ఎవరని ధర్మాసనం ఆరా తీయగా.. హోంశాఖ ముఖ్య కార్యదర్శే సీఐడీ అధిపతి అని ప్రభుత్వ న్యాయవాది(హోం) మహేశ్వరరెడ్డి చెప్పారు.

జస్టిస్ రాకేశ్‌కుమార్ వ్యాఖ్యలు పక్కన పెట్టిన సుప్రీంకోర్టు

- హెబియస్ కార్పస్ పిటిషన్లు విచారించాలని ఏపీ హైకోర్టుకు సూచన
- రాష్ట్రంలో రాజ్యాంగ వైఫల్యం జరిగిందా లేదా విచారిస్తామన్న జస్టిస్ రాకేశ్‌కుమార్
- సుప్రీంకోర్టులో సవాల్ చేసిన ఏపీ

సాక్షి, న్యూఢిల్లీ: హెబియస్ కార్పస్ పిటిషన్లపై విచారణ జరుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ వైఫల్యం జరిగిందా లేదా అనేది విచారిస్తామంటూ ఏపీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రాకేశ్ కుమార్ చేసిన వ్యాఖ్యల్ని సుప్రీంకోర్టు పక్కన పెట్టింది. జస్టిస్ రాకేశ్‌కుమార్ వ్యాఖ్యలు పక్కనపెట్టి హెబియస్ కార్పస్ పిటిషన్లపై విచారణ జరపాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు సూచించింది. ఈమేరకు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. విశాఖపట్నానికి చెందిన పలువురిని పోలీసులు నిర్బంధించారంటూ ఏపీ హైకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. దీనిపై జస్టిస్ రాకేశ్ కుమార్ ధర్మాసనం విచారణ జరుపుతూ ఆంధ్రప్రదేశ్‌లో రాజ్యాంగ వైఫల్యం జరిగిందా లేదా విచారణ జరుపుతామని ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించగా హైకోర్టులో విచారణకు సంబంధించి తదుపరి చర్యలన్నీ నిలిపివేస్తూ 2020 డిసెంబరులో స్టే ఇచ్చింది. తాజాగా సోమవారం ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ జేకే మహేశ్వరిలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. జస్టిస్ రాకేశ్‌కుమార్ వ్యాఖ్యల్ని పక్కనపెట్టింది. హెబియస్ కార్పస్ పిటిషన్లపై విచారణ జరపాలని హైకోర్టుకు సూచించింది. ఏపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు.

బాలకృష్ణకు సుప్రీంకోర్టు నోటీసులు

- గౌతమీపుత్ర శాతకర్ణి, రుద్రమదేవి నిర్మాతలకు కూడా..

సాక్షి, న్యూఢిల్లీ: గౌతమీపుత్ర శాతకర్ణి, రుద్రమదేవి సినిమా నిర్మాతలకు, సినీహీరో బాలకృష్ణకు సుప్రీంకోర్టు నోటీసులు జారీచేసింది. ఆ సినిమాలకు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు పన్ను మినహాయింపులు ఇచ్చినప్పటికీ టికెట్ ధరలు తగ్గించలేదంటూ సినీప్రేక్షకుల వినియోగదారుల సంఘం దాఖలుచేసిన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హిమాకోహ్లీల ధర్మాసనం విచారించింది. పిటిషనర్ న్యాయవాది శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ ప్రభుత్వాలు పన్ను మినహాయింపులు ఇచ్చినప్పటికీ ఆ ప్రయోజనం ప్రేక్షకులకు దక్కలేదని చెప్పారు. పన్ను మినహాయింపును రికవరీ చేయాలని కోరారు. అనంతరం ప్రతివాదులకు నోటీసులు జారీచేసిన ధర్మాసనం 8 వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, District Krishna - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.